

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 81

సోమవారం 12-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అప్పగించేశారు...

డబ్ల్యూటీసీ ఫైనల్లో భారత్ ఓటమి. ప్రపంచ చాంపియన్‌గా ఆస్ట్రేలియా. -12లో



వృద్ధాప్యంలో ఆదాయానికి..

రిటైర్మెంట్ తర్వాతా సంపద సృష్టి అవసరమే.. -13లో



మిగతా రాష్ట్రాలకూ అదే గతి

ఢిల్లీలో పాలనా సర్వీసులను నియంత్రిస్తూ కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌పై సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸



ప్రజా విశ్వాసమే నా ఆస్తి

ప్రజలకు న్యాయం చేకూర్చాలన్నదే తన ధ్యేయమని, అందుకోసం పోరాటం కొనసాగిస్తానని సచిన్ పైలెట్ చెప్పారు.

వివరాలు 6లో ▸



అతి తీవ్ర తుపానుగా బిపర్‌జోయ్

అరేబియా సముద్రంలో ఏర్పడిన తుపాను 'బిపర్‌జోయ్' అతి తీవ్ర తుపానుగా మారిందని ఐఎండీ తెలిపింది.

వివరాలు 6లో ▸



క్యూబాలో చైనా గూఢచారులు

కమ్యూనిస్ట్ చైనా తమ పొరుగు దేశం క్యూబాలో 2019 నుంచి గూఢచార స్థావరాన్ని నడుపుతోందని అమెరికా ఆరోపించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌కు లక్షన్నర మంది డుమ్మా!



రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 503 గ్రూప్‌–1 ఉద్యోగాలకు టీఎస్‌పీఎస్సీ ఆదివారం నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షకు దాదాపు లక్షన్నర మంది గైర్హాజరయ్యారు. గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌కు 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 2,33,248 మంది అభ్యర్థులే హాజరయ్యారు.

- వివరాలు 3లో▶

ఏపీలో 20 ఎంపీ సీట్లు గెలవాలి



వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో 20 ఎంపీ స్థానాలు గెలవాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. రాష్ట్రానికి కేంద్రం సహకరిస్తున్నందునే అభివృద్ధి సాధ్యమైందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి.. వారి ఆశీర్వాదం కోరాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

- వివరాలు 10లో▶

కొడంగల్ ఎమ్మెల్యేపై క్రిమినల్ కేసు



కొడంగల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిపై బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. ఓ భూవిక్రయం విషయంలో ఎమ్మెల్యే, మరికొందరు తనపై భౌతిక దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ సామ ఇంద్రపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. - 3లో▶

రాయలసీమను తాకిన రుతుపవనాలు 10 లో

చేంజ్‌పై చర్చ

రాష్ట్ర బీజేపీలో మార్పులపై సీనియర్ల భేటీ

జితేందర్‌రెడ్డి ఇంట్లో సమావేశమైన విజయశాంతి, వివేక్, కొండా, బూర, విఠల్ తదితరులు

- రాష్ట్ర నాయకత్వ మార్పు, ఈటలకు ప్రచార కమిటీ చైర్మన్ పదవి ఇస్తారనే ప్రచారంపై చర్చ.. అభ్యంతరం వ్యక్తం చేసిన నేతలు
- కేసీఆర్ లీకులు ఇప్పిస్తున్నారంటూ మీడియాతో చెప్పిన జితేందర్‌రెడ్డి
- అంతకుముందు బీజేపీలో ఏ పదవీ శాశ్వతం కాదని, బిస్తర్ రెడీగా పెట్టుకున్నానన్న బండి సంజయ్
- వరుస పరిణామాలు, ప్రచారంతో రాజుకుంటున్న వేడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. త్వరలోనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పుతో పాటు ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ నియామకం, ఇతర మార్పులు జరగనున్నాయనే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆదివారం సమావేశమైన సీనియర్ నేతలు కొందరు ప్రచార కమిటీ చైర్మన్‌గా ఈటల నియామకంతో పాటు రాష్ట్ర అధ్యక్షుడి మార్పు వంటి అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ మేరకు తమ అభిప్రాయాన్ని జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం.

వారం క్రితం 'అసంతృప్తి' సెగ

దాదాపు వారం రోజుల క్రితం కొందరు అసంతృప్త నేతలు సమావేశమై, సీనియర్లమైన తమకు పార్టీలో తగిన ప్రాధాన్యత, గుర్తింపు లభించడం లేదని, పార్టీ ముఖ్యనేత ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తూ పార్టీకి నష్టం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నేతల మధ్య సమన్వయం కొరవడటం లాంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాతీయ నాయకత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ కమిటీల్లో మార్పులు, బండి సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవి, ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా ఈటల నియామకం అనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శనివారం రాత్రి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పార్టీలో మార్పులపై జరుగుతున్నది ప్రచారం మాత్రమేనని అన్నారు. తాను పార్టీ కోసం కమిట్‌మెంట్‌తో కష్టపడి పనిచేస్తానని, బీజేపీలో ఏ పదవీ శాశ్వతం కాదని, నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా పాటించేందుకు బిస్తర్ రెడీగా పెట్టుకున్నానంటూ వ్యాఖ్యానించారు.

తాజాగా అనుకూల వర్గం భేటీ..

ఆదివారం పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి నివాసంలో జరిగిన సమావేశంలో జాతీయ కార్యవర్గసభ్యులు జి.వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, మాజీ ఎంపీలు రవీంద్ర నాయక్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డా.బూర నర్సయ్యగౌడ్, డా.విజయ రామారావు, సుద్దాల దేవయ్య, సీహెచ్ విఠల్, రచనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. బండి సంజయ్‌కు అనుకూల వర్గంగా భావిస్తున్న ఈ నేతలు.. ఇతర అంశాలతో పాటు రాష్ట్ర నాయకత్వ మార్పు, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమించడంపై ప్రధానంగా చర్చించినట్టు తెలుస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో బండి సంజయ్‌ను మార్చొద్దని, ఈటలకు కీలక పదవి ఇవ్వొద్దంటూ అధిష్టానాన్ని గట్టిగా కోరాలని నిర్ణయించినట్లు సమాచారం. తాము కూడా ఉద్యమకారులమేనని, జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఉన్నామని, సీనియర్ నేతలైన తమకు తెలియకుండానే కీలక నిర్ణయాలు ఎలా తీసుకుంటారంటూ అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈటలకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని వ్యతిరేకించడంతో పాటు, ఆయనకు కీలక పదవి ఇవ్వొద్దని, తాము ఆయన కంటే సీనియర్లమని, తమకు కూడా తగిన గుర్తింపునిచ్చే పదవులు ఇవ్వాలని అభిప్రాయ పడినట్లు సమాచారం. జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఉన్న తమకు పార్టీలో జరుగుతున్న పరిణామాలు తెలియడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం

మిగతా 3వ పేజీలో ▶



ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌తో జొకోవిచ్

టెన్నిస్ రారాజు...

23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో జొకోవిచ్ రికార్డు

పురుషుల టెన్నిస్‌లో సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ ఆదివారం కొత్త చరిత్రను లిఖించాడు. అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ సాధించిన క్రీడాకారుడిగా రికార్డు నెలకొల్పాడు. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో మూడో సీడ్ జొకోవిచ్ 7–6 (7/1), 6–3, 7–5తో నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే)పై గెలిచి కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో రాఫెల్ నాదల్ పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ బద్దలు కొట్టాడు. విజేతగా నిలిచిన జొకోవిచ్‌కు 23 లక్షల యూరోలు (రూ. 20 కోట్ల 41 లక్షలు), రన్నరప్ కాస్పర్ రూడ్‌కు 11 లక్షల 50 వేల యూరోలు (రూ. 10 కోట్ల 20 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. 12 లో

స్కూల్ చలే హమ్..

నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

- ఎండల దృష్ట్యా సెలవులు పొడిగించాలన్న డిమాండ్‌ను పట్టించుకోని విద్యాశాఖ
- స్కూళ్లకు వెళ్లనున్న 60 లక్షల మంది విద్యార్థులు 2లో

తాతలు, తండ్రుల పేర్లతో రాజకీయాలు చెల్లవు!

ప్రజలకు పేర్లతో పనిలేదు.. పని చేయగలిగిన వారు కావాలి: సీఎం కేసీఆర్

- ఇన్నేళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా దశ దిశ లేని పాలనే.. ప్రజలు పార్టీలను కాకుండా తమ ఆకాంక్షలను గెలిపించుకోవాలి
- బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమే కాదు.. దేశాన్ని మార్చడానికి ఏర్పాటు చేసిన ఒక మిషన్
- మధ్యప్రదేశ్ నేతల చేరిక సందర్భంగా సీఎం వ్యాఖ్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ''పార్టీ వ్యవస్థాపకులు, సిద్ధాంతకర్తలు, తాతల, తండ్రుల పేర్లు చెప్పుకొని ఇంకా రాజకీయాలు చేసే పరిస్థితులు చెల్లవు. ఇప్పుడు దేశ ప్రజలకు పేర్లతో పనిలేదు.. పని చేయగలిగిన వాళ్లతోనే పని (నామ్ దారీ నహీ కామ్ దారీ హోనా చాహియే)'' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇప్పటికీ కేంద్రంలో పాలన నిర్లక్ష్యంగా, దశ దిశ లేకుండా కొనసాగుతోందని విమర్శించారు. ఈ తీరు దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా పరిణమించిందని వ్యాఖ్యానించారు. ఆదివారం ప్రగతిభవన్‌లో మధ్యప్రదేశ్ బీఆర్‌ఎస్ సమన్వయకర్త, మాజీ ఎంపీ బుద్ధసేన్ పటేల్ ఆధ్వర్యంలో ఆ రాష్ట్రానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సహా 200 మంది నేతలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. చాంద్వాడా జిల్లా జున్నార్‌దేవ్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రామ్‌దాస్ యుకే, సర్వజన్ కల్యాణ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు సంజయ్ యాదవ్, గోండ్వానా పార్టీ అధ్యక్షుడు శోభా రామ్ బాలావి, భువన్ సింగ్ కోరం, లక్ష్మణ్ మస్కోలే తదితరులకు సీఎం కేసీఆర్

మిగతా 2వ పేజీలో ▶

నేడు గద్వాలకు సీఎం కేసీఆర్ 3లో

కళ్లలో పొడిచి.. కత్తితో కోసి..

పారామెడికల్ విద్యార్థిని దారుణ హత్య

గ్రామ సమీపంలోని నీటికుంటలో మృతదేహం లభ్యం



శిరీష (ఫైల్)

- వికారాబాద్ జిల్లా కాళ్లాపూర్‌లో ఘటన
- బావ అనిల్, తండ్రి, తమ్ముడిని విచారిస్తున్న పోలీసులు

పరిగి: పారామెడికల్ విద్యార్థిని దారుణ హత్యకు గురైన సంఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాళ్లాపూర్ గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. ఆమె శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలున్నాయి. బలమైన ఆయుధంతో దాడి చేసి చంపినట్లు స్పష్టంగా తెలుస్తోంది. హంతకులు రెండు కళ్లను పొడవడంతో పాటు కత్తితో గొంతు కోశారు. ఎడమ కాలు మడమ వద్ద నరాలను కోసిన ఆనవాళ్లున్నాయి. యువతిని ఇంత దారుణంగా ఎవరు? ఎందుకు చంపారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆమె బావను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

చిన్నక్క అన్నం వండలేదు..

పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్లాపూర్‌కు చెందిన జుట్టు యాదమ్మ, జంగయ్య దంపతులకు ఇద్దరు

మిగతా 5వ పేజీలో ▶

నల్లగొండ జిల్లాకు చుక్కనీరు తెచ్చారా?

'తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు దేని కోసం.. నల్లగొండ జిల్లాకు చుక్క నీరు తెచ్చారా.. లేదా పెద్ద ప్రాజెక్టు కట్టారా' అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లాలోని ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు తొమ్మిదేళ్లుగా రూ.వెయ్యి కోట్లు తీసుకురాని దుర్మార్గులు ఈ బీఆర్‌ఎస్ పాలకులని విమర్శించారు. 5 లో



కోమటిరెడ్డితో కలిసి కేక్ కట్ చేస్తున్న భట్టి విక్రమార్క

ఇదండీ సంగతి



వాళ్లకు లాభాలు రావాలంటే..
మళ్లీ పెట్రోల్ ధరలు పెంచాలిగా సార్!

బీజేపీయే మా ప్రథమ శత్రువు

సీపీఐ నేత కూనంనేని వెల్లడి

- ఓట్ల కోసమే మతాల పేరుతో ప్రజలను బీజేపీ బలి ఇస్తోంది
- రోజుకో పార్టీ మారేవారు మాకు నీతులు చెబుతారా?
- కొత్తగూడెంలో ప్రజాగర్జన సభ
- కేసీఆర్ బీజేపీ వ్యతిరేక ఫ్రంట్‌లో చేరాలన్న నారాయణ



కొత్తగూడెంలో జరిగిన సీపీఐ ప్రజాగర్జన సభకు హాజరైన పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దేశంలో మతం పేరిట విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ పార్టీయే తమ ప్రథమ శత్రువని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. సీపీఐ చేపట్టిన ప్రజాపోరు యాత్ర ముగింపు సందర్భంగా కొత్తగూడెంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రజాగర్జన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రధాని మోదీ, అమిత్‌షా, బండి సంజయ్.. ఇలా ఎవరిపైనా తమకు వ్యక్తిగత ద్వేషం లేదని, కానీ మతం పేరిట దేశంలో చిచ్చు రేపుతున్న బీజేపీ సిద్ధాంతాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ దేశంలో 4 వేల ఏళ్ల నుంచే హిందూమతం ఉన్నందున, సంస్కృతిని ఎలా కాపాడుకోవాలో ప్రజలకు తెలుసన్నారు. 300 ఏళ్లు మొఘలులు, 200 ఏళ్లు బ్రిటిషర్లు పాలించినా హిందు మతానికి ఏమీ కాలేదన్నారు. కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసమే మతాల పేరుతో ప్రజలను బీజేపీ బలి ఇస్తోందని ఆరోపించారు. కమ్యూనిస్టులు

మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నట్లు ఇంటర్ బోర్డ్ పరీక్షల విభాగం ముఖ్య అధికారి జయప్రదాభాయ్ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులతో పాటు, ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంప్రూవ్‌మెంట్ కోసం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ రాస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 4,12,235 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్షల కోసం 932 కేంద్రాలు ఏర్పాటు చేయగా..అన్ని కేంద్రాల్లోనూ తాగునీరు, విద్యుత్ సదుపాయం, విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ రవాణా సదుపాయం ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డ్ జిల్లా అధికారులను ఆదేశించింది.

నేడే ఎడ్‌సెట్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: బీఈడీ, డీఎడ్ కోర్సుల్లో ప్రవేశానికి గత నెలలో జరిగిన తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలను సోమవారం సాయంత్రం 4 గంటలకు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి విడుదల చేస్తారని ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రామకృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం https://edcet.tsche.ac.in వెబ్‌సైట్ చూడవచ్చని పేర్కొన్నారు.

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలి

మంత్రి శ్రీనివాస్‌గౌడ్



లింగోజీగూడ: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. లింగోజీగూడ డివిజన్ సరూర్‌నగర్ గౌడ సంఘం భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గౌడ సామాజికవర్గం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే పలు పథకాలను వారికి అందిస్తున్నామని తెలిపారు. గౌండ్ల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక కార్పొరేషన్ చైర్మన్ పల్లే రవికుమార్‌గౌడ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఆకుల శ్రీవాణి, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్, తెలంగాణ గౌడ హస్టల్ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని నాయకులు మంత్రికి వినతి పత్రం సమర్పించారు.

ఐదు పీజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

ఎమ్‌కాం ప్రశ్నపత్రంలో మార్పులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎంఏ మరాఠి, కన్నడ, పర్షియన్, అరబిక్, థియేటర్ ఆర్ట్స్ కోర్సుల్లో సీట్ల సంఖ్య కంటే తక్కువమంది దరఖాస్తు చేసుకున్నందున ఆ కోర్సుల్లో దరఖాస్తు చేసుకున్నవారికి నేరుగా అడ్మిషన్లు కల్పించనున్నారు. ఈ మేరకు టీఎస్‌సీపీజీఈటీ–2023 కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓయూతో పాటు ఇతర వర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు జరిగే కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందన్నారు. రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 18, రూ.2,000 అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే ప్రవేశ పరీక్షలకు ఈ నెల 27 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కాగా, ఈ ఏడాది ఎమ్‌కాం కోర్సు ప్రవేశ పరీక్షకు ప్రశ్నపత్రంలో కామర్స్‌తో పాటు జనరల్ ఇంగ్లిష్, కంప్యూటర్ బేసిక్స్, జనరల్ అంశాలను కూడా జతచేర్చినట్లు పేర్కొన్నారు.

నేటి భవితలో..

- ఎగ్జామ్ రివ్యూ: ప్రిలిమ్స్ కటాఫ్.. 88–95!: సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్–2023.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా.. 19 కేంద్ర సర్వీసులకు గత నెల 28న నిర్వహించిన పరీక్ష! జాతీయ స్థాయిలో.. దాదాపు ఆరు లక్షల మంది హాజరైనట్లు అంచనా! ఇప్పుడు వీరంతా కటాఫ్ అంచనాపై తర్జనభర్జన పడుతున్నారు. మెయిన్స్‌కు అర్హత సాధిస్తామా.. ప్రిపరేషన్ ప్రారంభించాలా..వద్దా?! అనే సందేహం ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో.. సివిల్ సర్వీసెస్ తొలి దశ ప్రిలిమినరీ పరీక్ష క్లిష్టత స్థాయి, కటాఫ్ అంచనా, రెండో దశ మెయిన్స్‌కు ప్రిపరేషన్‌పై విశ్లేషణాత్మక కథనం..
- గ్రూప్స్ ప్రత్యేకం–కరెంట్ అఫైర్స్: పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్.
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

అమరుల త్యాగాలకు అద్భుత ప్రతిబింబం

22న ఆవిష్కరణకు సిద్ధమైన స్మారకం

తొలి, మలిదశ తెలంగాణ అమరుల జ్ఞాపకాలు ఇక్కడ పదిలం

ఒక్కో ఫ్లోర్‌లో ఒక్కో ప్రత్యేకత..పైన స్మారక జ్యోతి

సాక్షి, హైదరాబాద్: దశాబ్దాలుగా దగాపడ్డ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రసాధన కోసం ఒక మహోన్నతమైన కల గన్న గొప్ప స్వాప్నికులు వాళ్లు. ఆ కలను సాకారం చేసుకొనేందుకు వీరోచితమైన పోరాటాలు చేశారు. తెలంగాణ సాధన కోసం తెగించి కొట్లాడారు. త్యాగాల బాటలో నడిచారు. తెలంగాణ కోసం మరణానికి ఎదురెళ్లారు. తమ జీవిత కాలంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని చూడలేకపోయినా ఆ అమరుల కల సాకారమైంది. అమరుల త్యాగాలకు సమున్నత స్థానం కల్పిస్తూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అమరుల స్మారకం ఈ నెల 22న ఆవిష్కరణకు సిద్ధమైంది. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో పాల్గొని ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన వందలాది మంది అమర వీరులను స్ఫురణకు తెచ్చేలా స్మారక జ్యోతి వెలుగులు విరజిమ్ముతోంది.

అపురూపమైన కళాఖండం...

హుస్సేన్‌సాగర్ తీరాన లుంబిని పార్కును ఆనుకొని సుమారు 3.2 ఎకరాల స్థలంలో చేపట్టిన తెలంగాణ అమరవీరుల స్మారకం ప్రపంచంలోనే ఒక అపురూపమైన కళాఖండంగా నిలిచింది. ఎలాంటి అతుకులు లేని స్టెయిన్ లెస్ స్టీల్‌తో దీని నిర్మాణం చేపట్టారు. సాధారణంగా పాలు, వంటనూనెలు సరఫరా చేసే ట్యాంకర్ల కోసం 304 స్టెయిన్‌లెస్ స్టీల్‌ను వినియోగిస్తారు. కానీ దీని కోసం 316ఎల్ స్టీల్‌ను వినియోగించారు. దుబాయ్‌లో ఎంతో పేరొందిన ఫ్యూచర్ మ్యూజియంకు వినియోగించిన స్టీల్‌కు అతుకులు ఉన్నాయి. కానీ ఈ స్మారకానికి మాత్రం ఎలాంటి అతుకులు లేకపోవడం విశేషం. 85,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ స్మారకంలో ప్రతి ఫ్లోర్‌కు ఒక ప్రత్యేకత ఉంది. పైన ఉన్న జ్యోతి వరకు సందర్శకులు వెళ్లవచ్చు. అక్కడ ఉన్న విశాలమైన ప్రాంగణంలో సేదదీరేందుకు అవకాశం ఉంది. త్వరలో ఒక రెస్టారెంట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు.



త్యాగాలను స్మరించుకునేలా..

తెలంగాణ అమరవీరుల త్యాగాలను, వీరోచిత పోరాట గాథలను స్మరించుకొనేవిధంగా గ్రౌండ్‌ఫ్లోర్‌లో చిత్రపటాలు, చారిత్రక చిహ్నాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రేక్షకులు వీక్షించేందుకు లేదా విని తెలుసుకొనేందుకు వీలుగా ఆడియో, వీడియో హాళ్లు, గ్యాలరీలు ఉంటాయి.వీటి ద్వారా తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ ఘట్టాలను తెలుసుకోవచ్చు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో వివిధ ప్రాంతాలకు చెందిన అమరవీరులు సాగించిన పోరాటాల తీరుతెన్నులు, ఉద్యమం సాగిన తీరు, తదితర స్ఫూర్తిదాయకమైన తెలంగాణ ఉద్యమ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసే విధంగా ఏర్పాటు చేశారు. అలాగే మ్యూజియంలోనే అక్కడక్కడా కియోస్క్‌లు, టచ్‌స్క్రీన్‌లు ఉంటాయి. వీటి ద్వారా కూడా తెలంగాణ ఉద్యమ చరిత్ర విశేషాలను తెలుసుకొనే అవకాశం ఉంది.

టెర్రస్‌పై 'దియా'...

టెర్రస్ పైన అమరవీరులకు నివాళులర్పిస్తూ.. జ్యోతి వెలుగుతూ ఉంటుంది. ఇదే తెలంగాణ స్మారకం ప్రత్యేకత. సచివాలయానికి ఎదురుగా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని అందజేస్తూ ఏర్పాటు చేసిన ఈ జ్యోతి (దియా) విశేషంగా ఆకట్టుకుంటోంది. టెర్రస్ పైన కూర్చుని 180 డిగ్రీల కోణంలో చుట్టూ ఉన్న పరిసరాలను వీక్షించవచ్చు. సెక్రెటేరియట్, అంబేడ్కర్ విగ్రహం, ఐమాక్స్, బిర్లా మందిరం స్పష్టంగా కనిపిస్తాయి. రూ.179 కోట్లతో తెలంగాణ స్మారకం నిర్మించారు. సందర్శకులు అత్యవసర పరిస్థితుల్లో పైనుంచి నేరుగా కిందకు చేరుకొనేందుకు రెండు వైపులా మెట్లు ఏర్పాటు చేశారు. రెండు లిఫ్టులు, ఎస్కలేటర్లు అందుబాటులో ఉంటాయి. అన్ని ఫ్లోర్‌లలో వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. భవనానికి ప్రధాన ద్వారంతో పాటు మరో నాలుగు చోట్ల చిన్న చిన్న నిష్క్రమణ ద్వారాలను ఏర్పాటు చేశారు.

సాహిత్య సదస్సులు, కళాప్రదర్శనలు...

పై అంతస్తులో 600 మంది కూర్చునేందుకు అనువైన కన్వెన్షన్ హాల్‌ను నిర్మించారు. రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సులు, సాహిత్య సదస్సులు, కవి సమ్మేళనాలు, అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు ఈ హాల్ ఎంతో అనుకూలంగా ఉంది. ఈ హాల్‌లో ఏర్పాటు చేసే కుర్చీలను సభా కార్యక్రమాలకు అనుగుణంగా మార్చుకోవచ్చు.

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో తెలంగాణ అమరుల స్మారకం చుట్టూ అందమైన ల్యాండ్‌స్కేప్‌లను ఏర్పాటు చేయనున్నారు. అలాగే సెక్రెటేరియట్ ఎదురుగా ఉన్న విశాలమైన

ల్యాండ్‌స్కేప్‌ల ఏర్పాటు...

ప్రాంగణంలో కూడా ఆకుపచ్చ ల్యాండ్‌స్కేప్‌ను ఏర్పాటు చేసేందుకు పనులు కొనసాగుతున్నారు. ట్రాఫిక్ ఐలాండ్స్‌లో, లుంబిని పార్కులోనూ పచ్చదనం అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ ట్విట్టర్ ద్వారా తెలిపారు.



తెలంగాణ సాహిత్య దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రగతి భవన్‌లో భారత జాగృతి ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీ కవిత తదితరులు

తెలంగాణ చారిత్రక సంపద మహోన్నతం

- ఇక్కడి చరిత్రను అర్థం చేసుకుంటే భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోగలం: కేసీఆర్
- భారత జాగృతి ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించిన సీఎం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రాంత చారిత్రక వారసత్వ సంపద ఎంతో మహోన్నతమైందని, దానిని వెలుగులోకి తెచ్చేందుకు జరుగుతున్న కృషి అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. ఎప్పుడో కోట్ల ఏళ్లనాటి పురాతన ఆనవాళ్లు కూడా ఇక్కడ లభిస్తుండటం గర్వకారణమన్నారు. తెలంగాణ ప్రాంతంలో పురాతన, చారిత్రక ఆనవాళ్లను గుర్తించేందుకు పలువురు చేసిన కృషికి సంబంధించిన వివరాలతో భారత జాగృతి సంస్థ ఆధ్వర్యంలో ప్రచురించిన ఐదు సంపుటాల పుస్తకాలను కేసీఆర్ ఆదివారం ప్రగతిభవన్‌లో ఆవిష్కరించారు. దాదాపు 20 కోట్ల ఏళ్ల చరిత్ర ఆనవాళ్లు తెలంగాణలో వెలుగు చూస్తున్నాయని, వివిధ కాలాల్లో సామాజిక పరిస్థితులు, పరిపాలన రీతులు, నాటి దార్శనికతను అర్థం చేసుకుంటే.. రేపటికి మనకు దారి చూపుతాయని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. చరిత్రను అర్థం చేసుకోవడం, వర్తమానాన్ని అవగాహన చేసుకోవడం ద్వారా భవిష్యత్తుకు బాటలు వేసుకోగలమన్నారు.

ఆరేళ్లుగా పరిశోధనలతో..

భారత జాగృతి (తెలంగాణ జాగృతి) చరిత్ర విభాగం గత ఆరేళ్లుగా తెలంగాణలోని అనేక చారిత్రక ప్రదేశాలను పరిశోధకుడు, రచయిత శ్రీరామోజు హరగోపాల్ ఆధ్వర్యంలో సందర్శించి వివరాలను వెలుగులోకి తెస్తోంది. ఆ వివరాలను క్రోడీకరించి సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, కవి వేముగంటి మురళీకృష్ణ సంపాదకత్వంలో ఈ పుస్తకాలకు రూపమిచ్చారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వీటిని కేసీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, రచయిత శ్రీరామోజు హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గా వద్ద తెలంగాణ భవన నిర్మాణం

హోంశాఖ మంత్రి మహమూద్ అలీ

ముషీరాబాద్ (హైదరాబాద్): రాజస్తాన్‌లోని ప్రసిద్ధిగాంచిన అజ్మీర్ దర్గా వద్ద తెలంగాణ ప్రజల ఉపయోగార్థం మరో రెండు నెలల్లో తెలంగాణ భవన నిర్మాణ పనులు సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ తెలిపారు. ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ ఆధ్వర్యంలో అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పించే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహమూద్ అలీ, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి చాదర్‌ను అజ్మీర్ దర్గాకు పంపించారు. అనంతరం హోంమంత్రి మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలు కలిసి మెలిసి జీవిస్తున్నారని, కాంగ్రెస్, బీజేపీ నేతలు ప్రజల్లో చిచ్చుపెట్టి ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ, ముషీరాబాద్‌లో హిందూ ముస్లింలు ఐక్యంగా పండుగలను జరుపుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.



అజ్మీర్ దర్గాకు సమర్పించే చాదర్‌తో హోంమంత్రి మహమూద్ అలీ, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

తాతలు, తండ్రుల పేర్లతో రాజకీయాలు చెల్లవు!

▶ మొదటి పేజీ తరువాయి

గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మార్పు తీసుకొచ్చే బాధ్యత ప్రజలదే..

దేశంలో నీరు, వ్యవసాయ యోగ్య భూమి, విద్యుత్‌కు అవసరమైన బొగ్గు నిల్వలు, వ్యవసాయానికి అవసరమైన సమ శీతోష్ణస్థితి, సూర్యరశ్మి వంటి ప్రకృతి వనరులన్నీ అందుబాటులో ఉన్నాయని.. అయినా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న దుస్థితి ఉండటం దారుణమని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. కేంద్రంలోని పాలకులకు లక్ష్యశుద్ధి లోపించడమే దీనికి కారణమన్నారు. దళితులు, బహుజనులు సహా అన్ని వర్గాల వారు ఇంకా అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ దుస్థితి పోవాలంటే కేంద్రంలో పార్టీలను మార్చడం కాకుండా.. తమ ఆకాంక్షలను గెలిపించుకునే దిశగా ప్రజలు చైతన్యం కావాలన్నారు. ''ఒక పార్టీని ఓడించి ఇంకో పార్టీని గెలిపిస్తే.. పార్టీలు, వాటి నాయకుల పేర్లే మారుతాయి. ప్రజలకు ఒరిగేదేమీ లేదు. పని విధానంలో మార్పు తీసుకువచ్చే ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది'' అని కేసీఆర్ స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ పార్టీ కాదు.. మిషన్..

బీఆర్ఎస్ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని, దేశాన్ని మార్చడానికి ఏర్పాటు చేసిన మిషన్ అని కేసీఆర్ చెప్పారు. మన కోసం పనిచేసుకునే వారికి ఓటు వేస్తేనే మన ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు మధ్యప్రదేశ్ ఎందుకు అమలు కావని ప్రశ్నించారు. ఆదివాసీలు, దళితులు, బహుజనులు పీడితులుగానే కొనసాగే దుస్థితి ఇంకెన్నాళ్లు అని ప్రశ్నించారు. ఆ వర్గాల వారు ఉత్తర భారతంలో కనీస జీవన ప్రమాణాలకు నోచుకోవడం లేదన్నారు.

ఎన్నికల సంఘం విఫలమైంది!

తప్పుడు వాగ్దానాలతో, విద్వేషాలు రెచ్చగొడుతూ ఏం చేసైనా ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా కొనసాగుతున్న దుర్మార్గాలను నిలువరించడంలో ఎన్నికల సంఘం విఫలమైందని కేసీఆర్ ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మధ్యప్రదేశ్‌లోని అన్ని నియోజకవర్గాల్లో వాహనాలను ఏర్పాటు చేసుకుని పార్టీ భావజాలాన్ని, ప్రచారాన్ని గ్రామగ్రామానికి తీసుకెళ్లాలని కొత్తగా చేరిన నేతలకు సూచించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. మధ్యప్రదేశ్‌లోని ప్రతి గ్రామంలో పార్టీ తరఫున రైతు, దళిత, మహిళ, యువ, బీసీ వంటి 9 కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు శంకరన్న దోంగ్రే, మాణిక్ కదమ్, హిమాన్షు తివారీ, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, మెట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కవులను సన్మానిస్తున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ. చిత్రంలో జూలూరి గౌరీశంకర్, గోరటి వెంకన్న, పల్లె రవికుమార్, మంత్రి శ్రీదేవి తదితరులు

తెలంగాణలో కవులకు ప్రోత్సాహం

సాహిత్య దినోత్సవంలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం కవులను ప్రోత్సహిస్తుందని, భవిష్యత్తులో మరింత మంది కవులు రాష్ట్రం నుంచి వెలుగుచూడాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆకాంక్షించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య దినోత్సవం – బహుభాషా కవి సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...తెలుగు, ఉర్దూ భాషల మధ్య విడదీయరాని బంధం ఉందని, అనేక ఉర్దూ పదాలు తెలుగు వాడుక భాషలో ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వాలలో కవి సాహిత్య సమ్మేళనాలకు అవకాశాలు ఉండేవి కాదన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం తరఫున కవి సమ్మేళనాలను నిర్వహిస్తామని తెలిపారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతగానో పాటుపడుతుందన్నారు. మైనార్టీల సంక్షేమానికి పాటుపడే లౌకికవాద పార్టీలకే ముస్లింల మద్దతు ఉంటుందన్నారు. అనంతరం రాష్ట్ర, జిల్లా స్థాయి కవి సమ్మేళనంలో ప్రతిభ కనబరచినవారికి పురస్కారాలను అందజేశారు. అంతకు ముందు తెలుగు, ఉర్దూ కవి సమ్మేళనం, గజల్ ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సాహిత్య పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి, అధికార భాషా సంఘం చైర్మన్ శ్రీదేవి, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఖాజా మోయినుద్దీన్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కవులు పాల్గొన్నారు.

స్కూల్ చలే హమ్..

రాష్ట్రంలో నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

- ఎండల దృష్ట్యా సెలవులు పొడిగించాలన్న డిమాండ్‌ను పట్టించుకోని విద్యాశాఖ
- సర్కారీ బడుల్లో ఇప్పటికీ అందని పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- ప్రైవేటులో భారీగా ఫీజుల మోత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సెలవులు పొడిగించాలన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోని విద్యాశాఖ.. షెడ్యూల్ ప్రకారమే పాఠశాలలను తెరుస్తున్నట్లు స్పష్టం చేసింది. రాష్ట్రంలో దాదాపు 26 వేల ప్రభుత్వ స్కూళ్లు ఉండగా మరో 11 వేల ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, గురుకులాలు ఇతరత్రా కలుపుకుంటే మొత్తం 40 వేల స్కూళ్లలో దాదాపు 60 లక్షల మంది విద్యార్థులు బడిబాట పట్టనుండగా బడులు తెరుస్తుండటంతో వారం రోజులుగా తల్లిదండ్రులు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారాలు, బూట్లు ఇతరత్రా వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు ప్రైవేటు స్కూళ్లు విద్యార్థులను చేర్చుకొనేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

సరిపడా టీచర్లేరీ?

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలు నెలకొన్నాయి. విద్యాశాఖ అంచనాల ప్రకారం దాదాపు 20 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే టీచర్లను హైస్కూళ్లలో బోధనకు తీసుకోవడంతో టీచర్లు లేని హైస్కూళ్లు 7 వేల వరకూ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల వ్యవహారం ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. గతేడాది షెడ్యూల్ ఇచ్చినప్పటికీ కోర్టు ఉత్తర్వుల కారణంగా అమలు కాలేదు. దాదాపు 6 వేల మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందాలి. 2 వేల మంది ఎస్ఏలు హెచ్ఎంలుగా ప్రమోట్ అవ్వాలి. ఇది జరిగితే ఖాళీల లెక్క కచ్చితంగా తెలుస్తుంది. అప్పుడు కొత్త నియామకాలు చేపట్టడానికి వీలుంటుంది.

దరి చేరని పాఠ్యపుస్తకాలు..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 28,77,675 మందికి ఉచితంగా అందించేందుకు 1,63,78,607 పాఠ్యపుస్తకాలను ముద్రించాలని ప్రభుత్వం లెక్కగట్టింది. ఆంగ్ల మాధ్యమ బోధన ఉండటంతో ద్విభాషా విధానంలో (ఒకవైపు తెలుగు, మరోవైపు ఆంగ్లం) పుస్తకాలు ముద్రించి అందించనుంది. గతేడాది మిగిలిన పుస్తకాలు తీసేస్తే ఇంకా 1,57,48,270 పుస్తకాలు అవసరం. ఇప్పటికే 1,35,85,185 పుస్తకాలు ముద్రించి జిల్లాలకు పంపినా వాటిని స్కూళ్లకు చేరవేసేందుకు విద్యాశాఖ టెండర్ల ప్రక్రియను పూర్తి చేయలేదు. సకాలంలో పాఠపుస్తకాల పంపిణీ కష్టమని అధికారులే చెబుతున్నారు. ఈ ఏడాది రూ. 140 కోట్లతో 24.27 లక్షల మందికి ఉచితంగా యూనిఫారాలు అందించాలని నిర్ణయించగా.. 1,26,96,313 మీటర్ల వస్త్రాన్ని టెస్కో ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. కానీ ఇప్పటికీ 50 శాతం యూనిఫారాలను మాత్రమే కుట్టినట్టు అధికారులు చెబుతున్నారు. జూలై వరకూ పూర్తి స్థాయిలో అందిస్తామని చెబుతున్నా ఇంకా ఆలస్యం తప్పదని హెచ్ఎంలు అంటున్నారు.

ఇంకా మారని ప్రభుత్వ బడి...

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తెచ్చేలా మన ఊరు–మన బడి, మన బస్తీ–మన బడి పేరిట కార్యక్రమాలు చేపట్టామని ప్రభుత్వం ప్రచారం చేసినా ఇప్పటికీ ఈ కార్యక్రమం కనీసం 10 శాతం కూడా ముందుకు వెళ్లలేదు. అనేక ప్రభుత్వ బడుల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న తరగతి గదులు, కనీస వసతులు కూడా లేని స్కూళ్లే కనిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల నుంచి ఈ ఏడాది లక్ష మంది వరకూ తమ స్కూళ్లలో చేరినట్లు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి.

ప్రైవేటులో భారీగా ఫీజులు

ఈ ఏడాది ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజులు భారీగా పెంచినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. కరోనాకు ముందు చాలా ప్రైవేటు స్కూళ్లలో సుమారు రూ. 20 వేల నుంచి రూ. 1.25 లక్షల వరకూ ఉన్న వార్షిక ఫీజులు ఈ ఏడాది రూ. 45 వేల నుంచి రూ. 2.5 లక్షల మధ్య ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు రవాణా చార్జీలను కూడా 30 శాతం వరకూ పెంచారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడి బస్సుల్లో భద్రత ఎంత?

- రాష్ట్రంలో నేటి నుంచి ప్రారంభమవుతున్న పాఠశాలలు
- 20 శాతం బస్సులకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యూవల్
- మిగతా వాటి జాడే లేదు.. తల్లిదండ్రుల్లో ఆందోళన

సాక్షి, హైదరాబాద్: విద్యాసంస్థల బస్సులు పూర్తిగా దారి తప్పాయి. విద్యార్థులను భద్రంగా ఇళ్లకు చేర్చేందుకు ఉద్దేశించిన నిబంధనల విషయంలో పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయి. సోమవారం నుంచి విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ నిర్లక్ష్యం మరోసారి తేటతెల్లమైంది. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికల్లా ఫిట్‌నెస్‌ను రెన్యూవల్ చేసుకోవాల్సి ఉన్నా, ఆదివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 20 శాతం వాహనాలు మాత్రమే దాన్ని పూర్తిచేసుకున్నాయి. అధికారులు బస్సుల ఫిట్‌నెస్ పరిశీలించి అవి రోడ్డుపై నడిచేందుకు యోగ్యంగా ఉన్నదీ లేనిదీ తేలుస్తారు. ఆమేరకు ఫిట్నెస్ రెన్యూవల్ చేస్తారు. ఇప్పుడు ఫిట్‌నెస్ రెన్యూవల్ లేకుండానే 80 శాతం బస్సులు రోడ్డెక్కితే పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 29 వేల పైచిలుకు విద్యాసంస్థల బస్సులు తిరుగుతున్నాయి. వీటిల్లో ఇప్పటివరకు 6 వేల బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ రెన్యూవల్ చేయించుకున్నాయని సమాచారం. విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న వేళ పరిస్థితిని ముందే గుర్తించి హెచ్చరించాల్సిన రవాణాశాఖ పెద్దగా స్పందించలేదు. సోమవారంలోపు రెన్యూవల్ చేయించుకోని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామన్న హెచ్చరికలైనా జారీ చేయలేదు. సాధారణంగా విద్యాసంవత్సరం ప్రారంభం అవుతూనే రవాణాశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తారు. ఫిట్‌నెస్ రెన్యూవల్ లేని బస్సులను గుర్తించి వాటి గుర్తింపు రద్దు చేయటం లాంటివి చేస్తారు. విద్యాసంస్థలకు పెనాల్టీలు విధిస్తుంటారు. కానీ, ముందుగానే హెచ్చరికలు జారీ చేయటం ద్వారా విద్యాసంస్థల్లో భయాన్ని పెంచే అవకాశం ఉంటుంది. ప్రారంభమయ్యాక పట్టుబడితే పెనాల్టీలు విధించటం వరకు సరే, అసలు ఫిట్‌నెస్ లేక బస్సు ప్రమాదానికి గురైతే విద్యార్థుల పరిస్థితి ఏమిటన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

శిక్షణ ఏది..?

విద్యాసంవత్సరం ప్రారంభం అయ్యేలోపు విద్యాసంస్థల బస్సులు నడిపే డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ ఇవ్వాలన్న నిబంధన ఉంది. సఫర్ పేరుతో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమాలుంటాయి. డ్రైవింగ్ నైపుణ్యం, బస్సు నిబంధనలు, విద్యార్థుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించే తీరు.. ఇలా అన్ని అంశాలు అందులో ఉంటాయి. కానీ ఇప్పటివరకు ఆ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించలేదు. విద్యార్థులు ఆ బస్సుల్లో ఎక్కడం ప్రారంభమయ్యేలోపే ఈ శిక్షణ పూర్తి చేస్తే ఉపయోగం ఉంటుంది. తర్వాత ఎప్పటికో శిక్షణ ఇస్తే, ఈలోపు అనుకోని ప్రమాదం చోటు చేసుకుంటే ఏంటన్నది తల్లిదండ్రు ఆందోళన.

క్లుప్తంగా...

ఆర్టీసీకిచ్చిన హామీలు నెరవేర్చండి: పొన్నం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. ముఖ్యమంత్రి హోదాలో ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన అనేక హామీల్లో ఒక్కటి కూడా నెరవేరలేదని ఆ లేఖలో తెలిపారు. ఏటా ఆర్టీసీకి రూ.1000 కోట్లు ఇస్తానని, తానే ఆర్టీసీని పర్యవేక్షిస్తానని చెప్పినా ఇప్పటివరకు ప్రక్రియను ప్రారంభించలేదని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు రూ.లక్ష బోనస్, యూనిఫాం, ఎమ్మెల్యేలు, మంత్రుల ఆర్టీసీ బస్సు ప్రయాణాలు లాంటి హామీలేవీ నెరవేరలేదని గుర్తు చేశారు. పీఎఫ్, సీసీఎస్ బకాయిలు పేరుకుపోతున్నా ఆ నిధులను విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వివరించారు.

కేటీఆర్ వ్యాఖ్యలు సరికావు

సాక్షి, హైదరాబాద్: ప్రజాదర్బార్ ఏర్పాటుపై మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ అవివేకానికి నిదర్శనమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ విమర్శించారు. ప్రజాదర్బార్‌కు కేవలం తమ పనుల కోసం ప్రజలు వస్తారనే కేటీఆర్ ఆలోచనే సరైంది కాదని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. ప్రజాదర్బార్‌ల ద్వారా ఏం జరిగిందో.. గత ముఖ్యమంత్రులు నిర్వహించిన దర్బార్ ఫలితాలను చూసి తెలుసుకోవాలని సూచించారు.

వ్యవస్థలో లోపం కాదు చేతకాని పాలనలోనే..
మంత్రి కేటీఆర్‌పై ట్విట్టర్‌లో వైఎస్ షర్మిల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: లోపం వ్యవస్థలో కాదు.. మీ చేతకాని పాలనే తెలంగాణకు పెద్ద లోపమని మంత్రి కేటీఆర్‌పై వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త పింఛన్ల కోసం 15లక్షల మంది ముఖ్యమంత్రి సంతకం కోసం వేచిచూస్తుంటే అది వ్యవస్థలో లోపమా? కేసీఆర్ పనితనంలో లోపమా? అని నిలదీశారు. ముఖ్యమంత్రేమో ప్రజలకు కనిపించరు..మంత్రులేమో కేసీఆర్ భజనకే సరి అని ఆదివారం ఆమె ట్విట్టర్‌లో తీవ్రంగా దుయ్యబట్టారు. ప్రజల సమస్యలు ముఖ్యమంత్రికి చెప్పుకోవద్దనడాన్ని షర్మిల ఆక్షేపించారు. ప్రజా దర్బార్ పెడితే తమ అరాచకాలను ప్రజలు నిలదీస్తారనే భయంతోనే దర్బార్‌కు మొహం చాటేశారని ఆరోపించారు. ప్రజా దర్బార్ పెట్టి ప్రజలకు ఏం కావాలో అడిగిన ఏకైక దమ్మున్న వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలు వినాలన్నా, పరిష్కారం కావాలన్నా మళ్ళీ వైఎస్సార్ పాలనతోనే అది సాధ్యమని పేర్కొన్నారు.

దళితులకు ప్రాధాన్యత దక్కింది మోదీ పాలనలోనే..
బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలోనే దళితులకు ప్రాధాన్యత దక్కిందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మోదీ ప్రభుత్వమే దళితులకు పెద్ద పీట వేసిందని, రాజ్యాధికారంలో సరైన వాటా దక్కిందన్నారు. కేంద్ర మంత్రివర్గంలో 12 మంది దళిత ఎంపీలకు చోటు ఇవ్వడం మోదీ ప్రభుత్వానికే సాధ్యపడిందని పేర్కొన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్ స్మృతి స్థలాలను పంచతీర్థ క్షేత్రాలుగా అభివృద్ధి చేసి, ఆయన ఆలోచన విధానాన్ని మోదీ ప్రభుత్వం ముందుకు తీసుకుపోతోందన్నారు. కాంగ్రెస్ పాలనలో అంబేడ్కర్‌కు కనీసం భారతరత్న ఇవ్వడానికి మనసు రాలేదని, రాష్ట్రంలో తొమ్మిదేళ్ల కేసీఆర్ ప్రభుత్వం ఎస్సీలకు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించలేదని విమర్శించారు. రాష్ట్రంలో 18 లక్షల దళిత కుటుంబాలలో ఇప్పటికీ సుమారు 11 లక్షల కుటుంబాలు సెంటు భూమి లేకుండా దుర్భర జీవితాన్ని గడుపుతున్నాయన్నారు.

గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌కు లక్షన్నర మంది డుమ్మా!

- పరీక్షకు భారీ స్థాయిలో గైర్హాజరైన అభ్యర్థులు
- 3.80 లక్షల మంది దరఖాస్తుదారుల్లో పరీక్ష రాసింది 2.33 లక్షల మందే..
- ప్రశ్నపత్రం కఠినంగా, సుదీర్ఘంగా ఉందన్న అభ్యర్థులు, నిపుణులు
- కరెంట్ అఫైర్స్, ఎకానమీ నుంచి లోతైన ప్రశ్నలు
- ఈసారి కటాఫ్ 70 నుంచి 75 మార్కుల మధ్య ఉండొచ్చని అంచనా



కోఠి ఉమెన్స్ కాలేజీ వద్ద గ్రూప్ -1 అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 503 గ్రూప్‌-1 ఉద్యోగాలకు టీఎస్‌పీఎస్సీ ఆదివారం నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షకు ఏకంగా దాదాపు 1.47 లక్షల మంది గైర్హాజరయ్యారు. గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌కు 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 3,09,323 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని... కానీ వారిలోనూ 2,33,248 మంది అభ్యర్థులే (61.37 శాతం మందే) హాజరైనట్లు టీఎస్‌పీఎస్సీ ప్రాథమికంగా వెల్లడించింది. గతేడాది నిర్వహించి పేపర్ లీకేజీ వల్ల రద్దు చేసిన ప్రిలిమ్స్‌కు 2.86 లక్షల మంది (79.15శాతం) హాజరవగా ఈసారి వారి సంఖ్య అనూహ్యంగా తగ్గింది. రాష్ట్రస్థాయిలో ఉన్నత ఉద్యోగానికి పొందేందుకు మళ్లీ అవకాశం వచ్చినా దాన్ని వేలాది మంది సద్వినియోగం చేసుకోలేకపోవడం గమనార్హం.

కరెంట్ అఫైర్స్, ఎకానమీ నుంచి లోతైన ప్రశ్నలు..

ప్రశ్నపత్రం కాస్త కఠినంగానే ఉందని అభ్యర్థులు, నిపుణులు పేర్కొన్నారు. గతేడాది నవంబర్‌లో ఇచ్చిన ప్రశ్నపత్రంతో పోలిస్తే కాస్త సులభంగా ఉన్నప్పటికీ మెజారిటీ ప్రశ్నలు కఠినంగా వచ్చాయని చెప్పారు. యూపీఎస్సీ ప్రమాణాలకు మించి ప్రశ్నలను ఇచ్చినట్లు మరికొందరు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా కరెంట్ అఫైర్స్, ఎకానమీకి సంబంధించి అడిగిన ప్రశ్నలు చాలా లోతుగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు సాధారణంగా రెండున్నర గంటల్లో 150 ప్రశ్నలకు జవాబిచ్చేలా... సగటున ఒక్కో ప్రశ్నకు ఒక్కో నిమిషం చొప్పున సమయం కేటాయించేలా ప్రశ్నలు ఉండాల్సి ఉండగా ఈసారి ప్రశ్నపత్రంలో ఒక్కో ప్రశ్నను చదివి అవగాహన చేసుకునేందుకే కనీసం రెండు నిమిషాలు పట్టిందని అభ్యర్థులు చెబుతున్నారు. ఈ క్రమంలో పూర్తిస్థాయిలో ప్రశ్నలు చదివి జవాబులు ఇవ్వడం కష్టమైందని పలువురు అభ్యర్థులు అభిప్రాపడ్డారు. చాలా ప్రశ్నలకు మల్టిపుల్ జవాబులు ఉండటం అయోమయానికి గురిచేసిందని చెప్పారు. ఈసారి కటాఫ్ 70 నుంచి 75 మార్కుల మధ్యలో ఉండొచ్చని ప్రముఖ నిపుణురాలు బాలలత సామాజిక మాధ్యమంలో పోస్టు చేసిన వీడియోలో అభిప్రాయపడ్డారు. అయితే జోన్లవారీగా, కేటగిరీల వారీగా ఎంపిక ప్రక్రియ ఉండటంతో కటాఫ్ తగ్గుతుందన్నారు. కమిషన్ విడుదల చేసే ప్రాథమిక కీ అనంతరం కటాఫ్‌పై అంచనాలు వేసుకోవచ్చని, ప్రస్తుతానికి 75 మార్కులకు పైబడి వచ్చిన వారు మెయిన్ పరీక్షలకు సిద్ధం కావచ్చని చెప్పారు.

ముందే బయటకు వచ్చిన అభ్యర్థిపై ఎఫ్ఐఆర్

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఓ అభ్యర్థి ఓఎంఆర్ షీట్‌లో తన హాల్‌టికెట్ నంబర్‌ను తప్పుగా బబ్లింగ్ చేసినందుకు హాలు నుంచి సమయం కంటే ముందే బయటకు వచ్చేశాడు. దీంతో అతనిపై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. మరోవైపు నిజామాబాద్ జిల్లాలోని ఓ పరీక్షా కేంద్రంలో ప్రశ్నపత్రాలు తక్కువగా రాగా వాటిని అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా సర్దుబాటు చేసేందుకు 14 నిమిషాల సమయం ఆలస్యమైంది. ఆ మేరకు ఆయా అభ్యర్థులకు సమయాన్ని సర్దుబాటు చేశారు. కాగా, రంగారెడ్డి జిల్లాలోని ఓ కేంద్రంలో అరగంటకన్నా ముందే పేపర్లు తీసుకున్నారంటూ కొందరు అభ్యర్థులు చేసిన ఆరోపణ నిజం కాదని జిల్లా కలెక్టర్ హరీశ్ స్పష్టం చేశారు.

గవర్నర్ల వ్యవస్థపై 2 ప్రశ్నలు

- రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య వివాదాల నేపథ్యంలో ఆసక్తికర పరిణామం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మధ్య వివాదాల నేపథ్యంలో ఆదివారం గ్రూప్‌-1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రంలో గవర్నర్ల వ్యవస్థపై వచ్చిన రెండు ప్రశ్నలు ఆసక్తికరంగా మారాయి. విశ్వవిద్యాలయాలకు కులపతిగా గవర్నర్ల నియామకాన్ని వ్యతిరేకిస్తూ జస్టిస్ మదన్ మోహన్ పుంఛీ కమిషన్ చేసిన సిఫారసులపై ఓ ప్రశ్న వచ్చింది. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల పరిస్థితులపై గవర్నర్ తమిళిసై కొంతకాలంగా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆమె రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు వీలు కల్పించే బిల్లును ఆమోదించకుండా రాష్ట్ర ప్రభుత్వానికి తిప్పి పంపారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో వర్సిటీలపై గవర్నర్ల ఆజమాయిషీని ప్రశ్నిస్తూ గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌లో ఈ ప్రశ్న అడగడం గమనార్హం. ‘ ఏ) రాజ్యాంగ బాధ్యతలను న్యాయంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించడానికి గవర్నర్‌పై.. రాజ్యాంగం కల్పించని పదవులు, అధికారాల (వర్సిటీల చాన్సలర్ వంటి పదవులు)తో భారం వేయకూడదు. బీ) గవర్నర్‌ను విశ్వవిద్యాలయాలకు చాన్సలర్‌గా చేయడం ద్వారా అతనికి/ఆమెకు అధికారాలను అప్పగించడం చారిత్రకంగా కొంత ఔచిత్యాన్ని కలిగి ఉన్నప్పటికీ నేడు కాల, పరిస్థితుల మార్పుతో అది ఉనికిని కోల్పోయింది’ అనే సిఫారసులను ఏ కమిషన్ చేసిందని ప్రశ్న వచ్చింది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన 8 బిల్లులను గవర్నర్ తమిళిసై ఆమోదించకుండా దీర్ఘకాలంగా రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉంచడాన్ని సవాలు చేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణను చేపట్టిన సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గవర్నర్‌కు నేరుగా నోటీసులు జారీ చేయలేమని స్పష్టం చేసింది. గవర్నర్‌కు బదులుగా కేంద్ర ప్రభుత్వానికి నోటీసులిచ్చింది. ఈ కేసు నేపథ్యంలో గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌లో మరో ఆసక్తికర ప్రశ్న రావడం గమనార్హం. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, న్యాయశాఖ మంత్రి, ఒక రాష్ట్ర గవర్నర్లలో ఎవరు తమ పదవీ కాలంలో అధికారాలు, విధుల నిర్వహణ, పనితీరుపై ఏ న్యాయస్థానానికి జవాబుదారిగా ఉండరు?’ అని మరో ప్రశ్న వచ్చింది. రాష్ట్రపతి, గవర్నర్లకు మాత్రం ఈ మేరకు రాజ్యాంగపర రక్షణ ఉంది. గవర్నర్ల వ్యవస్థపై ప్రశ్నలు రావడంతో రాజ్‌భవన్ వర్గాలు ఆరా తీశాయి. ప్రశ్నపత్రాన్ని తెప్పించుకొని పరిశీలించాయి.

నేడు గద్వాలకు సీఎం కేసీఆర్

గద్వాల రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. జిల్లా సమీకృత భవన సముదాయం, ఎస్పీ, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అబ్రహం, మర్రి జనార్దన్ రెడ్డి పర్యవేక్షించారు. అలాగే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల ప్రారంభోత్సవానికి సంబంధించి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ సృజన దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటన నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎప్పుడు?.. ఎలా?

- ఎంపీ కోమటిరెడ్డితో జూపల్లి సమావేశం
- ఏఐసీసీ కార్యదర్శి శ్రీధర్‌బాబుతో కలిసి ‘టీ’భేటీ
- కాంగ్రెస్‌లో చేరిక, కార్యక్రమ నిర్వహణపై చర్చ!



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో చేరతారని భావిస్తున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆ పార్టీకి చెందిన నేతలతో వరుసగా భేటీ అవుతున్నారు. శనివారం ఉదయం మాజీ ఎంపీ మల్లురవితో సమావేశమైన జూపల్లి, ఆదివారం భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిశారు. లోటస్‌పాండ్‌లోని కోమటిరెడ్డి నివాసానికి ఏఐసీసీ కార్యదర్శి డి.శ్రీధర్‌బాబుతో కలిసి వెళ్లిన జూపల్లి దాదాపు అరగంట సేపు భేటీ అయ్యారు. పార్టీలో ఎప్పుడు చేరితే బాగుంటుంది? కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలి? జూపల్లి, పొంగులేటి బృందం కాకుండా ఇంకా ఎవరెవరిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించాలి? తదితర అంశాలపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అయితే కోమటిరెడ్డితో సమావేశం తర్వాత కూడా.. తాను ఇంకా ఏ పార్టీలో చేరేది నిర్ణయం తీసుకోలేదని, కేవలం టీ తాగేందుకు మాత్రమే కోమటిరెడ్డి నివాసానికి వెళ్లానని జూపల్లి చెప్పడం గమనార్హం.

కాంగ్రెస్‌లోకి వస్తే బాగుంటుందని చెప్పా..

జూపల్లి, తాను పాత మిత్రులమని, అందుకే కలిశామని కోమటిరెడ్డి మీడియాతో చెప్పారు. కాంగ్రెస్‌లోకి వస్తే బాగుంటుందని ఆయనకు చెప్పానని అన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో నల్లగొండలో ప్రియాంకా గాంధీ సభ ఉంటుందని చెప్పిన కోమటిరెడ్డి.. షర్మిల కాంగ్రెస్‌లోకి వస్తే మంచిదేనని వ్యాఖ్యానించారు. ఏఐసీసీ కార్యదర్శి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోకి చేరికల విషయంలో అధిష్టానానిదే తుది నిర్ణయమని చెప్పారు.

డీకేతో రేవంత్ భేటీ!

టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశం అనంతరం శనివారం సాయంత్రం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బెంగళూరు వెళ్లారు. ఒంటరిగా బెంగళూరుకు వెళ్లిన రేవంత్.. అక్కడ కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో భేటీ అయి తెలంగాణలోని తాజా రాజకీయ పరిస్థితులను వివరించినట్టు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఖమ్మంతో పాటు మహబూబ్‌నగర్‌లోనూ సభ?

మాజీ ఎంపీ పొంగులేటి, జూపల్లి కృష్ణారావులు కాంగ్రెస్ పార్టీలో చేరిక సందర్భంగా ఖమ్మంతో పాటు మహబూబ్‌నగర్‌లో కూడా భారీ సభ నిర్వహించాలనే చర్చ జరుగుతోంది. ఖమ్మంలో నిర్వహించే సభలో జూపల్లి చేరిక ద్వారా పెద్దగా ప్రయోజనం ఉండదని, కనీసం లక్ష మంది సమక్షంలో మహబూబ్‌నగర్ వేదికగా కాంగ్రెస్‌లో చేరడం ద్వారా అటు పార్టీకి, తనకు వ్యక్తిగతంగా మంచిదనే ఆలోచనలో జూపల్లి ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే విషయమై ఆయన మల్లురవి, కోమటిరెడ్డిలతో భేటీ సందర్భంగా చర్చించినట్టు సమాచారం.

కాంగ్రెస్ పార్టీయే లక్ష సార్లు క్షమాపణలు చెప్పాలి

- ఆ పార్టీ చేసిన తప్పులకు ఆ నాయకులు ఢిల్లీ దాకా ముక్కు నేలకు రాయాలి
- విలేకరుల సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: క్షమాపణలు చెప్పాల్సి వస్తే కాంగ్రెస్ పార్టీయే లక్ష సార్లు క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ పాలనలో హామీలు నెరవేరలేదని, ప్రజలకు క్షమాపణలు చెప్పాలని పీపుల్స్ మార్చ్ సందర్భంగా సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క డిమాండ్ చేసిన విషయంపై మంత్రి ఘాటుగా స్పందించారు. ఆదివారం నల్లగొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, నోముల భగత్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డిలతో కలిసి మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ తప్పిదాల వల్లే జిల్లా వెనుకబడి పోయిందని, నాడు వ్యవసాయ రంగంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన జిల్లా ఎంత వెనుకబడి పోయిందో ప్రజలకు తెలియంది కాదన్నారు. కాంగ్రెస్ నాయకుల పదవులు పెరిగినట్లుగానే జిల్లాలో ఫ్లోరిన్ కూడా పెరిగిందని విమర్శించారు. కేసీఆర్ కాదు క్షమాపణ చెప్పాల్సింది కాంగ్రెస్ నాయకులే లక్ష సార్లు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాదు నల్లగొండ నుంచి ఢిల్లీ వరకు ముక్కు నేలకు రాయాలని ఫ్లోరిన్ బాధితులు డిమాండ్ చేస్తున్నారన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఫ్లోరిన్ సమస్యకు ముఖ్యమంత్రి శాశ్వత పరిష్కారం చూపారని పేర్కొన్నారు. అభివృద్ధిపై ఎక్కడ చర్చలు పెడదామో చెప్పాలంటూ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జానారెడ్డిలకు జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. వరుసగా 16 పంటలకు నీళ్లు ఇచ్చి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగు భూములను సస్యశ్యామలం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దని అటువంటి మహానేత ముందు వంగబడి 1000 సార్లు ముక్కు నేలకు రాస్తే తప్ప మీరు చేసిన పాపం నుంచి విముక్తి కాలేరని విమర్శించారు.

ఎక్కడా దిక్కులేకనే కాంగ్రెస్‌ను గెలిపించారు..

‘ఎక్కడా దిక్కులేకనే కర్ణాటకలో కాంగ్రెస్‌ను గెలిపించారు.. అక్కడ బీఆర్ఎస్ లేదు కాబట్టి మోదీ వ్యతిరేకతతో కాంగ్రెస్‌కు ఓటు వేశారే తప్ప మరొకటి కాదు’ అని అన్నారు. ప్రభుత్వం వస్తదని కలలు కంటూ ఈయనొక ఊరు... ఆయనొక ఊరు తిరుగుతున్నారని వారిది తొండ ఉరుకుడే తప్ప చెట్టు దాటేది లేదన్నారు. ‘పాదయాత్ర చేస్తున్న భట్టి గారూ... మీరు కళ్యాణలక్ష్మి, రైతు బంధు, ఇతర లబ్ధిదారుల వద్దకు వెళ్లండి మీకే అర్థం అవుతుంది.. వేరే ఉపన్యాసాలు అవసరం లేదు’ అని అన్నారు.

కొడంగల్ ఎమ్మెల్యేపై క్రిమినల్ కేసు

- భూవిక్రయంలో పట్నం నరేందర్‌రెడ్డి మోసం చేశారని బాధితుడి ఫిర్యాదు
- తొలుత కేసు నమోదు చేయని పోలీసులు.. కోర్టును ఆశ్రయించడంతో ఎఫ్ఐఆర్



బంజారాహిల్స్: అధికార బీఆర్ఎస్‌కు చెందిన కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఆయన అనుచరులపై బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. ఓ భూవిక్రయం విషయంలో ఎమ్మెల్యే, మరికొందరు తనపై భౌతిక దాడికి పాల్పడటంతోపాటు బలవంతపు వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపిస్తూ సామ ఇంద్రపాల్‌రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే ద్వారా స్థలం కొని...

బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం ... రాజేంద్రనగర్ సమీపంలోని ఉప్పరపల్లి నాయుడు కాలనీకి చెందిన సామ ఇంద్రపాల్‌రెడ్డి అదే ప్రాంతంలో స్థలం కొనేందుకు 2018లో ప్రయత్నాలు సాగించాడు. ఈ క్రమంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితోపాటు రాకేశ్‌రెడ్డి మధ్యవర్తులుగా ఆయనకు పరిచయమయ్యారు. వారు ఆయనకు ఉప్పర్‌పల్లిలోని భూయజమానులను పరిచయం చేశారు. స్థలం కొనుగోలుకు అంగీకరించిన ఇంద్రపాల్‌రెడ్డి... ఎమ్మెల్యేతోపాటు ఆయన అనుచరులకు కమిషన్‌తో కలుపుకొని రూ. 3.65 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. భూయజమానులకు రూ. 90 లక్షలను అడ్వాన్స్ కింద చెల్లించడంతోపాటు రూ. 2.75 కోట్లకు ఖాళీ చెక్కులను ఎమ్మెల్యే వద్ద ష్యూరిటీగా ఉంచాడు. ఆ తర్వాత మిగిలిన మొత్తాన్ని యజమానులకు చెల్లించి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న ఇంద్రపాల్‌రెడ్డి... ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, ఆయన అనుచరుడు రాకేశ్‌రెడ్డికి చెరో రూ. 20 లక్షల చొప్పున కమీషన్ చెల్లించాడు. అయినప్పటికీ వారు ఖాళీ చెక్కులను ఇవ్వకపోగా మరో రూ. 60 లక్షలు డిమాండ్ చేశారు. ఇందుకోసం ఆయన రుణానికి ప్రయత్నించగా లభించలేదు. దీంతో నాటి నుంచి తరచూ వేధింపులకు గురిచేస్తూ వచ్చిన ఎమ్మెల్యే, ఆయన అనుచరులు 2022 జూన్‌లో ఇంద్రపాల్‌రెడ్డిని బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు పిలిపించి తీవ్రంగా కొట్టడంతోపాటు చంపుతామని బెదిరించారు. అక్కడి నుంచి ఎలాగోలా తప్పించుకున్న ఇంద్రపాల్‌రెడ్డి దీనిపై 2022 జూన్ 26న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేయలేదు. నిందితులపై చర్యలు తీసుకోవాలని వెస్ట్‌జోన్ డీసీపీని కోరినా స్పందించలేదు. దీంతో కోర్టును ఆశ్రయించగా ఎమ్మెల్యే, ఇతరులపై కేసు నమోదుకు ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఎమ్మెల్యే, మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఫిలింనగర్‌లో జరగడంతో కేసును ఫిలింనగర్ పీఎస్‌కు బదిలీ చేశారు.

చేంజ్‌పై చర్చ..

మొదటి పేజీ తరువాయి

చేసినట్లు తెలిసింది. ఈ అంశాలన్నీ జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్టు చెబుతున్నారు. తమతో కలిసి భోజనం చేసేందుకు రావాలనే ఆహ్వానంతో ఒక మాజీ ఎంపీ అక్కడకు వెళ్లగా, కొంతకాలంగా అంతగా చురుగ్గా లేని ఒకరిద్దరు నేతలు కూడా ఇదే విధమైన ఆహ్వానంతో అక్కడకు వెళ్లారని తెలుస్తోంది.

అసలు ఆ పోస్టే ఉండదు..

బీజేపీలో ప్రచార కమిటీ చైర్మన్ అనే పదవి లేదని సమావేశానంతరం జితేందర్‌రెడ్డి మీడియాతో అన్నారు. ‘రాష్ట్ర నేతలతో చర్చించకుండా అధ్యక్షుడి మార్పుపై జాతీయ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దు. పదవులు ఇచ్చే ముందు లీకులు ఇచ్చే సంస్కృతి బీజేపీలో ఉండదు. దీనిపై సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో వస్తున్న లీకులను పార్టీ క్యాడర్ నమ్మొద్దు. బీజేపీ స్టేట్ చీఫ్‌ను మారుస్తున్నారని కేసీఆర్ లీకులు ఇప్పిస్తున్నారు. బీజేపీ బలం తగ్గిందని చెప్పడానికే కాంగ్రెస్‌పై కేసీఆర్ విమర్శలు చేస్తున్నారు. క్యాడర్‌ను కన్ఫ్యూజ్ చేయడానికి ఇలాంటి ప్రచారం చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీ బలంగా ఉంది. మాకు ఎలాంటి రహస్య అజెండా లేదు. బీజేపీ బలోపేతమే మాకు ముఖ్యం. పొంగులేటి, జూపల్లి కూడా బీజేపీలో చేరాలని కోరుతున్నా. శత్రువుకు శత్రువు.. మిత్రుడు అన్నట్టు కేసీఆర్‌ను కొట్టాలంటే పొంగులేటి, జూపల్లి బీజేపీ వైపు రావాలి..’ అని వ్యాఖ్యానించారు.

భేటీపై స్పందించేందుకు ఈటల నిరాకరణ..

బీజేపీ సీనియర్ నేతలు ప్రత్యేకంగా భేటీ కావడంపై స్పందించేందుకు ఈటల రాజేందర్ నిరాకరించారు. ఇలాంటి వాటిపై తాను మాట్లాడనని, ఎలాంటి చిట్‌చాట్ చేయనని తన నివాసం వద్ద ఆయన మీడియాతో చెప్పారు.

అధిష్టానం ఎలా స్పందిస్తుందో?

సీనియర్ల భేటీ బీజేపీలో చర్చకు దారితీసింది. ఇది దేనికి సంకేతం? దీనిపై అధిష్టానం ఎలా స్పందిస్తుంది? సీనియర్ల అభ్యంతరాలను ఎలా తీసుకుంటుంది? ప్రచార కమిటీ చైర్మన్‌గా ఈటల నియామకంపై ఈ సమావేశం ఎఫెక్ట్ పడుతుందా? అనే దానిపై పార్టీ నేతల్లో ఆసక్తి నెలకొంది.

లీకులు సరికాదు: విజయశాంతి

బీజేపీ తెలంగాణ అధ్యక్ష పదవి మార్పుపై మీడియా ద్వారా లీకులు సరికాదని విజయశాంతి అన్నారు. బీజేపీలో వార్తలు లీక్ చేసే పద్ధతి ఉండదని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలు పూర్తి అయ్యేవరకూ బండి సంజయ్ కొనసాగుతారని రాష్ట్రపార్టీ ఇన్‌చార్జి తరుణ్ చుగ్ గతంలో చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటివరకు ఇదే అధికారిక ప్రకటన అని, ఊహాగానాలతో మీడియాలో వచ్చే కథనాలు అధికారిక ప్రకటనలు కావని స్పష్టం చేశారు.

ఏ ముఖం పెట్టుకొని నడిగడ్డకు వస్తున్నారు

- కేసీఆర్‌ను ప్రశ్నించిన ఆర్ఎస్ ప్రవీణ్




ప్రవీణ్‌కుమార్

అయిజ: సీఎం కేసీఆర్ ఏముఖం పెట్టుకొని నడిగడ్డకు వస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నడిగడ్డకు ఒక మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ, యూనివర్సిటీ ఇవ్వలేదని, కనీసం పాఠశాలల సంఖ్య కూడా పెంచలేకపోయారని విమర్శించారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద కేసీఆర్ సొంత నియోజకవర్గానికి రూ.656 కోట్లు, ఆయన అల్లుడు హరీశ్‌రావు నియోజకవర్గానికి రూ.714 కోట్లు, కొడుకు కేటీఆర్ నియోజకవర్గానికి రూ.వెయ్యి కోట్లు ఇస్తే.. అలంపూర్ నియోజకవర్గానికి కేవలం రూ.20 కోట్లు ఇచ్చారని మండిపడ్డారు. అలంపూర్‌లో దేవస్థానాలకు రూ.100 కోట్లు ఇస్తామని మాట తప్పారని ఆరోపించారు. నడిగడ్డ రైతుల వరప్రదాయిని ఆర్డీఎస్‌కు బడ్జెట్‌లో నయాపైసా కేటాయించలేదని దుయ్యబట్టారు. కాళేశ్వరం నుంచి కేసీఆర్ ఫాంహౌస్‌కు నీళ్లు రావడం కోసం కొండపోచమ్మసాగర్ పేరుతో ప్రాజెక్టు కట్టి ఒక్కో ఎకరాకు నీళ్లు పారించేందుకు రూ.50 వేల చొప్పున ఖర్చు చేశారని విమర్శించారు. అలంపూర్ నియోజకవర్గంలో మాత్రం సాగునీరు లేక రైతులు అల్లాడిపోతున్నారని వాపోయారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి.. బీఎస్పీని గెలిపించాలని ప్రవీణ్‌కుమార్ ప్రజలను కోరారు.

చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- ‘బీసీ డిక్లరేషన్’లో జస్టిస్ ఈశ్వరయ్య డిమాండ్
- బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా చేశారు: జస్టిస్ చంద్రకుమార్



మహాసభలో జస్టిస్ ఈశ్వరయ్య, జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ‘రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నాయి. బీసీల సంక్షేమం పట్ల ఏ ఒక్క రాజకీయ పార్టీకి చిత్తశుద్ధి లేదు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా బీసీ జనగణన చేపట్టలేదు. జనాభా ప్రతిపాదికన చట్ట సభల్లో బీసీలకు అవకాశం కల్పించాలి’అని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్, జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ప్రొఫెసర్ మురళీ మనోహర్ అధ్యక్షతన జరిగిన ‘బీసీ డిక్లరేషన్-2023’మహా సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వెంటనే బీసీ జనగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగం, రాజకీయ, సామాజిక రంగాలతో పాటు మిగతా అన్ని రంగాల్లోనూ బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించాలన్నారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

బీసీలంతా ఏకం కావాలి: జస్టిస్ చంద్రకుమార్


బీసీలను చాతుర్వర్ణ వ్యవస్థలో శూద్రులుగా విభజించి వారికి రాజ్యాధికారం దక్కకుండా చేశారని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. వారిని కేవలం కుల వృత్తులకే పరిమితం చేశారని పేర్కొన్నారు. బీసీ కమిషన్ల ఏర్పాటు కూడా ఓ కంటి తుడుపు చర్య వంటిదేనన్నారు. రాజ్యాధికారం కోసం బీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

రెండు అంశాలే అమలు చేశారు

మండల్ కమిషన్ సిఫార్సుల్లోని కేవలం రెండు అంశాలు మాత్రమే అమలు చేశారని బీపీ మండల్ మనవడు ప్రొఫెసర్ సూరజ్ మండల్ పేర్కొన్నారు. జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చౌదరి వికాస్ పటేల్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కులగణన చేపట్టకపోవడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో బీసీ డిక్లరేషన్ కమిటీ కన్వీనర్ సమ్మయ్య, సభ్యులు ప్రొఫెసర్ తిరుమలి, సతీశ్ కొట్టే, పంజాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం



కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కృష్ణయ్య

కాచిగూడ(హైదరాబాద్): దేశ జనగణనలో కుల గణన చేపట్టాలని, వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో 50%రిజర్వేషన్లు పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆర్.కృష్ణయ్యతో పాటు బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేతలు గుజ్జ కృష్ణ, డాక్టర్ నందకిషోర్, నీలవెంకటేశ్, భూపేశ్ సాగర్, నందగోపాల్, రామకృష్ణ, రాజ్‌కుమార్, రాందేవ్, రాజేందర్, మల్లేశ్‌లతో కూడిన ప్రతినిధి బృందం ఆదివారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి బీసీల డిమాండ్లపై చర్చించారు. అనంతరం బీసీల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కేంద్రమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, గత 75 ఏళ్లగా బీసీలకు ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం వాటా ఇవ్వడం లేదని, వారికి విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో కనీస ప్రాతినిధ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ రంగంలో బీసీల ప్రాతినిధ్యం 14% దాటలేదని, కేంద్రం ఇటీవల సేకరించిన గణాంకాల ద్వారా తెలిసిందన్నారు. దేశంలో 56% ఉన్న బీసీలకు రాజకీయ రంగంలో 14%, ఉద్యోగ రంగంలో 9%, పారిశ్రామిక రంగంలో 1%, ప్రైవేటు రంగంలోని ఉద్యోగాల్లో 5%, ఉన్నత న్యాయస్థానాల్లో 2% ప్రాతినిధ్యం లేదంటే చట్ట సభల్లో బీసీలకు జనాభా ప్రకారం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..బీసీల డిమాండ్లు న్యాయమైనవేనని, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడానికి, బీసీల బడ్జెట్ పెంచడానికి తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.



దేనికి భయపడనక్కర్లేదో తెలుసుకోవడమే ధైర్యం.
– ప్లేటో

సాక్షి
సోమవారం, 12 జూన్ 2023

ఎదురుచూపులు

ధర్మం నాలుగుపాదాలా నడిచే రాజ్యంలో క్రమం తప్పకుండా వానలు కురుస్తాయని ప్రతీతి. ఇప్పుడు ధర్మం ఎన్ని పాదాలతో నడుస్తోందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ధర్మం ఎంత కుంటి నడక నడుస్తున్నా, ఈ భూమ్మీద చెట్టూ చేమా, పిట్టా పిచుకా, పశువులూ మనుషులూ మనుగడ సాగించాలంటే తప్పకుండా వానలు కురవాల్సిందే! ఈసారి వేసవి తన తీవ్రతను తారస్థాయిలో చూపుతోంది. ఎండలు మండిపడుతున్నాయి. సూర్యుడింకా నడినెత్తికి రాకముందే నడివీథుల్లో నిప్పులు చెరుగుతున్నాయి. రుతు పవనాలు ఇప్పటికే కేరళ తీరానికి చేరుకున్నాయి. నేడో రేపో ఇక్కడకూ చేరుకుంటాయి. వానలు కురిపిస్తాయి. ఈ ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం జనాలు చాతకాల్లా వానల కోసం ఎదురు చూస్తున్నారు. ఉక్కపోతలతో అల్లాడిన జనాలకు నాలుగు చినుకులే ఊరట! వాన చినుకుల కోసం నెర్రెలువారిన నేల ఆవురావురుమని ఎదురుచూస్తుంది.

మన ప్రాచీన సాహిత్యంలో చాతక పక్షులు ఎదురుచూపులకు ప్రతీకలు. చాతక పక్షులు వాన చినుకుల నీటిని మాత్రమే తాగుతాయని, అందుకే అవి వానల కోసం ఆత్రంగా ఎదురుచూస్తుంటాయని పురాణ సాహిత్యం చెప్పేమాట! శాస్త్రీయ వాస్తవాలు మరోలా ఉన్నా, మన కవులు చాతకపక్షులను ఎదురుచూపులకు ప్రతీకగానే ఎంచుకున్నారు. 'హంసః పద్మవనం సమిచ్ఛతి యథా నీలాంబుదం చాతకః/ కోకః కోకనదప్రియ ప్రతిదినం చన్ద్రం చకోరస్తథా/ చేతో వాంఛతి మామకం పశుపతే చిన్మార్గమృగ్యం విభో/ గౌరీనాథ భవత్పదాబ్జ యుగళం కైవల్య సౌఖ్యప్రదం' అన్నారు ఆదిశంకరులు. తామరతూళ్లనే ఆహారంగా తినే హంసలు తామరలతో నిండిన సరోవరాల కోసం ఎదురుచూస్తాయి. వాన చినుకులను మాత్రమే తాగే చాతకాలు వానలు కురిపించే కారుమబ్బుల కోసం ఎదురుచూస్తాయి. వెన్నెలనే ఆహారంగా తీసుకునే చాతకాలు చంద్రోదయం కోసం ఎదురుచూస్తాయి. అలాగే అసలైన భక్తుడు పరమేశ్వరుడి సాన్నిధ్యం కోసం ఎదురుచూస్తాడట! శ్రీమహావిష్ణువు ద్వాపరయుగంలో కృష్ణావతారం దాల్చి భూలోకంలో పుట్టాడు. అప్పుడు వైకుంఠవాసులు శ్రీమహావిష్ణువు రాక కోసం లిప్త ఒక యుగంగా నిరీక్షించినట్లు దివాకర్ల వెంకటావధాని తన 'కలి పరాజయము'లో వర్ణించారు.

నిజానికి మనుషుల బతుకులే ఎదురుచూపుల మయం. బడికి వెళ్లే వయసులో సెలవుల కోసం ఎదురుచూపులు. కాలేజీ కుర్రకారుకు ప్రేమికుల కోసం ఎదురుచూపులు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూపులు. ఉద్యోగులకు నెలకోసారి వచ్చే జీతాల కోసం ఎదురుచూపులు. జబ్బుచేసి ఆస్పత్రికి వెళితే అక్కడ వైద్యుడి దర్శనం కోసం ఎదురుచూపులు. జీవితంలో సింహభాగం ఇలా ఎదురుచూపులతోనే గడిచిపోతుంది. 'ఒకవేళ ఏవైనా ఎదురుచూపులు నెరవేరకపోతే ఆశ్చర్యపోవద్దు. దాన్నే మనం జీవితమంటాం' అని ఆస్ట్రియన్ సంతతికి చెందిన బ్రిటిష్ మానసిక విశ్లేషకురాలు అనా ఫ్రాయిడ్ వ్యాఖ్యానించింది. జీవితంలో చాలా ఎదురుచూపులు ఉంటాయి. సాధారణంగా వాటిలో నెరవేరనివే ఎక్కువ! ఎదురుచూపులు నెరవేరినప్పుడు సంతోషాన్నిస్తాయి. నెరవేరని ఎదురుచూపులు నిరాశలో ముంచేస్తాయి. 'ఈ లోకంలో మనుషులు భ్రమల్లో బతుకుతూ ఎల్లప్పుడూ ఏదో ఒకదాని కోసం ఎదురుచూస్తూనే ఉంటారు– ఒక్క ముక్కలో చెప్పాలంటే, కోరికలతో సతమతమవుతుంటారు' అన్నాడు బుద్ధుడు.

లోకంలో ఎవరి ఎదురుచూపులు వారికి ఉండనే ఉంటాయి. అయితే, సాహిత్యంలో ప్రేయసీ ప్రియుల ఎదురుచూపులకే అమిత ప్రాధాన్యమిచ్చారు మన కవులు. భావకవిత్వం సాహితీలోకాన్ని కమ్మేసిన కాలంలో మన కవులు ఊహాసుందరుల కోసం ఎదురుచూపులు చూస్తూ, వీసెల కొద్ది విరహగీతాలు రాశారు. 'ప్రబల కష్ట పరంపరల్ ప్రతిఘటించి/ నిల్చిపోయితి నీకయి నేటివఱకు!/ ఈ నిరీక్షణ పరిణామ మేమి యగునొ?' అని చివరకు శ్రీశ్రీ కూడా తన గీతపద్యాలలో ఎదురుచూపుల వగపును వడబోశారు. 'చిన్ని చిన్ని చిన్ని చెట్ల/ వన్నె వన్నె వన్నె పూల/ ఏరి ఇంద్రచాప మట్లు/ కట్టినాను నీకు మాల/ కాని, ఇచటికి ప్రియురాల!/ నీవింకను రావదేల?' అంటూ పఠాభి తన 'నిరీక్షణ'లోని నిట్టూర్పులతో సెగలు రేపారు. అష్టవిధ నాయికలలో విరహోత్కంఠిత తన నాయకుని కోసం అనుక్షణం ఎదురుచూస్తూ, విరహతాపాన్ని అనుభవిస్తూ ఉంటుంది. 'భర్త ఆఫీసునన్ బందియై పోయినన్/ ఎదురు తెన్నులు జూచు నింతి యిపుడు/... కాంతుడు రాకున్న క్షణము లుత్కంఠమ్మె/ భారాన క్షణములు కదలునెపుడు/... వేగిపోవును తన భర్త జాగుజేయ/ నామె యందమైన కనులె యలసిపోవు' అంటూ ఆధునిక విరహోత్కంఠితల ఎదురుచూపుల విరహతాపాన్ని కొనకళ్ల ఫణీంద్రరావు చమత్కారంగా రాశారు.

ఆముష్మికుల ఎదురుచూపులు భగవత్ సాన్నిధ్యం కోసం కావచ్చు, విరహిణుల ఎదురుచూపులు తమ నాయకుల కోసం కావచ్చు, భావకవుల ఎదురుచూపులు ఊహాసుందరీమణుల కోసం కావచ్చు గాని, సామాన్యులు మాత్రం ఎప్పుడొస్తాయో తెలియని మంచిరోజుల కోసం ఎదురుచూపులు చూస్తుంటారు. నడివేసవిలో వానల కోసం ఎదురుచూస్తే, కొద్దిరోజులకైనా నాలుగు చినుకులు కురుస్తాయేమో గాని, సామాన్యులు మంచిరోజుల కోసం ఎన్నాళ్లు ఎదురుచూపులు చూడాలో ఎవరూ చెప్పలేరు. అయినా, జనాలు ఎంతో ఆశతో మంచిరోజుల కోసం ఎదురుచూస్తూనే ఉంటారు. మనసులో ఆశల దీపాలు వెలుగుతున్నంత సేపూ ఎదురుచూపులు బాధించవు. ఎదురుచూపులు చూసే శక్తి కోసమైనా ఆశలను అడుగంటిపోకుండా కాపాడుకోవాలి.

ప్రజల కోసమే ప్రశ్నించే స్వేచ్ఛ

కామెంట్



కరణ్ థాపర్

తొమ్మిదేళ్ల సుదీర్ఘ కాలంలో మోదీ ఒక్కసారి కూడా పత్రికా సమావేశాన్ని నిర్వహించలేదనీ, జవాబుదారీతనం నుంచి ఆయన తప్పించుకోవాలని చూస్తున్నారనీ అనేకమంది ఒక అంతిమ భావనకు వచ్చేశారు. నిజానికి పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశాలు తమ నాయకులను ప్రజలకు జవాబుదారీగా చేసేందుకు పత్రికా సమావేశాలను కాక, 'రాజకీయ ఇంటర్వ్యూ'లకు ప్రాముఖ్యం ఇస్తాయి. ఏ అంశం మీద ప్రశ్నలు అడగాలన్నదీ, ఏ ప్రశ్నపై విడుపు లేకుండా పట్టుతో ఉండాలన్నదీ ఆ జర్నలిస్టు నియంత్రణలోనే ఉంటుంది. ఒక ప్రశ్నకు ప్రధాని నుంచి సంతృప్తికరమైన సమాధానం వచ్చే వరకు ఆ ప్రశ్నను కొనసాగించే హక్కును ఆ పాత్రికేయుడు కలిగి ఉంటాడు. నిజాన్ని నిగ్గు తేల్చే విధానం అది.

పత్రికా సమావేశాన్ని నిర్వహించడానికి దేశ ప్రధాని సుముఖంగా ఉన్నారంటే ప్రజలకు జవాబుదారీగా ఉండేందుకు ఆయన సంసిద్ధతను కనబరుస్తున్నారని ఇండియాలో మనం భావిస్తాం. ప్రధానికి నిజంగానే తన పాలనకు బాధ్యత వహించే ఉద్దేశం ఉందా, లేదా అనేదానికి అసలైన పరీక్ష... ఆయన ఒక పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేయడం, లేదా చేయకపోవడం. పత్రికా సమావేశంలో వందలాది మంది పాత్రికేయులకు ముఖాముఖి బదులు ఇవ్వవలసి వచ్చినప్పుడు కఠినమైన ప్రశ్నలను ఎదుర్కోవలసి ఉంటుంది. అలాగే డొంక తిరుగుడు లేకుండా సమాధానాలు చెప్పవలసి వస్తుంది. అందుకే తొమ్మిదేళ్ల సుదీర్ఘ కాలంలో మోదీ ఒక్కసారి కూడా పత్రికా సమావేశాన్ని నిర్వహించలేదనీ, జవాబుదారీతనం నుంచి ఆయన తప్పించుకోవాలని చూస్తున్నారనీ అనేకమంది ఇప్పటికే ఒక అంతిమ భావనకు వచ్చేశారు.

వారి భావనతో ఒక్క క్షణమైనా నాకు నిమిత్తం లేనప్పటికీ, పత్రికా సమావేశాన్ని మోదీ దాటవేస్తూ రావడంపై నాకు తీవ్రమైన అభ్యంతరాలు ఉన్నాయి. ప్రపంచంలోని మిగతా ప్రజాస్వామ్య దేశాలలో నిజమైన జవాబుదారీతనాన్ని భిన్న పాత్రికేయ ప్రక్రియల ద్వారా సాధిస్తారు. ఆ విషయానికి తర్వాత వస్తాను. మొదట, పత్రికా సమావేశాల మీద మనకుండే విశ్వాసం ఎందుకు సన్నగిల్లుతున్నదో నన్ను వివరించనివ్వండి.

మొదటి విషయం. పత్రికా సమావేశంలో అనేక మీడియాల నుంచి వచ్చిన అనేకమంది ప్రతినిధులు ఉంటారు. వారిలో ప్రతి ఒక్కరూ తమదైన ప్రశ్న ఒకటి అడిగేందుకు ఆతురతతో ఉంటారు. చాలా వరకు అవన్నీ ఒక దానితో ఒకటి సంబంధం లేని వేర్వేరు ప్రశ్నలే అయి ఉంటాయి. గంటల పాటు పత్రికా సమావేశం జరుగుతున్నా ఈ వేర్వేరు ప్రశ్నల కారణంగా ప్రధానమంత్రి జవాబులు చెప్పడానికి ఎప్పుడో తప్ప ఒత్తిడికి లోనయ్యే అవకాశం దాదాపుగా ఉండదు.

ప్రధాని ఎందుకు ఒత్తిడికి లోనవరో చెప్తాను చూడండి. ప్రధాని పత్రికా సమావేశాలలో ఒక జర్నలిస్టుకు ఒక ప్రశ్న వేయడానికి మాత్రమే అనుమతి ఉంటుంది. ఒక జర్నలిస్టు ఒక ప్రశ్న అడిగాక, ఆ తర్వాతి జర్నలిస్టు తిరిగి అదే ప్రశ్న అడిగేందుకు ఉండదు. అప్పుడు ఆ జర్నలిస్టు తన ప్రశ్నను, ఒక్కోసారి తన సబ్జెక్టును కూడా మార్చుకోవలసి వస్తుంది. అంటే ఒకటే ప్రశ్నపై పట్టుపట్టడానికి తక్కువ అవకాశం ఉండటంతో ప్రధానిపై ఒత్తిడి పెరిగే పరిస్థితి ఉండదు. అప్పుడు ఆయన పొంతన లేని, లేదా సంపూర్ణం కాని సమాధానాలతో తప్పించుకోవచ్చు. ప్రధాని అజాగ్రత్తతో తొట్రుపడితేనో, లేదంటే ఏవైనా అవాస్తవాలు ఆయన నుంచి దొర్లితేనో తప్ప ఆయన పట్టుబడరు. అది



నక్క తోకను తొక్కడమే కానీ, నాణ్యమైన జర్నలిజం కాదు.

నిజానికి ప్రధాని పత్రికా సమావేశాన్ని టీవీలో ప్రత్యక్ష ప్రసారంగా చూస్తున్నప్పుడు ఆయన ఒక నేర విచారణను ఎదుర్కొంటున్న వ్యక్తిగా కనిపిస్తారు. కానీ అది భ్రమ. ఒకే ప్రశ్నను పదే పదే అడుగుతూ, ఆయన ఇచ్చే సమాధానాలను నిశితంగా పరిశీలించి వాటిలోని తప్పుల్ని, దాటవేతల్ని ఎత్తి చూపుతూ ఉన్నప్పుడు మాత్రమే ఆయన దిక్కుతోచని స్థితికి చేరుకుంటారు. అయితే ప్రధాని పత్రికా సమావేశాలలో ఇలా జరిగే అవకాశం ఉండనే ఉండదు.



మార్గరెట్ థాచర్‌ను ఇంటర్వ్యూ చేస్తున్న బ్రియాన్ వాల్డెన్

అందుకే పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశాలు తమ నాయకులను ప్రజలకు జవాబుదారీగా చేసేందుకు పత్రికా సమావేశాలకు కాక, 'రాజకీయ ఇంటర్వ్యూ'లకు ప్రాముఖ్యం ఇస్తాయి. ప్రధాని–జర్నలిస్ట్ ఇద్దరే ఎదురెదురుగా ఆ ఇంటర్వ్యూలో ఉంటారు. ముఖ్యంగా అక్కడ ఆ ఏక పాత్రికేయుడే... ప్రధాని జవాబులు చెప్పవలసిన ప్రశ్నలను నిర్ణయిస్తారు. ఏ అంశం మీద ప్రశ్నలు లేవనెత్తాలన్నదీ, అలాగే ఏ ప్రశ్నపై విడుపు లేకుండా పట్టుతో ఉండాలన్నదీ ఆ జర్నలిస్టు నియంత్రణలోనే ఉంటుంది. ఒక ప్రశ్నకు ప్రధాని నుంచి సంతృప్తికరమైన సమాధానం వచ్చే వరకు ఆ ప్రశ్నను కొనసాగించే హక్కును ఆ పాత్రికేయుడు కలిగి ఉంటాడు. నిజాన్ని నిగ్గు తేల్చే విధానం అది. అలాంటి జర్నలిస్టు విషయాలన్నీ బాగా తెలిసినవాడై, నిర్భీతి, దృఢ చిత్తం గలవాడై ఉండాలని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కచ్చితంగా అయితే అతడు ప్రధాని ముందు నీళ్ల నమలనివాడై ఉండాలి.

జిహ్వకు చాపల్యాన్ని అంటించే రుచికరమైన బ్రిటిష్ రాజకీయ వర్గ అసంబద్ధ అంతర్గత కథనాలతో రాబ్ బర్లీ అనే బ్రిటిష్ టీవీ ప్రొడ్యూసర్ తాజాగా వండి వార్చిన 'వై ఈజ్ దిస్ లైయింగ్ బాస్టర్డ్ లైయింగ్ టు మి?' అనే పుస్తకంలో ఇలా రాశారు: ''రాజకీయ ఇంటర్వ్యూలు అనేవి అధికారంలో ఉన్నవారిని ప్రజలకు పూచీ పడేలా చేయడానికే తప్ప, నాయకులకు లబ్ధిని చేకూర్చడానికి కాదు. అవి ఉన్నది ప్రజా ప్రయోజనాల కోసం.''

దేశ అత్యున్నత పదవికి అభ్యర్థులైన వారి యోగ్యతను రాజకీయ ఇంటర్వ్యూల ద్వారా ఎలా అంచనా వేయవచ్చో బర్లీ ఈ పుస్తకంలో చెబుతున్నప్పటికీ, ఇప్పటికే అధికారం మాటున దాగి ఉన్నవారికి కూడా ఆయన మాట వర్తిస్తుంది. ''అటువంటి ఇంటర్వ్యూలు మన రాజకీయ సంస్కృతి స్వభావం, సమర్థత, విశ్వసనీయతలను బహిర్గతం చేయడానికి తోడ్పడే ఉత్తమ సాధనాలు. వాటి గురించి మనం గట్టిగా అడగాలి.''

మోదీ కూడా రాజకీయ ఇంటర్వ్యూలు ఇచ్చారు. నిజానికి చాలానే ఇచ్చారు. ప్రశ్న ఏమిటంటే, ఆయన్ని ఇంటర్వ్యూ చేసిన జర్నలిస్టులు ఎలాంటివారు? ఎలాంటి అంశాలను వాళ్లు ప్రధాని ముందు లేవనెత్తారు? ఎంత త్వరగా వాళ్ల ప్రశ్నల గేలం ప్రధానిని విడిచి పెట్టింది? ఈ ప్రశ్నలన్నిటి సమాధానాల కోసం మునుపటి ఇంటర్వ్యూలను చూడండి. అవి మిమ్మల్ని నిరుత్సాహపరుస్తాయి. ఆ ఇంటర్వ్యూలు మోదీ తనేం చెప్పదలిచారో అవి చెప్పడానికీ, తరచూ ప్రతిపక్షాలను విమర్శించడానికీ కానుకగా అందివచ్చిన వేదికలు.

బ్రిటిష్ బ్రాడ్‌క్యాస్టర్‌లు జెరెమి పాక్స్‌మ్యాన్, బ్రియాన్ వాల్డెన్స్ తమ రాజకీయ ఇంటర్వ్యూల కారణంగానే ప్రత్యేకంగా నిలిచిపోయారు. వాల్డెన్ తన సంధింపులతో బ్రిటన్ మాజీ ప్రధాని మార్గరెట్ థాచర్‌ను గుక్క తిప్పుకోకుండా చేశారు. పాక్స్‌మ్యాన్ అప్పటి బ్రిటిష్ విదేశాంగ కార్యదర్శి మైఖేల్ హోవర్డ్‌ను అడిగిన ప్రశ్ననే పన్నెండు సార్లు అడిగి ఆయన్ని గుటకలు వేయించారు. రెండు ఇంటర్వ్యూలలో అవి ముగిసే సమయానికి థాచర్, హోవర్డ్ సరైన సమాధానాలు చెప్పలేకపోయారు. చెప్పకపోవడం కాదు, చెప్పలేకపోవడం! ఆ చెప్పలేకపోవడమే ప్రజలకు వారిని జవాబుదారీగా చేసింది.

మన ప్రధానులను కూడా ఇంత కఠినంగా, కనికరం లేకుండా ప్రశ్నించగల రోజు వస్తే, మన రాజకీయాలలో నాటకీయమైన మార్పును చూస్తాం. మన రాజకీయ నాయకులు మారతారు. మనతో అబద్ధాలు చెప్పడం మానేస్తారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఒక్కసారి తినగానే...



48 గంటల క్రితం నా భార్య మామిడిపళ్లంటే మీకు ఎందుకంత పిచ్చి అంది. ఇండియాలో ఒక్క పండు తిన్నదో లేదో– అదేం విత్తనం. ఏ వాతావరణంలో పండుతుంది. ఈ 'ఇమామ్ పసంద్' రకం మేముండే సియాటిల్ (అమెరికా)లో ఎలా పండించాలి అని పరిశోధన చేయడం మొదలుపెట్టింది.

– శివ్ రామ్‌దాస్, స్టోరీ టెల్లర్

ఇదేం అరాచకం?



చనిపోయిన తాలిబన్ మిలిటెంటు శరీరాన్ని వాహనం ముందర కట్టి బహిరంగంగా ఊరేగించారు పాకిస్తాన్ పోలీసులు. దక్షిణాసియా వేగంగా మధ్య యుగాల దిశగా వెనక్కి జారుతోంది.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

తాగడమే సమస్య



నాలుగు వేల కాలేయ మార్పిడి చికిత్సలను మేము ఇప్పుడే విశ్లేషించాం. మద్యపాన కాలేయ వ్యాధి కేసులు ఉన్నట్టుండి పెరగడం దిగ్భ్రమ కలిగించింది. మద్యపానం వల్ల కాలేయం పని చేయకపోవడం లేదా క్యాన్సర్ రావడం అనేది కాలేయ మార్పిడికి కారణమవుతున్న కేసులు 2017లో ఉన్న 21 శాతం నుంచి రెట్టింపై 40 శాతానికి పెరిగాయి.

– అర్విందర్ సింగ్ సోయిన్, కాలేయ మార్పిడి సర్జన్

చదవకపోతే ఫర్లేదా?



ఎవరైనా జైల్లో ఉండకూడదంటే దానికి కారణం అతడు అమాయకుడై మాత్రమే ఉండాలి : అంతేగానీ అతడు పీహెచ్‌డీ స్కాలర్, యువకుడు, బాగా చదువుతాడు అన్నవి కారణాలు కాకూడదు. ఒకరి చదువు గురించి ఎక్కువ నొక్కి చెబుతున్నామంటే, పెద్దగా చదువుకోని వాళ్లను నిరవధికంగా ఖైదు చేస్తే ఫర్లేదని పరోక్షంగా చెబుతున్నట్టు.

– అమిత్ పాండేలియా, కాలమిస్ట్

మొదటి గోల



ప్రపంచంలోని ప్రతి ఒక్క విషయం లోనూ మొదటిస్థానంలో ఉండాలని విశ్వసించే వాళ్లలో భారతీయులు మొదటి స్థానంలో ఉంటారు. తాము అందరికంటే అత్యుత్తమం అని నిరూపించుకోవడం పట్ల ఇంత పట్టింపు ప్రపంచంలోని మరే దేశంలోని ప్రజలకు ఉండదు. ఈ నంబర్ పిచ్చి అనేది ఒక జాతీయ వ్యాధి.

– రాజీవ్ త్యాగి, మాజీ ఫైటర్ పైలట్


సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

మంచి పుస్తకం

సినీ చరిత్రకు మాయా దర్పణం

ప్రపంచ సినిమా చరిత్ర... ఈ మాట అనడానికీ, వినడానికీ మామూలుగా అనిపించవచ్చు. కానీ, నూటికి పైగా దేశాలకు విస్తరించిన నూటపాతికేళ్ళ పైచిలుకు చరిత్రను ఒక పుస్తకంగా రాయడం కష్టం. చదివించేలా రాయడం మరీ కష్టం. నాలుగేళ్ళ పైగా ఎంత శ్రమ పడ్డారో కానీ, రచయిత అరిపిరాల సత్యప్రసాద్ ఆ కష్టాలను విజయవంతంగా అధిగమించారనడానికి నిదర్శనం – ఇటీవల వెలువడ్డ 'ప్రపంచ సినిమా చరిత్ర' పుస్తకం. క్రీస్తు పూర్వం 40 వేల ఏళ్ళ క్రితం ఆదిమ మానవుడు గుహలో బొమ్మ గీసి, తోటివారికి వేట గురించి చెప్పడానికి ప్రయత్నించినప్పటి నుంచి ఇవాళ్టి ఓటీటీ ప్రపంచం, రాబోయే కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కథతో వర్చ్యువల్ టెక్నాలజీతో తయారయ్యే భవిష్యత్ సినిమా దాకా ప్రపంచ సినీ గమనాన్ని చూపే మాయా దర్పణం ఈ పుస్తకం. సినిమాటోగ్రాఫ్ ఆవిష్కరణకు ముందు ఎడిసన్ తదితరులు చేసిన ప్రయోగాలు, గ్రిఫిత్ తీసిన ప్రసిద్ధ మూకీ చిత్రం 'బర్త్ ఆఫ్ ఎ నేషన్' అనేక విధాలుగా హాలీవుడ్ సినిమాకు ఒక నిర్దిష్ట సూత్రీకరణ చేసిన విధానం... ఇలా అనేక అంశాలను ఈ పుస్తకం అతి సులభంగా వివరిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఇండిపెండెంట్ సినిమా ఉద్యమానికి తొలి అడుగైన చార్లీ చాప్లిన్ తదిత రుల యునైటెడ్ ఆర్టిస్ట్స్ ఆవిర్భావం లాంటి సంఘటనలు ఆసక్తిగా చదివిస్తాయి.

జర్మన్ ఎక్స్‌ప్రెషనిజం, ఫ్రెంచ్ న్యూవేవ్, ఇటాలియన్ నియో రియలిజం – ఇలా వివిధ దేశాల్లో వచ్చిన సినీ ధోరణులు, అవి చూపిన ప్రభావాలు, మూకీలు, టాకీలు, ప్రపంచ సినీ పరిణామక్రమం – ఇవన్నీ ఈ పుస్తకం చదివి తెలుసుకోవచ్చు. చదివించేలానే కాక, చదువుతుంటే కళ్ళ ముందు దృశ్యాలు కనిపించేలా రాయడం ఈ రచన విశిష్టత. రచయిత ప్రత్యేకత. సినీ రచయితగా, నటుడిగా ప్రవేశం... కథ, నవల, అనువాదం – ఇలా వివిధ సాహిత్య ప్రక్రియల్లో అభినివేశం... రెండూ ఉన్నవారు కావడంతో అరిపిరాల ఈ భగీరథయత్నానికి న్యాయం చేశారు. సరళంగా చదివించారు. సంప్రదాయ రచనా విధానానికి భిన్నంగా, ఒక గైడెడ్ టూర్‌లా రాయాలనే ఆలోచన, రాసిన పద్ధతి అందుకు ఇతోధికంగా ఉపకరించాయి.



అయితే, కొండను అద్దంలో చూపే శ్రమతో కూడిన ప్రయత్నం కావడం వల్ల సంఘటనల్ని వివరించే క్రమంలో స్థలకాలాల విషయంలో అటూ ఇటూ కుప్పిగెంతులు, కప్పదాట్లు తప్పలేదు. సమాచారాన్ని మరికొంత సూక్ష్మంగా, దేనికదిగా వర్గీకరణ చేసి ఉండాల్సింది. కంటికి శ్రమ లేకుండా పేజీల అలంకరణలో జాగా నిస్తూ జాగ్రత్తలు తీసుకుంటే పుస్తక పఠనీయత ఇంకా పెరిగి ఉండేది. కానీ ఇప్పటికే 680 పేజీల బృహత్ గ్రంథంగా తయారైంది గనక, ఆ లగ్జరీ లేకపోయి ఉండవచ్చు. అయినా అదేమీ మరీ పెద్ద లోపమనిపించకుండా, ఆసక్తిని నిలపడం ఈ రచనలో విశేషం.

నిజానికి, భారతీయ సినిమాపై ఎక్కువగా, ప్రపంచ సినిమాపై కాస్తంత తక్కువగా... తెలుగులో ఇప్పటికే పలు పుస్తకాలున్నాయి. విషయంలో, వివరించిన విధానంలో వాటికి భిన్నంగా ఉండడం ఈ 'ప్రపంచ సినిమా చరిత్ర'ను ప్రత్యేకంగా నిలిపే అంశం. సరళమైన ఈ రచన సామాన్య సినీ ప్రియులకు సైతం ప్రపంచ సినిమాపై ప్రాథమిక అవగాహనను పెంచుతుంది. సముద్రాన్ని దోసిట్లో పడుతుంది. మంచి పుస్తకాల్ని అందించడంలో నాలుగేళ్ళుగా ముందుంటున్న ఆన్వీక్షికి పబ్లిషర్స్ సమర్పించిన ఈ వందో ప్రచురణ సినీ, పుస్తక ప్రియులిరువురికీ మండు వేసవిలో మంచి మామిడి పండు! – రెంటాల జయదేవ

పిల్లలకు ఏం నేర్పాలి? ఎవరు నేర్పాలి?

అభిప్రాయం



వి.వి. రమణ

విలువలతో కూడిన విద్యను విద్యార్థులు, భావితరాల వారు నేర్చుకో లేకపోతే రాబోవు సమాజం అతిపెద్ద ఉపద్రవాన్ని ఎదుర్కొంటుంది. నేడు సమాజంలో కుటుంబ విలువలు, సామాజిక విలువలు, రాజకీయ విలువలు, మీడియా విలువలు, విద్యాపరమైన విలువలు ఇలా... అన్ని రకాల విలువలు పతనం చెందుతూ ఉన్నాయి. వాటిని వ్యక్తి గమనించి మార్పు చెందుతున్నాడు. వ్యక్తి నుండి ప్రారంభమయ్యే మార్పు అతని ఆలోచనల నుండే ప్రారంభమవుతుంది. ఆలోచన ఆచరణగా మారుతుంది. ఆచరణ అలవాటుగా, అలవాటు స్వభావంగా, ఆ స్వభావమే వ్యక్తి వ్యక్తిత్వం అవుతుంది. విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని బోధించడానికి గురువులు మార్గదర్శకులుగా ఉంటారు. ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే గురువులు బోధన ద్వారా వ్యక్తిలో కొంతవరకు మాత్రమే విలువలు పెంపొందించగలరు. అదే ఆచరణ ద్వారా పూర్తిస్థాయిలో వారిలో విలువలను ప్రోదిచేయవచ్చు.

పాశ్చాత్య దేశాలలో వివాహం ఇద్దరు వ్యక్తుల మధ్య జరుగుతుంది. భారతదేశంలో వివాహం రెండు కుటుంబాల మధ్య జరుగుతుంది. అందుకే భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రఖ్యాతి గాంచింది. కుటుంబంలో సామరస్యం, కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు, ఒకరి భావాలను ఒకరు గౌరవించుకోవడం వంటి విషయాలను తల్లితండ్రులు పిల్లలకు గురువులుగా బోధిస్తున్నారు. కానీ ఇటీవలకాలంలో జీవనం యాంత్రికత్వాన్ని సంతరించుకుని కుటుంబ సభ్యులు అంతా కలిసి భోజనం చేసే పరిస్థితే లేకుండా పోయింది. ఇక విలువల గురించిన చర్చలు ఎప్పుడు జరగాలి?

ఒక సమాజం ఆమోదించిన, అంగీకరించిన ఆదర్శాలు, నియమాలు, ప్రవర్తనలనే సామాజిక విలువలు అంటారు. 'మంచి విలువలు గల వ్యక్తుల వలనే మంచి సమాజం నిర్మాణం అవుతుంది'. ఇది ఎలా సాధ్యం అంటే కేవలం 'సామాజిక విలువల'ను బాధ్యతగా పాటించడం ద్వారా మాత్రమే. ఈ సామాజిక విలువలను పూర్తిస్థాయిలో క్లాస్ రూమ్‌లో బోధించేది ఉపాధ్యాయుడే అయినప్పటికీ .. సమాజంలో ఉన్నత పదవులలో ఉన్నవారూ 'విలువలను ఆచరణ ద్వారా' ప్రజలకు స్ఫూర్తినివ్వాలి.



విద్య విషయానికి వస్తే తల్లితండ్రులకు 'విద్య విలువలు' అర్థమవ్వడం లేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి కంటే నేడు మన దేశంలో అక్షరాస్యత రేటు పెరిగింది. అయినప్పటికీ అవినీతి కూడా పెరిగింది. విద్యావంతులు, అక్షరాస్యత రేటు పెరిగితే అవినీతి తగ్గాలి కదా! మరి ఎందుకు పెరిగింది? విలువలతో కూడిన విద్య లేనందునే! విద్య ప్రధాన లక్ష్యం 'విలువలను పెంపొందించడమే'. భారతదేశానికి 'వ్యక్తులను నిర్మించే విద్య' కావాలన్నారు స్వామి వివేకానంద. తల్లితండ్రులు విలువల గురించి కాక మార్కులూ, ర్యాంకుల గురించే ఉపాధ్యాయులతో చర్చించడం శోచనీయం.

అబ్రహాం లింకన్ ఒకప్పుడు అమెరికా అధ్యక్షుడు. తన బిడ్డను బడిలో చేరుస్తూ ఆ బిడ్డకు ఎలాంటి విలువలు నేర్పాలని తాను కోరుకుంటున్నారో ఒక లేఖ రాసి ఉపాధ్యాయునికి పంపించారు. అందులో... 'ఈ లోకంలో అందరూ న్యాయబద్ధులూ, సచ్ఛీలురూ కాదనే వాస్తవాన్ని మా పిల్లవాడికి చెప్పండి. అంతేకాదు ప్రతి యోగ్యుడిలో ఒక నాయకుడు ఉంటాడని చెప్పండి. రాజకీయ నాయకులలో స్వార్థపరులతో పాటు అంకితభావం కలవారు ఉన్నారని చెప్పండి. దగాకోరులతోపాటు ధీరోదాత్తులూ ఉన్నారని తెలపండి. శత్రువులతో పాటు నిజమైన మిత్రులూ ఉంటారని బోధించండి. కష్టపడే మనస్తత్వాన్ని అలవాటు చేయండి. అసూయా ద్వేషాలను దూరం చేయండి' అని రాశారు.

'విలువలతో కూడిన రాజకీయం ఉండాలి' అని గాంధీజీ ప్రబోధించారు. ప్రభుత్వ నేతలు విలువలు గలవారైతే దేశానికి మంచి జరుగుతుంది. క్లాస్ రూమ్‌లో గురువులు బోధించే రాజకీయ విలువలకు బయట కనబడే రాజకీయ విధానాలకు పొంతనే లేదు. సిద్ధాంతపరంగా ఒక పార్టీ మరొక పార్టీపై విమర్శించుకోవడం సహజం. కానీ నేడు వ్యక్తిగత ద్వేషాలతో విమర్శలకు దిగుతున్నారు. వీటిని భావితరాల విద్యార్థులు గమనిస్తున్నారని అనుకోవడం లేదు. రాజకీయ విలువలను కాపాడేందుకు ఆయా పార్టీ లీడర్స్ తమ తమ అభ్యర్థులకు దిశా నిర్దేశం చేయాలి. భావితరాల వారికి 'రాజకీయ విలువలు ఆచరించే గురువులుగా మారాలి'. విలువల నిలయాలుగా విద్యాలయాలు, కుటుంబాలు విలసిల్లితే భావిపౌరులు ఆణిముత్యాల్లా తయారవుతారు. అప్పుడు దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తొలగిపోతాయి.

వ్యాసకర్త ఉపాధ్యాయులు
(నేడు పాఠశాలలు తెరుస్తున్న సందర్భంగా)

నీకు నీవే!

'ఎవరికెవరు ఈ లోకంలో' అన్న సినీకవి మాటలు నిజం. 'నీకు నీవే' దిక్కు అన్నది నిజం. ఒకసారి తీవ్రమైన నిరాశా నిస్పృహలతో ఉన్న భక్తుడు తను ఎంతగానో ఆరాధించే గురూజీ దగ్గరకు వెళ్లి... 'స్వామీ నాకు ఏదైనా తాయెత్తు ఇవ్వండి' అని అడిగాడు. స్వామీజీ ఓ రాగి రేకు ఇచ్చాడు. ఇది నీ ఇంట్లో ఉంచుకుంటే శుభం కలుగుతుందని చెప్పాడు. భక్తుడు తన సమస్యలకు పరిష్కారం తాయెత్తు వలన కలిగిందని కొన్నాళ్ల తర్వాత గురూజీని కలిసి చెప్పాడు. అందుకు గురువుగారు 'కాదు సమస్యలకు పరిష్కారం కనుగొన్నది నీవు. కేవలం నీకు నీపైన విశ్వాసాన్ని మాత్రమే నేను కలిగించాను. తాయెత్తు అనేది అందుకు ఓ మార్గం' అన్నారు.

'మిత్రమా! దేనికోసం విలపిస్తున్నావు? సర్వ శక్తులూ నీలో ఉన్నాయి. ఆదిశంకరాచార్యుల వారు శ్రద్ధను 'ఆస్తిక్య బుద్ధి' అన్నారు. అంటే ఉన్నది అనే నిశ్చయ భావన. శ్రద్ధ ఉన్నత లక్ష్యాల దిశగా మనిషిని ప్రయాణింపజేస్తుంది. 'స్వావలంబన' దిశగా ప్రతీ వ్యక్తీ ప్రయత్నం చేయాలి. ఆలోచించే శక్తి లేని పశుపక్ష్యాదులు సహితం తమకు తామే స్వయంగా నిర్ణయించుకుంటాయి. మరి ఎంతో జ్ఞాన సంపద కలిగిన మనిషి? పరావలంబనం ఒక బలహీనత. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనగలిగే ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం మనిషిని ఉన్నతుణ్ణి చేస్తాయి.



భగవద్గీత 'ఎవరి శ్రద్ధ ఎటువంటిదో వారు అటువంటివారు' (యోయత్ శ్రద్ధస్స ఏవసః) అని బోధిస్తుంది. శ్రద్ధ 'నిన్ను నీవు' తెలుసుకొనే ఓ గణిత సూత్రం. పులి ఎదురుగా వస్తే 'తనని తాను రక్షించుకునే మార్గం' వెతుకుతాడు. అతి విశ్వాసం ఉంటే ఎదురెళ్లి ప్రాణాలు కోల్పోతాడు. శక్తిని సరిగ్గా అంచనా వేసుకోగలిగిన వాడే విజేత.

– భమిడిపాటి గౌరీశంకర్

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.నవమి ప.1.33 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర సా.4.55 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** తె.4.26 నుండి 5.58 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.27 నుండి 1.18 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.55 వరకు, **అమృతఘడియలు:** ప.12.23 నుండి 1.54 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.30.

క్లుప్తంగా...

అనాథ పసివాళ్లకు ఆలంబన

● స్పందించిన సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్

సాక్షి ఎఫెక్ట్

అన్నపురెడ్డిపల్లి: ఈనెల 8న సాక్షి ప్రధాన సంచికలో ప్రచురితమైన 'పాపం పసివాళ్లు' కథనానికి సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ స్పందించారు. పిల్లల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారులను ఆదివారం ఆమె ట్విట్టర్ ద్వారా ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం జానకిపురం గ్రామానికి చెందిన కోలా వెంకటేశ్వరరావు, అఖిల దంపతులు ఈ నెల 6, 7 తేదీల్లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో వారి ఇద్దరు పసి పిల్లలు అనాథలుగా మారారు. దీనిపై గత గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.

కావాలనే దుష్ప్రచారం

● అప్సర తల్లి అరుణ ఆవేదన

హుడా కాంప్లెక్స్ (హైదరాబాద్): 'అల్లారు ముద్దుగా పెంచుకున్న నా కూతురు చనిపోయింది. ఆ బాధలో నుంచి ఇప్పటికీ మా కుటుంబం బయటికి రాలేదు. హంతకుడు సాయికృష్ణ కుటుంబ సభ్యులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు. నా కూతురు ఆత్మశాంతికి భంగం కలిగిస్తున్నారు' అంటూ మృతురాలు అప్సర తల్లి అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. కూతురు చనిపోయిన బాధలో తాము ఉంటే.. తమ పరువును బజారుకీడ్చే పనులు చేయడమేంటని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నెల 3న సాయికృష్ణ చేతిలో హత్యకు గురైన అప్సరకు గతంలోనే వేరే వ్యక్తితో వివాహమైనట్లు ఫొటోలు, వీడియోలు ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. విషయం తెలిసి అప్సర తల్లి కన్నీరుమున్నీరుగా విలపించారు. సంబంధం లేని ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేయించి తమ కుమార్తెను తప్పుబట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సాయికృష్ణను శిక్షించాల్సింది పోయి తన కుమార్తెనే తప్పు పడతారా అని అన్నారు. ఇదిలాఉండగా అప్సర మొదటి భర్త వివాహమైన కొంత కాలానికే ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కౌలు రైతు కుటుంబాలకు బాసట



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయంలో తీరని నష్టం వాటిల్లడంతో ఆత్మహత్యకు పాల్పడ్డ రైతు కుటుంబాలకు రైతు స్వరాజ్య వేదిక, మన భూమి ఫౌండేషన్, సహస్ర ఫౌండేషన్ చేయూతనిచ్చాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన కౌలు రైతు కుటుంబాల మహిళల జీవనోపాధికి ఒక్కొక్కరికి రూ.40 వేలు అందించారు. తార్నాకలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబాల మహిళలు ఉమలత, అరుణ, మానస, సుమలతలకు చెక్కులను అందజేశారు. ఈ డబ్బుతో చిన్న తరహా వ్యాపారాలను ప్రారంభిస్తామని ఆ మహిళలు తెలిపారు. రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు కిరణ్ విస్సా మాట్లాడుతూ... పంట నష్టంతో పాటు రైతు బంధు పథకం అమలులోనూ కౌలు రైతులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలకు పరిష్కారాలను అందించినప్పుడే ఆత్మహత్యలు తగ్గుతాయన్నారు.

జూలై 9న బీసీ ప్లీనరీ



జాజుల

భానుపురి (సూర్యాపేట): వచ్చే నెల 9వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో నిర్వహించనున్న బీసీ ప్లీనరీని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆయన ఆదివారం సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. జనాభాలో 65 శాతం ఉన్న బీసీ ఓట్లకు గాలం వేయడానికి ప్రధాన రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, రానున్న ఎన్నికల్లో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పంటలు పండక.. అప్పులు తీరక..

కొండగట్టు (చొప్పదండి): పంటలు పండక.. అప్పులు తీరక.. మనస్తాపంతో ఒక రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన ద్యాగల బాపు (57) 4ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటున్నాడు. పంటలకు నీళ్లు సరిగ్గా అందకపోవడంతో కొద్ది నెలల క్రితం రెండు బోర్లు వేయించాడు. అదే సమయంలో కూతురు వివాహం జరిపించాడు. దీంతో సుమారు రూ.7 లక్షల వరకు అప్పులు చేశాడు. బోర్లు వేసినా పంటలకు సరిపడా నీరు అందకపోవడం, ఇటీవల కురిసిన వడగళ్ల వానతో పంట పూర్తిగా తుడిచి పెట్టుకుపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. అప్పులు తీర్చే దారి కనిపించకపోవడంతో మనస్తాపానికి గురైన బాపు.. ఆదివారం ఉదయం తన పొలంలోని చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుని భార్య రాజమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నల్లగొండ జిల్లాకు చుక్కనీరు తెచ్చారా?

కాంగ్రెస్ ప్రజల పార్టీ.. బీఆర్ఎస్ దొరల పార్టీ ● కొండమల్లేపల్లి కార్నర్ మీటింగ్‌లో భట్టి విక్రమార్క

కొండమల్లేపల్లి: 'తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు దేని కోసం.. నల్లగొండ జిల్లాకు చుక్క నీరు తెచ్చారా.. లేదా పెద్ద ప్రాజెక్టు కట్టారా' అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదివారం నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి మండలంలో కొనసాగింది. సాయంత్రం కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. నల్లగొండ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు తొమ్మిదేళ్లుగా రూ.వెయ్యి కోట్లు తీసుకురాని దుర్మార్గులు ఈ బీఆర్ఎస్ పాలకులని విమర్శించారు. ఆనాడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు తీసుకున్న మరుసటి రోజే ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం దగ్గరికి వెళ్లి సమీక్షలు చేసి 70 శాతం వరకు పనులు పూర్తి చేయించారని.. మంత్రి అంటే పని చేయించే కోమటిరెడ్డిలా ఉండాలని వ్యాఖ్యానించారు. జగదీశ్‌రెడ్డి ఒక్కరోజు కూడా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు వెళ్లలేదని, సమీక్షలు చేయకుండా దిష్టిబొమ్మగా ఉన్నారని విమర్శించారు.

భట్టిని విమర్శించే స్థాయి మంత్రి జగదీశ్‌రెడ్డికి లేదు..

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు కోట్ల ప్రజల కోసం భట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తుంటే స్వార్థం కోసం పాదయాత్ర చేస్తున్నాడని జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. భట్టి విక్రమార్కను విమర్శించే స్థాయి జిల్లా మంత్రికి లేదన్నారు. నల్లగొండలో ప్రియాంకగాంధీతో సభ పెట్టాలనుకుంటున్నట్లు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడవెల్లిలో పైలాన్ ఆవిష్కరణ

భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చేరుకోవడంతో ఆదివారం వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి గ్రామంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను భట్టి విక్రమార్క ఆవిష్కరించారు.. కాగా భట్టి పాదయాత్ర వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకోవడంతో ఆయనను కలుసుకునేందుకు భార్య నందిని, కుమారుడు సిద్ధు ఇక్కడికి వచ్చారు.



భట్టితో కలసి పాదయాత్రలో పాల్గొన్న కోమటిరెడ్డి

మోదీది దేశభక్తి.. కేసీఆర్‌ది కుటుంబ భక్తి

కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్

వేములవాడ: మోదీది దేశభక్తి.. కేసీఆర్‌ది కుటుంబ భక్తి అంటూ కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ వ్యాఖ్యానించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఆదివారం నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల పేరిట ఏర్పడిన తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అన్నింటికీ తిలోదకాలిచ్చిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పలువురు మంత్రులపై అవినీతి ఆరోపణలున్నాయని, కానీ మోదీ మంత్రివర్గంలో ఏ ఒక్కరిపై ఆరోపణలు లేవని అన్నారు.

దోచుకోవడమే బీఆర్ఎస్ సిద్ధాంతం: సంజయ్

దోచుకోవడం.. దాచుకోవడమే బీఆర్ఎస్ సిద్ధాంతమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. బీజేపీని నేరుగా ఎదుర్కొనే శక్తిలేకనే బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌తో కలసి పోటీ చేయబోతోందన్నారు. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు కరువయ్యారని ఎద్దేవా చేశారు. బీజేపీ సింగిల్‌గానే పోటీ చేసి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తొమ్మిదేళ్ల మోదీ ప్రభుత్వంలో తెలంగాణకు అనేక నిధులు వచ్చాయన్నారు. పార్టీ నేతలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, ప్రతాప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రకాశ్ జవదేకర్. చిత్రంలో బండి సంజయ్ తదితరులు

పెద్దల ముందే నరికి చంపాడు..

● ఆస్తి కోసం వదినను దారుణంగా హత్య చేసిన మరిది
● హనుమకొండ జిల్లాలో ఘటన

ఎల్కతుర్తి: తోడబుట్టిన అన్న ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఆస్తిని వదిన తీసుకుంటే తనకు ఏమీ దక్కదని కక్ష పెంచుకున్న మరిది.. పంచాయితీ పెద్దమనుషుల సమక్షంలోనే ఆమెపై కత్తితో దాడి చేసి దారుణంగా హత్యచేశాడు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. సీఐ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం.. ముల్కనూర్‌కు చెందిన పురాణం స్వరూప (35) భర్త జంపయ్య గత ఫిబ్రవరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆస్తి విషయంలో భర్త తమ్ముడు సమ్మయ్యతో గొడవలు జరుగుతున్నాయి. ఆస్తిలో వాటాల విషయమై మాట్లాడటానికి స్వరూప తన తమ్ముడు మొటం గురువయ్య, అతడి భార్య తిరుపతమ్మతో కలసి ఆదివారం పెద్దమనుషుల సమక్షంలో కూర్చుని మరిది సమ్మయ్యను పిలిపించింది. ఇరుపక్షాల మధ్య చర్చలు జరుగుతుండగానే సమ్మయ్య వెంట తెచ్చుకున్న కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో వదిన స్వరూపపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. పెద్దమనుషులు ఆపే ప్రయత్నంచేసినా వినకుండా స్వరూప మెడ, ఇతర శరీర భాగాలపై నరకడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో అక్కడున్నవారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెళ్లికి నిరాకరించిన ప్రియుడు.. వెలకట్టడానికి సిద్ధమైన పెద్దలు

మనస్తాపంతో ఉరివేసుకుని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

● యువకుడి ఇంటి ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన



భవ్య (ఫైల్)

కురవి: ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించడం.. గ్రామంలో పెద్దలు పంచాయితీ నిర్వహించి వెలకట్టేందుకు సిద్ధమవడంతో మనస్తాపానికి గురైన బీటెక్ విద్యార్థిని సాతర్ల భవ్య(19) ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. నేరడకు చెందిన సాతర్ల ఉమ– వీరన్న దంపతుల కుమార్తె భవ్య(19) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇంటి ఎదురుగా ఉన్న రుద్రారపు శ్రీనివాస్, సుభద్ర దంపతుల కుమారుడు వినయ్‌తో కొన్ని ఏళ్లుగా ప్రేమ వ్యవహారం కొనసాగుతోంది. ఇద్దరూ ప్రేమ పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. అయితే ఒక్కసారిగా ప్రియుడు మోసం చేయడంతో భవ్య తల్లిదండ్రులకు చెప్పింది. ప్రేమ విషయమై కొందరు పెద్దమనుషులు అమ్మాయిని నేరడకు రమ్మని కబురు పంపగా గ్రామానికి చేరుకుంది. ఆదివారం ఓ మామిడితోటలో పంచాయితీ నిర్వహించారు. ప్రియుడికి దండగ(వెల) వేసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న భవ్య మనస్తాపానికి గురై రాత్రి ఇంట్లోని బాత్‌రూంలో ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించే సరికి చనిపోయింది. మృతదేహాన్ని ప్రియుడి ఇంటి ఎదుట ఉంచి కుటుంబసభ్యులు ఆందోళన చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

కళ్లలో పొడిచి.. కత్తితో కోసి..

▶ మొదటి పేజీ తరువాయి

కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు శ్రీలత వివాహం కాగా మిగిలిన ముగ్గురూ చదువుకుంటున్నారు. మూడో సంతానమైన శిరీష (19) పారామెడికల్ చదువుతూ వికారాబాద్‌లోని శ్రీశారద ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. యాదమ్మకు ఇటీవల గుండె ఆపరేషన్ కావడంతో నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. శనివారం రాత్రి శిరీష తమ్ముడు శ్రీను.. అక్క భర్త అయిన అనిల్‌కు ఫోన్ చేసి చిన్నక్క అన్నం వండలేదని చెప్పాడు. దీంతో తన స్వగ్రామమైన పరిగి నుంచి కాళ్లాపూర్ వచ్చిన అనిల్ మరదలు శిరీషను మందలించాడు. ఈ సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరగగా శిరీషను అనిల్ కొట్టాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి రాత్రి 10:30కు ఇంటినుంచి బయటకు వెళ్లిపోయింది. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని మైసమ్మగుడి వద్ద ఉన్న కుంటలో శిరీష మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ వెంకటరామయ్య, ఎస్ఐ విఠల్‌రెడ్డి నేతృత్వంలో మృతదేహాన్ని కుంట నుంచి బయటకు తీసి, పోస్టుమార్టం కోసం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతురాలి అన్న శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన శిరీషను అనిల్ బైక్‌పై తీసుకెళ్తుండగా తాము చూశామని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అనిల్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతన్ని విచారిస్తున్నారు. శిరీష తండ్రి, తమ్ముడిని కూడా విచారిస్తున్నారు. కాగా శిరీష ఇంట్లో లేదని తెలిసిన తర్వాతే తాను కాళ్లాపూర్ వచ్చానని అనిల్ చెప్పినట్లు సమాచారం. కానీ అనిల్ కొట్టడంతోనే ఆమె ఇంటినుంచి బయటికి వెళ్లిందని కుటుంబసభ్యులు చెబుతున్నారు. దీంతో పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు. శిరీష ఫోన్‌ను స్వాధీనం చేసుకుని వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. శిరీషను చంపిన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ములుగు జెడ్పీ చైర్మన్ జగదీశ్వర్ హఠాన్మరణం

● గుండెపోటుతో హనుమకొండలోని ఆస్పత్రిలో మృతి
● సీఎం కేసీఆర్, మంత్రుల సంతాపం

సాక్షి ప్రతినిధి, వరంగల్/ములుగు, సాక్షి, హైదరాబాద్: ములుగు జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుసుమ జగదీశ్వర్ (47) గుండెపోటుతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. ఆదివారం ఉదయం 8.45 గంటలకు జగదీశ్వర్‌కు తన నివాసంలో గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక లైఫ్‌లైన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం అజార ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చేరిన కొద్దిసేపటికే చికిత్స పొందుతూ ఉదయం 11.08 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జగదీశ్వర్ మృతి వార్త తెలియగానే పలువురు ప్రజాప్రతినిధులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలకు సీఎం ఆదేశం

పార్టీ వర్గాల ద్వారా సమాచారం అందుకున్న సీఎం కేసీఆర్.. ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్.. మంత్రి దయాకర్‌రావుతో వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడి జగదీశ్వర్ మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. జగదీశ్వర్‌కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు.

వెంటాడిన గుండెపోటు..

జగదీశ్వర్‌ను రెండున్నర నెలల్లో రెండోసారి గుండెపోటు వెంటాడింది. హనుమకొండ స్నేహనగర్‌లోని తన స్వగృహంలో ఉన్న సమయంలో మొదట ఏప్రిల్ 1న గుండెపోటు రావడంతో అతడి భార్య రమాదేవి సీపీఆర్ చేశారు. స్పృహలోకి రాగానే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సరైన సమయంలో సీపీఆర్ చేయడం వల్ల అప్పుడు ప్రాణాపాయం తప్పినా సరిగ్గా 71 రోజుల తర్వాత మరోసారి గుండెపోటుకు గురైన జగదీశ్వర్ చివరకు ప్రాణాలు విడిచారు.

వివాద రహిత నేతగా..

తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన జగదీశ్వర్.. కేసీఆర్, కేటీఆర్‌లతో సన్నిహితంగా ఉండేవారు. ఏటూరునాగారం మండలం నుంచి 2019లో జరిగిన ఎన్నికల్లో జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. అధిష్టానం ఆదేశాల మేరకు ములుగు జెడ్పీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయన.. వివాదరహిత, మచ్చలేని నేతగా అందరి మన్ననలు పొందారు. ఆయన అకాలమరణాన్ని జీర్ణించుకోలేని నాయకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. జగదీశ్వర్ అకాల మరణంపై మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు సోమవారం ములుగు జిల్లా మల్లంపల్లిలో జరగనున్నాయి.



జగదీశ్వర్ పార్థివ దేహం వద్ద కన్నీటి పర్యంతమవుతున్న మంత్రి సత్యవతి రాథోడ్. (ఇన్‌సెట్‌లో) జగదీశ్వర్(ఫైల్)

ఉద్యమంలో చురుకైన పాత్ర

ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. శోక తప్తులైన వారి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నా. తెలంగాణ ఉద్యమకారుడిగా నాటి ఉద్యమంలో జగదీశ్వర్ చురుకైన పాత్ర పోషించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటాం. ఆదుకుంటాం.

– సీఎం కేసీఆర్

చాలా బాధాకరం

ఈ మధ్యనే నేను ములుగు జిల్లాలో పర్యటించినప్పుడు అత్యంత చురుకుగా పార్టీ కార్యక్రమాలలో పాల్గొన్న జగదీష్.. ఆకస్మికంగా మరణించడం తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీ కుటుంబానికి, జిల్లాకి తీరని లోటు.

– మంత్రి కేటీఆర్



ఏటా పెరిగిపోతున్న ఫిర్యాదుల సంఖ్య

● ఈ ఏడాదిలో ఏప్రిల్ వరకే 162 ఫిర్యాదులు
● బాధితులకు మహిళా భద్రత విభాగం బాసట

సామాజికంగా ఎన్ని మార్పులు చేసుకుంటున్నా.. గృహ హింసలో మాత్రం తగ్గుదల ఉండడం లేదు. అదనపు కట్నం కోసం వేధింపులు, తాగుబోతు భర్తలు, అత్తింటి వారి వేధింపులకు గురయ్యే మహిళల సంఖ్య అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ఏటా పెరుగుతున్న గృహ హింస సంబంధిత ఫిర్యాదుల సంఖ్యే ఇందుకు నిదర్శనం. అయితే గతంలో మాదిరిగా ఇంటి పరువు, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు వస్తాయోనన్న భయాన్ని గృహిణులు వీడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

– సాక్షి, హైదరాబాద్

▶ ఫిర్యాదుదారులకు కౌన్సెలింగ్

గత ఐదేళ్లలో నమోదైన గృహ హింస ఫిర్యాదులను పరిశీలిస్తే.. 2019లో రాష్ట్రవ్యాప్తంగా 43 ఫిర్యాదుల నమోదైతే..ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 162 మంది మహిళలు గృహ హింసకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుల్లో కొందరు నేరుగా మహిళా భద్రత విభాగానికి, పోలీస్ స్టేషన్లకు వచ్చి ఫిర్యాదు ఇవ్వగా, మరికొందరు మహిళా భద్రత విభాగం వాట్సాప్ నంబర్‌కు, ఈ–మెయిల్ ద్వారా, ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. తెలంగాణ పోలీస్ శాఖలో ప్రత్యేకించి మహిళా భద్రత కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు, షీటీమ్స్, ఇతర చర్యలతో మహిళల్లో పోలీసులపై భరోసా పెరగడం వల్ల కూడా వారు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు ఇస్తున్నారని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. గృహ హింస ఫిర్యాదులు పెరగడానికి, మహిళల్లో పెరిగిన అవగాహన, భరోసాయే కారణమని పేర్కొన్నారు. మహిళా భద్రత విభాగానికి వచ్చే గృహ హింస ఫిర్యాదులపై సఖి, భరోసా సెంటర్ల ద్వారా, అవి అందుబాటులోని లేని ప్రాంతాల్లో పోలీస్ స్టేషన్లలో ప్రైవేటు కౌన్సిలర్ల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. సమస్య తీవ్రతను బట్టి ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఫిర్యాదుల్లో కొన్నిటిని కుటుంబీకుల మధ్య సయోధ్య కుదుర్చడం ద్వారా పరిష్కరిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

మహిళా భద్రత విభాగం సమాచారం ప్రకారం.. గృహ హింస ఫిర్యాదుల నమోదు ఇలా..

ఏడాది	మొత్తం ఫిర్యాదులు	అనర్హం	వివరాలు కోరినవి	ఎఫ్ఐఆర్ నమోదు	కౌన్సెలింగ్‌తో రాజీ	పరిష్కారం	పెండింగ్
2019	43	--	--	17	22	04	--
2020	61	--	--	22	26	13	--
2021	275	72	09	47	71	23	53
2022	313	69	29	69	80	29	37
2023	162	34	22	26	20	02	58

(ఏప్రిల్ 30 నాటికి)

భక్తులతో పోటెత్తిన యాదాద్రి

యాదగిరిగుట్ట: వేసవి సెలవులకు చివరి ఆదివారం కావడంతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం భక్తుల రద్దీతో పోటెత్తింది. శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల వంటి ప్రాంతాలు జనంతో కిక్కిరిసి కనిపించాయి. ధర్మదర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. శ్రీస్వామి వారిని 35వేలమందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి రూ.57,94,991 నిత్య ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

ఎవరెస్ట్.. యమ డేంజర్!

మంచులో కూరుకుపోతున్న పర్వతారోహకులు • విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్న నేపాల్ ప్రభుత్వం • ఈ ఏడాది 12 మంది మృతి, ఏడుగురు గల్లంతు

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వత శిఖరం మౌంట్ ఎవరెస్ట్. ఆకాశానికి నిచ్చెన వేసినట్టుగా వెండి కొండలా ధగధగలాడిపోతూ మంచుతో నిండిపోయిన ఈ పర్వత శిఖరం చేరుకోవడమంటే ప్రపంచాన్ని తమ పాదాక్రాంతం చేసుకోవడమే. అందుకే ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉన్నా, ప్రాణాలతో తిరిగి వస్తామన్న భరోసా లేకపోయినా ప్రతీ ఏడాది ఎందరో సాహసికులు ఈ పర్వత శిఖరాన్ని చేరుకోవాలని తమ దేశ జెండాని పాతాలని ఆరాటపడుతుంటారు. మౌంట్ ఎవరెస్ట్‌ను తొలిసారి ఎక్కడం ప్రారంభించి 70 ఏళ్లయింది. 1953 సంవత్సరం మే 29న న్యూజిలాండ్‌కు చెందిన ఎడ్మండ్ హిల్లరీ భారత్‌కు చెందిన టెన్జింగ్ నార్గేలు ఎవరెస్ట్ శిఖరాగ్రం చేరుకున్నారు. ఈ 70 ఏళ్లలో కనీవినీ ఎరుగని మార్పులు వచ్చాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరిగి, ఆధునిక సదుపాయాలు చోటు చేసుకోవడంతో ఎవరెస్ట్ అధిరోహించే వారి సంఖ్య భారీగా పెరిగింది.

ఎవరెస్ట్‌పై ట్రాఫిక్ జామ్

పర్వతారోహకులకు ఈ ఏడాది నేపాల్ ప్రభుత్వం విచ్చలవిడిగా అనుమతులు మంజూరు జారీ చేయడంతో ఎవరెస్ట్ అధిరోహణ మరింత ప్రమాదకరంగా మారింది. అసాధారణ రీతిలో 900 మంది పర్వతారోహకులకు అనుమతులు మంజూరు చేసింది. దీంతో కొండపై భారీగా ట్రాఫిక్ జామ్‌లు కనిపించాయి. శిఖరాగ్రం చేరుకోవాలంటే 26 వేల అడుగులు పైకి వెళ్లాలి. పది వేల అడుగులు దాటితే ఇంక మృత్యువు ముఖంలోకి అడుగు పెట్టినట్టే. అంత ఎత్తులో ఆక్సిజన్ సరిగా అందదు. ఊపిరి పీల్చుకోవడమే కష్టంగా మారుతుంది. రక్తం గడ్డ కట్టేలా వాతావరణం మైనస్ 20 డిగ్రీలకు పడిపోతుంది. శారీరకంగా ఎంత ఫిట్‌నెస్ ఉన్నప్పటికీ అనారోగ్య సమస్యలు చుట్టుముట్టి ప్రాణాలు పోతాయి. సముద్ర మట్టానికి అంత ఎత్తుకు చేరుకుంటే ఒక్కోసారి మెదడు, ఊపిరితిత్తులకు వాపు వచ్చి శరీరంపై స్వాధీనం కోల్పోతారు. ఈ సారి ఏకంగా 12 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఏడుగురు మంచులో గల్లంతయ్యారు. ఇటీవల ఈ స్థాయిలో మరణాలు ఎప్పుడూ సంభవించలేదు. ''ఒకేసారి పర్వతారోహకులు కొండ ఎక్కుతూ ఉంటే వారికి ఆక్సిజన్ అవసరం ఎక్కువగా ఉంటుంది. దానికి తగ్గట్టుగా ఆక్సిజన్ ఏర్పాటు చేయడం అత్యంత ముఖ్యం. మా ద్వారా ఎవరెస్ట్ అధిరోహించే పర్వతారోహకులెవరూ ఇప్పటివరకు ఏ సమస్య ఎదుర్కోలేదు''అని ఆ్రస్టియాకు చెందిన లుకాస్ ఫర్టెన్‌బాచ్ అనే కంపెనీ ప్రతినిధి వెల్లడించారు. ఈ ఏడాది తమ సంస్థ తరఫున 100 మంది దిగ్విజయంగా ఎవరెస్ట్ ఎక్కి వచ్చారని చెప్పారు.

వాతావరణ మార్పులతో పెరుగుతున్న ముప్పు

ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులు ఎవరెస్ట్ అధిరోహకులకు అతి పెద్ద ప్రతిబంధకంగా మారుతోంది. 1979 నుంచి చూస్తే గత 40 ఏళ్లలో ఎవరెస్ట్‌పై ఉష్ణోగ్రతలు సగటున 2 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగాయి. దీంతో హిమానీనదాలు కరిగి మంచు చరియలు విరిగి పడటం వంటి ప్రమాదాలు ముంచుకొస్తాయి. కొన్నేళ్లుగా ఎవరెస్ట్ అధిరోహించే వారు ఈ మార్పుల ప్రభావం విపరీతంగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో పదేళ్లలో ఎవరెస్ట్ ఎక్కే మార్గం ఎలా మారుతుందో ఊహకి కూడా అందడం లేదని నేపాల్ మౌంటనీరింగ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆంగ్ షెరింగ్ పేర్కొన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్


ఎవరెస్ట్ ఎక్కే మార్గంలో పర్వతారోహకుల క్యూ

ఆదాయానికి ఆశపడి..?

నేపాల్‌కు పర్యాటకమే ప్రధాన ఆధారం. ఎవరెస్ట్ అధిరోహణ నుంచే అధికంగా ఆదాయం సమకూరుతుంది. పశ్చిమ దేశాల నుంచి వచ్చే పర్వతారోహకుల నుంచి11 వేల డాలర్లు (రూ.9 లక్షలు) చొప్పున వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. అదే కాకుండా వెంట తీసుకు వెళ్లే ఆక్సిజన్, ఆహారం, గైడ్‌ల కోసం మొత్తంగా ఒక్కొక్కరికి 27 వేల డాలర్లు (దాదాపుగా రూ.22 లక్షలు) ఖర్చు అవుతుంది. అయితే నేపాల్ ప్రభుత్వం ఆదాయానికి ఆశపడే అనుమతులు ఎక్కువగా ఇస్తున్నామన్న ఆరోపణల్ని తోసిపుచ్చింది. ప్రతీ పర్వతారోహకుడి ప్రాణ రక్షణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, బేస్ క్యాంప్‌లో వైద్యులు, అధికారుల బృందం ఈ సాహస యాత్రను పర్యవేక్షిస్తుందని స్పష్టం చేసింది.

ఏదైనా సాధ్యమే

ప్రపంచంలో ఎవరెస్ట్ మ్యాన్‌గా పేరు పొందిన నేపాల్‌కు చెందిన షెర్పా కామి రిటా 28 సార్లు ఎవరెస్ట్ ఎక్కిన వ్యక్తిగా నిలిచి తన రికార్డు తానే బద్దలు కొట్టాడు. ఈ ఏడాది వారం రోజుల తేడాలో రెండు సార్లు శిఖరాగ్రానికి చేరుకున్నాడు. తన రికార్డుని పసాంగ్ దావా అనే షెర్పా సమం చేయడంతో ఆ మరుసటి రోజే మళ్లీ ఎక్కి అత్యధికసార్లు ఎవరెస్ట్‌ని ఎక్కిన వ్యక్తిగా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. ఇక బ్రిటన్‌కు చెందిన మాజీ సైనికుడు హరి బుధా మాగర్ కృత్రిమ కాలుతో ఎవరెస్ట్ ఎక్కిన వ్యక్తిగా అరుదైన ఘనత సాధించాడు. మనిషి తలచుకుంటే ఏదైనా సాధ్యమేనని నిరూపించాడు. ఒక మలేసియన్ పర్వతారోహకుడు అనారోగ్యం బారిన పడితే నేపాలీ గైడ్ గెల్జీ అతనిని మోసుకుంటూ కొండ దిగడం మరో అరుదైన ఫీట్‌గా నమోదైంది. ఎవరెస్ట్ శిఖరాగ్రానికి చేరితే ప్రపంచాన్నే జయించినంత ఆనందం వస్తుంది కాబట్టే ప్రాణాలకు తెగించి మరీ ఎవరెస్ట్ ఎక్కే వారి సంఖ్య ఏడాదికేడాది పెరుగుతోంది.

ఉగ్ర నెట్‌వర్క్‌లోకి చిన్నారులు, మహిళలు..!

ఐఎస్ఐ ప్రమాదకర పన్నాగాన్ని వెల్లడించిన ఆర్మీ



శ్రీనగర్: భారత్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్తాన్ నిఘా సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ) మరో ప్రమాదకర పన్నాగాన్ని అమలు చేస్తోంది.కశ్మీర్ లోయలో ఉగ్రవాదుల సంప్రదాయ సమాచార నెట్‌వర్క్‌ను సైన్యం దాదాపు నిర్వీర్యం చేసింది. దీంతో ఐఎస్ఐ మరో ప్రత్యామ్నాయాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం ఉగ్ర మూకల మధ్య సమాచార మార్పిడికి మహిళలు, బాలికలు, మైనర్లను పావులుగా వాడుకుంటోంది. ఇటీవలి కాలంలో ఇందుకు సంబంధించిన పలు ఆధారాలు తమకు దొరికాయని శ్రీనగర్ కేంద్రంగా పనిచేస్తున్న 15 కార్ప్స్ లెఫ్టినెంట్ జనరల్ అమన్‌దీప్ సింగ్ అవుజ్లా తెలిపారు. ముఖ్యంగా సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు, డ్రగ్స్, ఆయుధాల రవాణాకు మహిళలు, బాలికలు, మైనర్లను వాడుకోవడం అనే కొత్త ప్రమాదం వచ్చిపడిందన్నారు. ఉగ్రమూకలు సమాచార బట్వాడాకు ప్రస్తుతం సెల్‌ఫోన్ల వినియోగాన్ని గణనీయంగా తగ్గించాయని చెప్పారు. లోయలో ప్రశాంతతకు భగ్నం కలిగించేందుకు నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి ఉగ్రమూకలు వ్యూహాలు పన్నుతుండటంతో బలగాలు సమన్వయంతో పనిచేస్తూ అప్రమత్తంగా ఉన్నాయన్నారు. కశ్మీర్‌లో చొరబాట్లు తగ్గినట్లు కనిపిస్తున్నప్పటికీ, పీర్ పంజాల్ దక్షిణ ప్రాంతం, పంజాబ్‌ల్లో పెరిగాయన్నారు. ఉత్తర కశ్మీర్‌లోని మఛిల్‌లో ఇటీవలి చొరబాటు యత్నమే ఇందుకు తాజా ఉదాహరణ అని చెప్పారు. హింస పట్ల స్థానిక ప్రజల్లోనూ మార్పు కనిపిస్తుండటం ప్రశంసనీయమైన విషయమన్నారు. భద్రతా బలగాలకు కశ్మీర్ ప్రజలు సహకరిస్తున్నారని తెలిపారు.

క్లుప్తంగా...

గిన్నిస్ పెళ్లిళ్లు



జైపూర్: రాజస్తాన్ పెళ్లిళ్లలో రికార్డు సాధించింది. కేవలం 12 గంటల్లో 2 వేలకు పైగా జంటలకు ముడిపెట్టి గిన్నిస్ వరల్డ్ రికార్డులకెక్కింది. బారన్‌లో ఈ సామూహిక వివాహ కార్యక్రమం మే 26న జరిగినట్టుగా గిన్నిస్ వరల్డ్ బుక్ అధికారులు వెల్లడించారు. శ్రీ మహవీర్ గోశాల కళ్యాణ్ సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మెగా కార్యక్రమంలో హిందువులు, ముస్లిం జంటలు కూడా ఒక్కటయ్యారు. 2013లో 24 గంటల్లో 963 పెళ్లిళ్లు జరిపి యెమన్ పేరిట ఉన్న ఈ రికార్డుని బద్దలు కొడుతూ కేవలం 12 గంటల్లోనే 2,413 మంది జంటలకి వివాహం జరిపించారు. అప్పటికప్పుడు ఈ పెళ్లిళ్లను అధికారికంగా రిజిస్టర్ కూడా చేయించారు.

స్పేస్ ఎక్స్‌లో పద్నాలుగేళ్ల ఇంజనీర్

కాలిఫోర్నియా: ఎలన్ మస్క్‌కు చెందిన ప్రైవేటు అంతరిక్ష సంస్థ స్పేస్ ఎక్స్‌కి ఇకపై ఒక బుల్లి ఇంజనీర్ సేవలందించనున్నాడు. 14 ఏళ్ల వయసున్న కైరాన్ క్వాజి అనే ఇంజనీర్‌కి ఉద్యోగమిచ్చింది. స్పేస్ ఎక్స్ నిర్వహించిన సాంకేతిక పరీక్ష, ఇంటర్వ్యూల్లో క్వాజీ ఉత్తీర్ణుడు కావడంతో ఇంజనీర్‌గా నియమించినట్టు సంస్థ వెల్లడించింది. పదకొండేళ్లకే క్వాజీ ఇంజనీరింగ్‌లో చేరాడు. కంప్యూటర్ సైన్స్‌లో పట్టా తీసుకున్న క్వాజీకి వెంటనే స్పేస్ ఎక్స్‌లో ఉద్యోగం లభించింది. అంగారక గ్రహంపైకి మనుషుల్ని తీసుకువెళ్లే ప్రాజెక్టులో క్వాజీ ఉన్నాడు.



అవి 2జీ, 3జీ, 4జీ పార్టీలు

కాంగ్రెస్, డీఎంకేపై అమిత్ షా ఆగ్రహం

వెల్లూరు: కాంగ్రెస్, డీఎంకే పార్టీలు వారసత్వ రాజకీయాలు సాగిస్తున్నాయని హోం మంత్రి అమిత్ షా విరుచుకుపడ్డారు. అవి 2జీ, 3జీ, 4జీ పార్టీలని ఎద్దేవా చేశారు. తాను 2జీ స్పెక్ట్రం కుంభకోణంపై మాట్లాడడంలేదని, ఆయా పార్టీల్లో రెండు, మూడు, నాలుగో తరాల గురించి మాట్లాడుతున్నానని వివరించారు. ఆ పార్టీలు పూర్తిగా అవినీతిలో కూరుకుపోయాయని మండిపడ్డారు. మారన్ కుటుంబం రెండు తరాలుగా, కరుణానిధి కుటుంబం మూడు తరాలుగా, సోనియా గాంధీ కుటుంబం నాలుగు తరాలుగా అవినీతికి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. తమిళనాడులోని వెల్లూరులో ఆదివారం జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు.

క్యూబాలో చైనా గూఢచారులు

అమెరికా ఆరోపణలు

వాషింగ్టన్: కమ్యూనిస్ట్ చైనా తమ పొరుగు దేశం క్యూబాలో 2019 నుంచి గూఢచార స్థావరాన్ని నడుపుతోందని అమెరికా ఆరోపించింది. ప్రపంచవ్యాప్తంగా చైనా నిఘా సమాచార సేకరణ సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటున్న ప్రయత్నాల్లో ఇదో భాగమని పేర్కొంది. పేరు వెల్లడించటానికి ఇష్టపడని ఓ అధికారి ఈ మేరకు డ్రాగన్ దేశంపై ఆరోపణలు గుప్పించారు. క్యూబాలోని చైనా నిఘా కేంద్రంపై అమెరికా నిఘా సంస్థలు ఓ కన్నేసి ఉంచాయని ఆయన తెలిపారు. చైనా నిఘా కార్యకలాపాల విస్తరణ ప్రయత్నాలను అడ్డుకునే ప్రయత్నాలను బైడెన్ ప్రభుత్వం ముమ్మరం చేసిందన్నారు. దౌత్యపరమైన, ఇతర మార్గాల్లో చేపట్టిన ఈ ప్రయత్నాలు కొంత సఫలీకృతమయ్యాయని ఆయన అన్నారు. అమెరికాకు అత్యంత సమీపంలో ఉన్న క్యూబా గడ్డపై నుంచి చైనా గూఢచర్యం కొత్త విషయం కాదు, ఇది ఎప్పటి నుంచో జరుగుతున్నదేనని తమ నిఘా వర్గాలు అంటున్నాయని ఆ అధికారి ఉటంకించారు. అట్లాంటిక్ సముద్రం, లాటిన్ అమెరికా, మధ్యప్రాచ్యం, సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా, ఇండో–పసిఫిక్ ప్రాంతాల్లో నిఘా కేంద్రాల ఏర్పాటుకు చైనా యత్నిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే క్యూబాలోని నిఘా కేంద్రాన్ని 2019లో చైనా అప్‌గ్రేడ్ చేసిందని ఆ అధికారి వివరించారు. క్యూబాలో సిగ్నల్ ఇంటెలిజెన్స్ సేకరణ వ్యవస్థ ఏర్పాటుపై రెండు ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరినట్లు గురువారం వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో కథనం వచ్చింది. బదులుగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న క్యూబాకు భారీగా ముట్టజెప్పేందుకు చైనా సిద్ధమైందని కూడా అందులో పేర్కొంది. అయితే, వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనాన్ని క్యూబా డిప్యూటీ విదేశాంగ మంత్రి ఖండించారు.

ప్రజా విశ్వాసమే నా ఆస్తి



డిమాండ్లపై వెనక్కి తగ్గేదే లేదు • సచిన్ పైలట్ స్పష్టీకరణ

దౌసా: ప్రజలకు న్యాయం చేకూర్చాలన్నదే తన ధ్యేయమని, అందుకోసం పోరాటం కొనసాగిస్తానని రాజస్తాన్ కాంగ్రెస్ అసంతృప్త నాయకుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ వెల్లడించారు. తన డిమాండ్లపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. ప్రజా విశ్వాసమే తన ఆస్తి అని తేల్చిచెప్పారు. వసుంధర రాజే నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని సచిన్ పైలట్ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై అశోక్ గహ్లోత్ ప్రభుత్వం స్పందించడం లేదని ఆయన మండిపడుతున్నారు. ఈ రోజు కాకపోయినా రేపైనా న్యాయం జరిగి తీరుతుందని సచిన్ పైలట్ అన్నారు. పరీక్షల నిర్వహణలో విఫలమైన రాజస్తాన్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను పునర్వ్యవస్థీకరించాలని కోరారు. పేపర్ లీకుల వల్ల నష్టపోయిన అభ్యర్థులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. దౌసా పట్టణంలోని గుర్జర్ హాస్టల్‌లో తన తండ్రి, కేంద్ర మాజీ మంత్రి రాజేశ్ పైలట్ విగ్రహాన్ని సచిన్ పైలట్ ఆదివారం ఆవిష్కరించారు.

వ్యోమగాముల మెదడుకు ముప్పు!

- ఆరు నెలలకుపైగా అంతరిక్షంలో ఉంటే జఠరికల్లో మార్పులు
- ఉత్పన్నమవుతున్న మానసిక అనారోగ్య సమస్యలు
- అమెరికా సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి



అంతరిక్ష ప్రయోగాలంటే అందరికీ ఆసక్తే. అంతరిక్ష రహస్యాలను ఛేదించడానికి వ్యోమగాములు (ఆస్ట్రోనాట్స్) శ్రమిస్తుంటారు. ఇందుకోసం సుదీర్ఘకాలం గగనతలంలోనే ఉండాల్సి వస్తుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్), నాసా స్పేస్ షటిల్స్‌లో వ్యోమగాములు నెలల తరబడి గడపాల్సి ఉంటుంది. ప్రయోగాల్లో భాగంగా కొన్నిసార్లు సంవత్సరానికిపైగానే అంతరిక్షంలో ఉండిపోవాలి. భూమిపై గురుత్వాకర్షణ శక్తి ఉన్నట్లుగా అక్కడ ఎలాంటి గురుత్వాకర్షణ శక్తి ఉండదన్న సంగతి తెలిసిందే. మరి అలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఎక్కువ కాలం గడిపే వ్యోమగాముల శరీరంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయి? ప్రధానంగా మెదడులో జరిగే మార్పులేమిటి? దీనిపై అమెరికా సైంటిస్టులు అధ్యయనం చేశారు. ఆశ్చర్యకరమైన ఫలితాలు వెలువడ్డాయి. ఈ వివరాలను 'సైంటిఫిక్ రిపోర్ట్స్' జర్నల్‌లో ప్రచురించారు.

- అధ్యయనంలో భాగంగా 30 మంది ఆస్ట్రోనాట్స్ బ్రెయిన్ స్కానింగ్‌లను క్షుణ్నంగా పరిశీలించారు. అంతరిక్షంలోకి వెళ్లడానికి ముందు, వెళ్లివచ్చిన తర్వాత బ్రెయిన్ స్కానింగ్‌లను సేకరించి, పరిశీలించారు.
- 30 మందిలో 8 మంది రెండు వారాల పాటు అంతరిక్షంలో ఉన్నారు. 18 మంది ఆరు నెలలు, నలుగురు దాదాపు సంవత్సరంపాటు అంతరిక్షంలో ఉండి వచ్చారు.
- ఆరు నెలలకుపైగా అంతరిక్షంలో ఉన్న వ్యోమగాముల మెదడులోని జఠరికలు(వెంట్రికల్స్) కొంత వెడల్పుగా విస్తరించినట్లు గుర్తించారు. ఈ మార్పు చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉందంటున్నారు.
- మెదడులోని ఖాళీ భాగాలనే జఠరికలు అంటారు. ఇందులో సెరిబ్రోస్పైనల్ ద్రవం ఉంటుంది. వర్ణ రహితమైన ఈ ద్రవం మెదడుచుట్టూ నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. మెదడుకు రక్షణ కల్పిస్తుంది. వ్యర్థాలను తొలగిస్తుంది.
- జఠరికల విస్తరణ వల్ల మెదడులోని కణజాలం ఒత్తిడికి గురవుతున్నట్లు సైంటిస్టులు భావిస్తున్నారు. దీనిపై మరింత అధ్యయనం జరగాల్సి ఉందని చెబుతున్నారు. జఠరికల్లో మార్పుల కారణంగా ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్న దానిపై పరిశోధకులు దృష్టి పెట్టారు.
- అంతరిక్షంలో ఎంత ఎక్కువ కాలం ఉంటే అంత ఎక్కువగా జఠరికల్లో మార్పులు సంభవిస్తాయని, తద్వారా మెదడు పరిమాణం పెరిగి, మానసిక సమస్యలు ఉత్పన్నమవుతాయని గమనించినట్లు సైంటిస్టు రేచల్ సీడ్లర్ చెప్పారు. ఆరు నెలలకుపైగా ఉన్నవారికే ముప్పు ఉన్నట్లు తేలిందని అన్నారు. అంతరిక్షం నుంచి తిరిగి వచ్చాక మెదడు ఎప్పటిలాగే సాధారణ స్థితికి చేరుకోవడానికి 3 సంవత్సరాలు పడుతున్నట్లు వివరించారు.
- భూమిపై మనిషి శరీరంలో రక్తప్రసరణ ఒక క్రమపద్ధతిలో సాగుతుంది. నరాల్లో కవాటాలు(వాల్వులు) ఉంటాయి. గురుత్వాకర్షణ శక్తితో రక్తం పైనుంచి పాదాల్లోకి ప్రవహించి, అక్కడే స్థిరపడకుండా ఈ కవాటాలు అడ్డుకుంటాయి. గురుత్వాకర్షణ శక్తి లేని అంతరిక్షంలో ఇందుకు వ్యతిరేక దిశలో జరుగుతుంది. రక్తం, ఇతర ద్రవాలు నరాల గుండా తలలోకి చేరుకుంటాయి. తలపై ఒత్తిడిని కలుగజేస్తాయి. దీనివల్ల మెదడులో జఠరికలు విస్తరిస్తున్నట్లు, కపాలంలో మెదడు పరిమాణం పెరుగుతున్నట్లు సైంటిస్టులు అంచనా వేస్తున్నారు.
- ఆరు నెలల్లోగా అంతరిక్షం నుంచి తిరిగివచ్చేవారికి ప్రమాదం ఏమీ లేదని, వారి మెదడులో చెప్పుకోదగ్గ మార్పులేవీ కనిపించడం లేదని పరిశోధకులు చెబుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఈ ఓటమిని పట్టించుకోకండి..!

జపాన్ రాయబారికి ప్రధాని మోదీ సూచన



న్యూఢిల్లీ: భారత్‌లో జపాన్ రాయబారి హిరోషి సుజుకి దంపతులు పుణెలో భారతీయ వంటకాల రుచిని ఆస్వాదించారు. 'భారత్‌లో స్ట్రీట్‌ఫుడ్ అంటే నాకెంతో ఇష్టం. కానీ, కారం కాస్త తక్కువుంటే బాగుంటుంది'అంటూ ఆయన ట్వీట్ చేశారు. ఎక్కువ కారం ఉన్న వడాపావ్‌ను తన భార్య ఇష్టంగా లాగించేయగా, తాను తక్కువ ఘాటున్న వడాపావ్‌తో సరిపెట్టుకున్నట్లు తెలిపారు. భార్యతో కలిసి మిసాల్ పావ్ తింటున్నట్లున్న వీడియోను కూడా ఆయన పోస్ట్ చేశారు. 'నా భార్య నన్ను ఓడించింది'అంటూ మిరపకాయ ఇమోజీతో ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌ను ప్రధాని మోదీని ఆకర్షించింది. ఆయన రీ ట్వీట్ చేస్తూ..'ఈ పోటీలో మీరు ఓడిపోయిన విషయం పట్టించుకోకండి. భారతీయ వంటకాల్లో వైవిధ్యాన్ని ఈ విధంగా సృజనాత్మకతతో ప్రజెంట్ చేయడం బాగుంది. మీ నుంచి ఇలాంటి వీడియోలు మరిన్ని రావాలని కోరుకుంటున్నా'అని పేర్కొన్నారు.

కర్ణాటక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

అధికారికంగా ప్రారంభించిన సీఎం సిద్ధరామయ్య


శక్తిపథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్ధరామయ్య, డీకే శివకుమార్

సాక్షి, బెంగళూరు: రాష్ట్రంలోని మహిళలు, విద్యార్థినులు ప్రభుత్వ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించే శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రారంభించారు. శక్తి యోజనకు సంబంధించి 'మహిళా సాధికారిత ప్రయాణం' అనే నినాదంతో ఉన్న లోగో స్మార్ట్ కార్డును ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆదివారం విడుదల చేశారు. దీనికి సంబంధించిన స్టిక్కర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ తాము ఎన్నికల ముందు ఇచ్చిన ఐదు గ్యారెంటీ స్కీములను ఎంత కష్టం వచ్చినా అమలు చేసి తీరుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో 5 గ్యారెంటీ హామీ పథకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో మొట్టమొదటి పథకమే ఈ శక్తి. ఈ పథకంతో రోజుకి 41.8 లక్షల మందికి పైగా మహిళ ప్రయాణికులకు లబ్ధి చేకూరుతుంది. ఏడాదికి రాష్ట్ర ఖజానాకు రూ.4,052 కోట్లు ఖర్చు అవుతుందని ఒక అంచనా.

లవ్ జిహాద్‌కు మదర్సాలే కేంద్రాలు

సాధ్వి ప్రాచీ వివాదాస్పద వ్యాఖ్యలు

బరేలీ: 'లవ్ జిహాద్, ప్రపంచ కలహాలకు కేంద్రాలకు మారిన మదర్సాలను మూసివేయాలని వీహెచ్‌పీ నేత సాధ్వి ప్రాచి వ్యాఖ్యానించారు. 'హిందువులు డబ్బు సంపాదన గురించే ఆలోచిస్తారు. ఒక ప్రత్యేకవర్గం మాత్రం భారత్‌ను పాలించాలని ఆలోచిస్తుంటుంది. వెయ్యేళ్లు భారత్‌ను పాలించడమే వారి ఎజెండా'అని యూపీలోని బరేలీలో ఆదివారం ఆమె మీడియాతో అన్నారు. 'లవ్ జిహాద్ మదర్సాల నుంచే మొదలవుతోంది. అక్కణ్నుంచే వ్యాప్తి చెందుతుంది. దేశంలో మదర్సాలు మూసేసిన రోజున లవ్ జిహాద్ ఉనికిలోనే ఉండదు. అప్పుడు ఒక్క భారతదేశంలోనే కాదు, ప్రపంచం మొత్తంలో శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తాయి'అని ఆమె మీడియాతో అన్నారు.

ఆమె సేవ అనూహ్యం


శవాన్ని తరలిస్తూ..

లక్నో: ఈ ఫొటోలో మహిళ పేరు వర్ష వర్మ. వయసు 44 సంవత్సరాలు. ఉత్తరప్రదేశ్‌లో లక్నోకు చెందిన ఆమెలో సమాజానికి ఏదో ఒక విధంగా సేవ చేయాలనే తపన ఉంది. దీంతో అయిదేళ్లుగా ఎవరూ చేయలేని ఒక అనూహ్యమైన పనికి పూనుకున్నారు. ఏక్ కోశిష్ ఏసీ భీ అనే సంస్థను స్థాపించి మార్చురీల్లో గుర్తుపట్టని మృతదేహాలకు శాస్త్రోక్తంగా అంతిమ సంస్కారం జరిపిస్తున్నారు. దీనివల్ల మరణించిన వారిని గౌరవంగా పైలోకాలకు పంపిస్తున్నట్టుగా ఆమె భావిస్తున్నారు. 72 గంటల సేపు మృత దేహం కోసం కుటుంబ సభ్యులెవరూ రాకపోతే స్థానిక అధికారులు ఆమెకే చెబుతారు. ఇలా వారానికి సగటున మూడు మృతదేహాలకు వర్ష అంతిమ సంస్కారం నిర్వహిస్తున్నారు. ప్రపంచం నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన వారికి గౌరవప్రదంగా వీడ్కోలు పలకాలని వర్ష చెబుతున్నారు.

అతి తీవ్ర తుపానుగా బిపర్‌జోయ్

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: అరేబియా సముద్రంలో ఏర్పడిన తుపాను 'బిపర్‌జోయ్' ఆదివారం ఉదయానికి అతి తీవ్ర తుపానుగా మారిందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఇది ఈ నెల 15 నాటికి గుజరాత్‌లోని కచ్, పాకిస్తాన్‌లోని కరాచీల మధ్య తీరాన్ని తాకే అవకాశం ఉందని అంచనా వేసింది. తుపాను తీరాన్ని తాకే ప్రాంతంపై రానున్న రోజుల్లో స్పష్టత వస్తుందని వివరించింది. ఈ మేరకు గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్ తీరాలకు తుపాను హెచ్చరికలు జారీ చేసింది. దీని ప్రభావంతో కచ్, ద్వారక, పోరుబందర్, జామ్‌నగర్, రాజ్‌కోట్, జునాగఢ్, మోర్బిల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ నెల 13–15 తేదీల్లో తీరం వెంబడి గరిష్టంగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. తుపాను హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించింది. తుపాను షెల్టర్లను ఏర్పాటు చేసింది.

ఈ ఇంటర్నెట్ మాకొద్దు బాబోయ్..!


కనెకేస్ గ్రామంలో పనిలో నిమగ్నమైన బదూయి తెగ నేత కార్మికురాలు


కనెకేస్ గ్రామంలోని నది ఒడ్డున ఆడుకుంటున్న చిన్నారులు

ఇండోనేసియాలో నినదిస్తున్న బదూయి తెగ

జకార్తా: స్మార్ట్ ఫోన్‌లు, సోషల్ మీడియా లొచ్చాక ప్రపంచమే మారిపోయింది. ఎప్పుడు ఎవరిని చూసినా అన్ని పనులు మానేసి తమ ఫోన్‌ల్లో తలదూర్చి కాలం గడిపేస్తున్నారు. ఈ ఆన్‌లైన్ ప్రపంచం జనంపై చూపిస్తున్న వ్యతిరేక ప్రభావం నుంచి తమని తాము కాపాడుకోవడానికి ఇండోనేసియాలోని జావా దీవుల్లో నివసించే ఒక స్థానిక తెగ అసలు ఇంటర్నెట్ వద్దని నినదిస్తోంది. బాంటెన్ ప్రావిన్స్‌లో 26 వేల మంది వరకు ఉండే బదూయి అనే వర్గం ప్రజలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తమకి వద్దే వద్దని అంటున్నారు. ఈ తెగ ప్రజలు మొత్తం మూడు గ్రామాల్లో నివసిస్తారు. తమ ప్రాంతంలో ఉండే టెలికాం టవర్లను తొలగించాలని అప్పుడు సిగ్నల్స్ రాక తాము ఆన్‌లైన్ ఉచ్చులో ఇరుక్కోమని వారి వాదనగా ఉంది. ఈ మేరకు గ్రామ పెద్దలు ప్రభుత్వ అధికారులకు ఒక లేఖ కూడా రాశారు. స్మార్ట్ ఫోన్ వల్ల దుష్ప్రభావాలు తమ జీవితంపై లేకుండా ఉండడానికే తాము ఈ ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే యువత అందులో కూరుకుపోతారని, ఇది వారి నియమబద్ధమైన జీవితంపై ప్రభావం చూపిస్తుందని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆందోళనను గుర్తించిన లెబాక్ జిల్లా అధికారులు ఈ విషయాన్ని ఇండోనేసియా సమాచార శాఖ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజలు ఏం కోరుకుంటే అదే తాము ఇస్తామని, వారి సంప్రదాయాలు, స్థానికతను కాపాడడమే తన లక్ష్యమని ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు.

ఊరుకుంటే మిగతా రాష్ట్రాలకూ అదే గతి

- కేంద్రం ఆర్డినెన్స్‌పై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ హెచ్చరిక
- రామ్‌లీలా మైదానంలో 'ఆప్' మహా ర్యాలీ



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో పరిపాలనా సర్వీసులను నియంత్రిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత ఢిల్లీపై దాడి చేస్తున్నారని, ప్రజల హక్కులను లాక్కొనే ఈ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించపోతే ఇతర రాష్ట్రాలకు సైతం అదే గతి పడుతుందని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల్లోనూ అధికారాలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌లు తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఆప్' ఆధ్వర్యంలో నిర్వహించిన మహార్యాలీలో కేజ్రీవాల్ మాట్లాడారు. కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్ ఢిల్లీ ప్రజలను కించపర్చేలా ఉందని ఆరోపించారు. బీజేపీ నాయకులు తనను దూషించినా పట్టించుకోనని, ప్రజలను కించపరిస్తే మాత్రం సహించబోనని తేల్చిచెప్పారు. భారత రాజ్యాంగంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నమ్మకం లేదని కేజ్రీవాల్ విమర్శించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్‌లను అరెస్టు చేసినప్పటికీ ఢిల్లీలో అభివృద్ధి ఆగదని అన్నారు. తమకు 100 మంది సిసోడియాలు, 100 మంది జైన్‌లు ఉన్నారని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. మహార్యాలీలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్, 'ఆప్' సీనియర్ నేతలు, వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం, 12, జూన్, 2023

పలు రైళ్లు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: ఒడిశా రైలు ప్రమాద ఘటన నేపథ్యంలో ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు వివిధ మార్గాల్లో నడిచే పలు రైళ్లను రద్దు చేయనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నాంపల్లి, సికింద్రాబాద్ స్టేషన్ల నుంచి షాలిమార్‌కు రాకపోకలు సాగించే రైళ్లు రద్దు కానున్నాయి.



కొల్లగొట్టింది రూ.35 కోట్లు.. రికవరీ రూ.కోటి!

గ్రేటర్ పరిధిలో సైబర్ నేరగాళ్లు ఏటా కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నా.. రికవరీ మాత్రం చాలా తక్కువగా ఉంటోంది. -8లో

ఉష్ణోగ్రత

గరిష్టం	కనిష్టం
37.8°	26.7°

న్యూస్‌రీల్

దివ్యాంగులకు మేలు చేసింది కేసీఆరే

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు, చిత్రంలో మంత్రి తలసాని

ఖైరతాబాద్: దేశంలోనే దివ్యాంగులకు అత్యధిక పెన్షన్‌ను అందిస్తూ వారి ఆత్మగౌరవాన్ని పెంచిన గొప్ప మనసున్న మహరాజు ముఖ్యమంత్రి కేసీఆర్ అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం జల విహార్‌లో దివ్యాంగులకు మరో వెయ్యి రూపాయల పెన్షన్ పెంచుతున్నట్లు ప్రకటించడం పట్ల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన 4వేల మంది దివ్యాంగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, దానం నాగేందర్, బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్, కార్పొరేషన్ చైర్మన్లు వాసుదేవ రెడ్డి, గజ్జెల నాగేష్, నగర గ్రంథాలయ చైర్‌పర్సన్ ప్రసన్న, దివ్యాంగుల ప్రతినిధులు యాదగిరి, భాస్కర్, దివ్యాంగుల ఇండియన్ క్రికెట్ కెప్టెన్ మహేష్, కార్పొరేటర్ సామల హేమ పాల్గొన్నారు.

22 నుంచి సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (ఎస్ఏటీఎస్) సంయుక్తాధ్వర్యంలో 9వ, యోనెక్స్ సన్‌రైజ్ తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 వరకు రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా గ్రామంలోని కన్హా శాంతి వనంలో జరుగుతాయని తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు ఉంటాయన్నారు. ఇవి జాతీయ స్థాయి, మహిళలు, పురుషుల బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక పోటీలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 19లోగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. సింగిల్స్‌లో పాల్గొనే క్రీడాకారులు రూ.800, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో పాల్గొనే క్రీడాకారులు రూ.1000 ఎంట్రీ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 98480 15443.





పరీక్ష సమయం సమీపించడంతో పరుగెత్తుకుంటూ వస్తున్న అభ్యర్థులు

దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ కళాశాల వద్ద..



47.73% హాజరు

ప్రశాంతంగా గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష



కోఠి ఉమెన్స్ కాలేజీలో పరీక్ష కోసం వస్తూ..

నగరంలో ఆదివారం గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పలు పరీక్ష కేంద్రాల్లో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను లోనికి అనుమతించలేదు. దీంతో అభ్యర్థులు నిరాశకు గురయ్యారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 50,804 మంది అభ్యర్థులకు గాను 24,247 (47.73 శాతం) మంది హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లాలో మొత్తం 55,032 మంది అభ్యర్థులకు 32,553 (59.15శాతం) మంది పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ హరీష్ తనిఖీ చేశారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌లోని ఓ కేంద్రంలో గందరగోళం నెలకొంది. పరీక్ష సమయం ముగిసిందని ఇన్విజిలేటర్ అరగంట ముందుగానే పేపర్లు. తీసుకున్నారని ప్రచారం సాగుతుండగా.. ఇందులో ఎటువంటి వాస్తవం లేదని కలెక్టర్ హరీష్ ఖండించారు. నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సమయాలను పాటిస్తూ ప్రశ్న పత్రాలు ఇచ్చి, పరీక్ష ముగిసిన మీదట ఓ.ఎం.ఆర్ షీట్లను తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

- సాక్షి, సిటీబ్యూరో

స్ట్రిప్పులు.. తప్పులు!

నిబంధనలకు విరుద్ధంగా రంబుల్ స్ట్రిప్స్

- ప్రమాణాలకు మించి కొన్ని రెట్ల మందం
- ఈ కారణంగానే వీటిపై తరచూ ప్రమాదాలు
- ఓ ట్వీట్ నేపథ్యంలో కేటీఆర్ ఆదేశాలతో చర్య
- 'సాక్షి' పరిశీలనలో వెలుగులోకి అనేక లోపాలు



నాగోల్ ఫ్లై ఓవర్ వద్ద..

సాక్షి, సిటీబ్యూరో: ప్రధాన రహదారుల్లో వాహనాల వేగాన్ని నియంత్రించడానికి ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్స్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయంటూ పలువురు నెటిజనులు మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేశారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న ఆయన అలాంటి అపశ్రుతులకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతే... నగరంలో ఎక్కడా ఈ స్ట్రిప్స్ వేయరాదంటూ జీహెచ్ఎంసీ మెమో జారీ చేసింది.

తప్పులు గుర్తించకుండా తప్పటడుగు..

రంబుల్ స్ట్రిప్స్ విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం వ్యాధి ఒక చోటైతే మందు మరో చోట అన్న చందంగా మారింది. రంబుల్ స్ట్రిప్స్ వల్ల ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలంటూ మంత్రి ఆదేశిస్తే... ఆ పని వదిలేసి తదుపరి ఆదేశాల వరకు స్ట్రిప్స్ వేయకూడదని నిర్ణయం తీసుకున్నారు. ఈ స్ట్రిప్స్ విషయంపై 'సాక్షి' చేపట్టిన పరిశీలనలో అనేక కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. జాతీయ రహదారులతో పాటు ప్రధాన రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు వేయడానికి నిబంధనలు అంగీకరించవు. వీటి వల్ల లాభం కంటే నష్టం ఎక్కువనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాంటి ప్రాంతాల్లో కచ్చితంగా రంబుల్ స్ట్రిప్స్ వినియోగించాల్సిందే. వీటి ఏర్పాటులో తాము చేస్తున్న తప్పులను గుర్తించని జీహెచ్ఎంసీ అధికారులు ఎక్కడా వేయకూడదనే నిర్ణయం తీసుకుని తప్పటడుగు వేశారు.

ఆ నిబంధనలు పట్టించుకోలేదు..

రహదారులపై ఎలాంటి మార్కింగ్ చేయాలన్నా, ఇతర చర్యలు తీసుకోవాలన్నా కచ్చితంగా ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్ఎస్) నిబంధనలు పాటించాలి. రంబుల్ స్ట్రిప్స్ విషయంలోనూ కొన్ని ప్రమాణాలను నిర్దేశించింది. ఈ అంశాలను ఎక్కడా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోలేదు. రంబుల్ స్ట్రిప్ ఎత్తు గరిష్టంగా 2 నుంచి 3 సెంటీమీటర్లు, వెడల్పు 20 నుంచి 30 సెంటీ మీటర్లు మాత్రమే ఉండాలి. ప్రతి రెండు స్ట్రిప్ మధ్య 10 సెంటీ మీటర్ల దూరం ఉండాలి. ఓ ప్రాంతంలో కేవలం ఆరు మాత్రమే స్ట్రిప్స్ వేయాలి. ప్రస్తుతం నగరంలోని కొన్ని ప్రాంతాల్లో 9 నుంచి 20 స్ట్రిప్స్ కూడా వేశారు. ఎత్తు, వెడల్పు విషయంలో ఓ ప్రయాణం లేకుండా చేశారు. ఇవే ప్రమాద హేతువులుగా మారుతున్నాయి. ఈ విషయాలు పట్టించుకోని బల్దియా అధికారులు స్ట్రిప్స్ విధానాన్నే ఎత్తేయాలని చూస్తున్నారు.

ఆ పరికరాలు, బృందం ఏమైనట్లు..?

జీహెచ్ఎంసీ–ట్రాఫిక్ పోలీసుల వ్యవహారం పెత్తనం ఒకరి చేతిలో బెత్తం మరొకరి చేతిలో అన్నట్లు ఉంది. రహదారులపై ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నిరోధం వంటివి ట్రాఫిక్ పోలీసులు చేస్తుంటే.. మౌలిక వసతుల కల్పన జీహెచ్ఎంసీ పర్యవేక్షిస్తోంది. ఈ కారణంగానే ఐఆర్ఎస్ నిబంధనలు పట్టించుకోకపోవడం వంటివి జరుగుతున్నాయి. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) 2010లో ట్రాఫిక్ డెవలప్‌మెంట్ రివాల్వింగ్ ఫండ్ (టీడీఆర్ఎఫ్) నుంచి రూ.36.65 లక్షలు కేటాయించింది. వీటిలో రూ.20 లక్షలు ఖర్చు చేసి అమెరికా నుంచి గ్రైకో లైన్ లేజర్ మిషన్లు రెండు ఖరీదు చేశారు. వీటిని వాడి రహదారులపై మార్కింగ్స్ కోసం ట్రాఫిక్ పోలీసు విభాగంలోని రోడ్ పెయింటింగ్ పార్టీని ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇవన్నీ కనుమరుగైపోవడం వల్లే ఈ పరిస్థితులు వచ్చాయన్నది నిర్వివాదాంశం.

లెక్కకు మించిన స్ట్రిప్స్ ఇలా:

- ఎల్బీనగర్ మెట్రో రైల్ స్టేషన్ వద్ద ఉన్నన్ని రంబుల్ స్ట్రిప్స్ నగరంలోని మరే చోటా లేవని చెప్పవచ్చు. ఓ ప్రాంతంలో ఆరు స్ట్రిప్స్ మాత్రమే ఉండాల్సి ఉండగా ఇక్కడ 20 ఉండటం గమనార్హం.
- కొత్తగా నిర్మించిన నాగోలు ఫ్లైఓవర్ రెండు చివరలా, ఉప్పల్ వైపు ఉన్న దారిలో 14 స్ట్రిప్స్ ఉన్నాయి. దీని పక్కనే కింది నుంచి ఉన్న రహదారిలోనూ ఇదే పరిస్థితి.
- ఉప్పల్ చౌరస్తాలో సికింద్రాబాద్ వైపు వెళ్లే మార్గం వద్ద పరిశీలిస్తే... లిటిల్ ఫ్లవర్ స్కూల్ వద్ద రెండు చోట్ల స్ట్రిప్స్ ఉన్నాయి. మొదటి చోట 6 ఉండగా... రెండో చోట 12 ఉన్నాయి.
- అసెంబ్లీ ఎదురుగా ఉన్న ట్రాఫిక్ కమిషనరేట్ ఎంట్రీ వద్దే 9 స్ట్రిప్స్ ఉన్నాయి. అబిడ్స్ సిగ్నల్స్, బషీర్‌బాగ్, హైదరాబాద్ కలెక్టరేట్ సహా అనేక ప్రాంతాల్లో ఇదే సంఖ్యలో స్ట్రిప్స్ ఉన్నాయి.



ఎల్బీనగర్ మెట్రో సమీపంలో..

బడి గంటలు మోగే వేళ

నేటి నుంచి పాఠశాలలు షురూ

- ఇక ఉరుకులు.. పరుగులు
- సర్కారు బడుల్లో టీచర్ల కొరత
- గ్రేటర్‌లో 20.46 లక్షల మంది విద్యార్థులు



సాక్షి, సిటీబ్యూరో: బడి గంటలు మోగే వేళయ్యింది. బుడిబుడి అడుగులు వేసుకుంటూ చిన్నారులు స్కూళ్లకు పోయే తరుణం ఆసన్నమయ్యింది. సోమవారం బడులు తెరుచుకోనున్నాయి. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. కొత్త పుస్తకాలు, కొత్త తరగతి గదిలోకి పిల్లలు అడుగిడనున్నారు. విద్యార్థుల ఉరుకులు.. పరుగులు.. కేరింతలు.. టీచర్ల అటెన్షన్.. సైలెంట్ ప్లీజ్ అనే శబ్దాలు వినిపించనున్నాయి. గ్రేటర్‌లోని హైదరాబాద్-రంగారెడ్డి-మేడ్చల్ జిల్లాల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కలిసి సుమారు 7,801 పాఠశాలలు ఉండగా, వీటిలో దాదాపు 20.46 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో ప్రాథమిక తరగతులు చదువుతున్నవారు 10,15,571 మంది, ప్రాథమికోన్నత తరగతులు చదువుతున్నవారు 6,38,955 మంది, ఉన్నత పాఠశాల విద్యార్థులు 3,91,650 మంది ఉన్నట్లు విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

అటు ఆనందం.. ఇటు ఆర్థిక ఒత్తిళ్లు

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైందంటే విద్యార్థుల తల్లిదండ్రులకు ఆనందంతో పాటు ఆర్థిక ఒత్తిళ్లు తప్పవు. ఒకవైపు పిల్లలు పైతరగతుల్లో అడుగిడుతున్నారనే ఆనందం.. మరోవైపు స్కూల్ ఫీజులు, పుస్తకాలు, స్టేషనరీ ఇతర ఖర్చులు భరించలేని ఒత్తిడి వీరిని వెంటాడుతుంది. కార్పొరేట్ స్కూళ్లలోనే కాకుండా బడ్జెట్ బడిలో చదివించే వారికి సైతం ప్రతి విద్యా సంవత్సరం రూ.లక్షకు పైగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

పెరిగిన ఫీజులు..

ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు ఈసారి కూడా ఫీజులు భారీగా పెంచాయి. గతేడాదితో పోల్చితే ఈసారి 20 నుంచి 30 శాతం అధికంగా ఫీజుల మోత మోగుతోంది. వాస్తవానికి ఫీజులు పెంచాలంటే జీఓ నంబర్ 42 ప్రకారం ఫీజుల క్రమబద్ధీకరణ కమిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. నిబంధన ప్రకారం అయిదు నుంచి పదిశాతం మించి ఫీజులు పెంచవద్దు. అయినా.. కమిటీకి కనీసం సమాచారం ఇవ్వకుండా ఫీజులు పెంచడం షరా మామూలుగా మారింది. ఇక కార్పొరేట్ స్కూళ్లలో ఫీజులకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది.

స్టేషనరీ దందా..

ప్రైవేటు పాఠశాలల్లో స్టేషనరీ దందా కొనసాగుతోంది. యూనిఫాం, బెల్ట్, టై, డైరీ, లంచ్ బాక్స్, బ్యాగ్స్, షూస్ ఇలా విద్యార్థులకు కావాల్సినవన్నీ విక్రయిస్తున్నాయి. ఉత్పత్తి కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని, వాటిపై స్వయంగా స్కూలు పేరు సహా ధరలను ముద్రించుకుని విద్యార్థులకు అంటగడుతున్నాయి. ఇతర షాపుల్లో కొనుగోలు చేసిన నోట్ పుస్తకాలను పరిగణించబోమని స్పష్టం చేస్తున్నాయి. ఫలితంగా విద్యార్థుల తల్లిదండ్రులు విధిలేని పరిస్థితుల్లో అక్కడే కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ప్రత్యేక ముద్రణ

ప్రత్యేక సిలబస్ రూపొందించుకుని ఆ మేరకు ఆయా స్కూళ్ల పేరుతో పాఠ్య పుస్తకాలు ముద్రిస్తున్నాయి. ప్రింట్ ఖరీదుకు మించి ధరలు నిర్ణయిస్తున్నాయి. విద్యార్థులు కొనుగోలు చేసిన పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం ఇతర వస్తువులకు ఏటీఎం, పేటీఎం వంటి చెల్లింపులను నిరాకరిస్తున్నాయి. కేవలం నగదుకే వీటిని విక్రయిస్తూ జీఎస్టీ అధికారులకు ఏ మాత్రం చిక్కకుండా జాగ్రత్త వహిస్తున్నాయి.

సర్కారు బడుల్లో సమస్యలు..

సర్కారు బడుల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎప్పటిలాగే ఈసారి కూడా సమస్యలు స్వాగతం పలకనున్నాయి. విద్యా వ్యవస్థను మెరుగు పర్చేందుకు ప్రభుత్వం ఆశించిన స్థాయిలో చర్యలు చేపట్టకపోవడం, మన బస్తీ– మనబడి పథకంలో భాగంగా చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. తరగతి గదులు, ఫర్నిచర్, మంచి నీరు, కరెంట్ వంటి కనీస మౌలిక సదుపాయాల కొరత విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయనుంది.

ఉపాధ్యాయుల కొరత..

సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది. విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. గత రెండేళ్లుగా ఖాళీలు భర్తీ చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మూడేళ్ల నుంచి విద్యావలంటీర్లను కూడా నియమించకపోవడంతో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన కష్టంగా మారుతోంది. నాణ్యమైన బోధన లేకపోవడంతో ఉత్తీర్ణత శాతం తగ్గుతోంది.

నేను రోజూ యోగా చేస్తా

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

రహమత్‌నగర్(బోరబండ): సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం బాధ్యతగా భావిస్తానని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. కీర్తిరెడ్డి ఫౌండేషన్, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో బోరబండ నాట్కో స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. నేటి చాలెంజింగ్ జీవితంలో ఆరోగ్య సంరక్షణ ఎంతో అవసరమన్నారు. తాను నిత్యం యోగా చేస్తానని తెలిపారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన కీర్తిరెడ్డిని అభినందించారు. ప్రతి వ్యక్తి తప్పనిసరిగా ఏడాదికోసారి పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని గవర్నర్ సూచించారు. కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమన్న సిద్ధాంతాన్ని నమ్ముతానని, అందుకే తన ఫౌండేషన్ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నానని తెలిపారు. అనంతరం రోగులకు న్యూట్రిషన్ కిట్‌లను అందించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి, శ్రీశ్రీ హోలిస్టిక్స్ ఆస్పత్రి డైరెక్టర్ డా.తుషారా, జిల్లా టీబీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, రెడ్ క్రాస్ ప్రతినిధి మహ్మద్ రైజోద్దీన్ పాల్గొన్నారు.



రోగులకు న్యూట్రిషన్ కిట్లను అందజేస్తున్న గవర్నర్

గవర్నర్ సెక్యూరిటీ సిబ్బంది సెల్‌ఫోన్ల చోరీ

సాక్షాత్తూ గవర్నర్ భద్రతా సిబ్బంది సెల్‌ఫోన్లే చోరీకి గురి కావడం చర్చనీయాంశంగా మారింది. బోరబండ నాట్కో స్కూల్లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గవర్నర్ తమిళిసై పాల్గొన్నారు. ఆమె వెంట భద్రతా సిబ్బంది ఉన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం గవర్నర్ వెళ్లిపోయారు. కాగా.. గవర్నర్ భద్రతా సిబ్బందికి చెందిన రెండు సెల్‌ఫోన్లు పోయాయని, దొంగిలించిన వారు తిరిగి వాటిని తమకు అప్పజెప్పాలని వేదిక నిర్వాహకుల్లో ఒకరు మైక్‌లో ప్రకటించడం గమనార్హం.

మహిళల ఆరోగ్యంతోనే సమాజం ముందడుగు

గచ్చిబౌలి: అన్ని రంగాల్లో మహిళలు దూసుకుపోతున్నారని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. కొండాపూర్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలోని నోవాటెల్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన మహిళా ఆరోగ్య సదస్సును ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా సమాజం ముందడుగు వేస్తుందన్నారు. మహిళల ఆరోగ్యం కోసం ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాన్ని డాక్టర్ శిల్పిరెడ్డి చేపట్టడం అభినందనీయమన్నారు. కొండాపూర్ కిమ్స్ కడల్స్ ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ శిల్పిరెడ్డి, కిమ్స్ ఆస్పత్రుల గ్రూపు చైర్మన్ డాక్టర్ భాస్కర్‌రావు, కిమ్స్ ఆపరేషన్స్ హెడ్ అనిత, నియోనటాలజిస్ట్, డాక్టర్ సి. అపర్ణ, ఒయాసిస్ ఫెర్టిలిటీ సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ దుర్గా జి రావు, డెర్మటాలజిస్ట్ డాక్టర్ జానకి, కిమ్స్ ఆస్పత్రుల గ్రూపు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వి.సుధీర్ పాల్గొన్నారు.

గ్లోబల్ సిటీగా భాగ్య నగరం

మంత్రి హరీష్‌రావు

బంజారాహిల్స్: హెల్త్ హబ్‌గా తెలంగాణ, గ్లోబల్ సిటీగా హైదరాబాద్ నగరం ఎదిగాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.10లో ఆదివారం ఆయన ఓ ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ మార్గనిర్దేశంలో ఈ అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఆరోగ్య రంగంలో కూడా తెలంగాణ గణనీయ పురోగతి సాధిస్తుందని పేర్కొన్నారు. త్వరలోనే 10 వేల పడకల సామర్థ్యంతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం వైద్య రంగంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో కొనసాగుతోందని కొనియాడారు. సూపర్‌స్పెషాలిటీ ఎంసీహెచ్‌లను గాంధీ, నిమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేయబోతున్నామని, వచ్చే నెలలో గాంధీ ఆస్పత్రిలో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని హరీష్‌రావు తెలిపారు. వైద్య సేవలు అందించే విషయంలో కార్పొరేట్ ఆస్పత్రులతో ప్రభుత్వ ఆస్పత్రులు పోటీ పడుతున్నాయని పేర్కొన్నారు. 2014లో ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు 30 శాతం ఉంటే ఇప్పుడు 70 శాతం పెరిగిందన్నారు. అవయవ మార్పిడి చికిత్సల్లో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉందన్నారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో పేషంట్ కేర్ సెక్యూరిటీ, ఇతర సేవలకు సంబంధించిన ఖర్చులను రెండేళ్ల పాటు భరించనున్నట్లు సినీ దర్శకుడు రాజమౌళి తండ్రి విజయేంద్రప్రసాద్ ముందుకు వచ్చారని, ఇది అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దర్శకుడు రాజమౌళి, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సతీష్ గంటా, స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మిస్ టీన్ ఆఫ్ తెలంగాణగా అత్తిలి లక్షణ

గ్లోబల్ ఇండియా ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్స్ ఢిల్లీ కేంద్రంగా నిర్వహించిన మిస్ టీన్ తెలంగాణ–2023 అందాల పోటీల్లో హైదరాబాద్ మణికొండకు చెందిన అత్తిలి లక్షణ గెలుపొందారు. శనివారం రాత్రి పోటీలు జరిగాయి. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్న ఆమె తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మిస్ టీన్ తెలంగాణగా గెలుపొందినందుకు ఎంతో గర్వపడుతున్నానని, రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తనకు అవార్డు రావటంతో.. దానిని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అంకితమిస్తున్నట్లు తెలిపారు.

- మణికొండ

పనుల్లో వేగం పెంచండి

- నిమ్స్ విస్తరణ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన రూట్ మ్యాప్‌పై దిశానిర్దేశం

లక్డీకాపూల్: నిమ్స్ విస్తరణలో భాగంగా ఎర్రమంజిల్ కాలనీలో ఈ నెల 14న సీఎం కేసీఆర్ పనులకు భూమి పూజ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఏర్పాట్లను పరిశీలించేందుకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇప్పటిదాకా రోడ్ల విస్తరణ, రూట్ మ్యాప్, పార్కింగ్ సదుపాయాలు వంటి ఏర్పాట్లు చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రులు, ఇతర ప్రముఖులు వచ్చేందుకు వీలుగా ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు. భద్రతాపరమైన చర్యలను తీసుకోవాలన్నా రు. నిమ్స్ అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని పేర్కొన్నారు. అందుకనుగుణంగా పని చేసి సీఎం ఆశయాలు ఆచరణలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్పకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో సీఎం ఓఎస్డీ డాక్టర్ గంగాధర్, ఆర్అండ్‌బీ సీఈ గణపతి రెడ్డి, ఈఈ శశిధర్, నిమ్స్ సివిల్ ఇంజినీర్ లక్ష్మారెడ్డి, నిమ్స్ విస్తరణ పనుల నోడల్ అధికారి డాక్టర్ లక్ష్మీభాస్కర్, ఏపీఆర్వో సత్యాగౌడ్ పాల్గొన్నారు.



ఎర్రమంజిల్ కాలనీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి తదితరులు

గ్రామాల్లో దర్జాగా భూకబ్జాలు

- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజం
- ఘూంసిమియాగూడ రైతులకు బీఎస్పీ సంఘీభావం



ఘూంసిమియాగూడ రైతులకు సంఘీభావం తెలుపుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

శంషాబాద్ రూరల్: తెలంగాణలోని వేలాది గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం భూకబ్జాలకు పాల్పడుతోందని, లేదంటే ప్రజల పట్టా భూములను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. మండలంలోని ఘూంసిమియాగూడ భూముల బాధిత రైతులకు అండగా ఆయన ఆదివారం గ్రామంలోని భూములను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో పేద ప్రజల నుంచి దౌర్జన్యంగా తీసుకున్న భూములను తిరిగి వారికి అప్పగించేందుకు బీఎస్పీ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఏ భూమి మీద హక్కు కోసం తెలంగాణ తెచ్చుకున్నామో ఆ భూములిప్పుడు రైతుల వద్ద లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఘూంసిమియాగూడలో వందేళ్ల నుంచి సాగు చేసుకుంటున్న 90 మంది రైతులకు సంబంధించిన సుమారు 200 ఎకరాల భూములను గోల్డ్‌స్టోన్ కంపెనీ యజమాని ప్రసాద్ అన్యాయంగా లాక్కున్నారని ఆరోపించారు. మియాపూర్ భూముల కుంభకోణంలో వందల ఎకరాల ప్రభుత్వ భూములను అక్రమంగా కొట్టేసిన గోల్డ్‌స్టోన్ ప్రసాద్ ఘూంసిమియాగూడ రైతులను కూడా మోసం చేస్తున్నారన్నారు. బీసీ వర్గానికి చెందినవాడినని చెప్పుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ రైతుల పక్షాన ఉండి పోరాడాలా.. లేదంటే గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌కు మద్దతివ్వాలా అని ప్రశ్నించారు. ఘూంసిమియాగూడ పేద రైతులకు బీఎస్పీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

కొల్లగొట్టింది రూ.35 కోట్లు..
రికవరీ రూ.కోటి!



- సిటీ సైబర్ క్రైంలో రికవరీ పరిస్థితి ఇదీ
- నిత్యం రూ.లక్షల్లో పోగొట్టుకుంటున్న బాధితులు
- పెరిగిన ఫిర్యాదుల తాకిడి
- రికవరీలో పోలీసులకు పలు సవాళ్లు
- నేరస్తులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కావడంతో సమస్య

హిమాయత్‌నగర్: గ్రేటర్ పరిధిలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. నిత్యం ఏదో ఒకచోట సైబర్‌నేరగాళ్ల బారిన పడి నగరవాసులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. ఏటా కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నా...సైబర్ నేరాల్లో రికవరీ మాత్రం చాలా తక్కువగా ఉంటోంది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఒకర్ని ఇన్వెస్ట్‌మెంట్ రూపంలో, మరొకర్ని క్రిప్టో కరెన్సీ రూపంలో, ఇంకొకర్ని పార్ట్‌టైం జాబ్ రూపంలో కోటీశ్వరుల్ని చేస్తామంటూ నేరగాళ్లు వారిని గుల్ల చేస్తున్నారు. హైదరాబాద్ సిటీ సైబర్‌క్రైం పోలీసు స్టేషన్‌లో దాదాపు 1500 ఎఫ్‌ఐఆర్‌లు నమోదవగా రూ.35 కోట్లకు పైగా సొమ్ము లూటీ అయినట్లు పోలీసులు చెబుతున్నారు. వాటి రికవరీ విషయంలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఇదే సమయంలో సైబర్ నేరాలకు పాల్పడుతున్నది ఇతర రాష్ట్రాల వారు కాబట్టి రికవరీ కష్టమేనంటూ బాధితుల ముఖంపైనే కొందరు ఐఓలు చెప్పడం ఇక్కడ గమనార్హం.

కష్టతరంగా రికవరీ

- రాజస్థాన్, బిహార్, ఢిల్లీ, యూపీ వంటి ప్రాంతాలకు చెందిన కొందరు నేరగాళ్లు నగరవాసులకు గాలం వేస్తున్నారు.
- ఇన్వెస్ట్‌మెంట్, క్రిప్టో కరెన్సీ, పార్ట్‌టైం జాబ్ తదితర సాకులు చెప్పి కోటీశ్వరుల్ని చేస్తామంటూ నమ్మిస్తున్నారు.
- టెలిగ్రామ్, వాట్సాప్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా పరిచయాలను పెంచుకుంటున్నారు. తొలి రోజుల్లో తక్కువ సొమ్ముకు ఎక్కువ రాబడిని ఇస్తూ నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నారు.
- ఆ తర్వాత లక్షల రూపాయలు కాజేస్తూ అమాయకుల్ని అప్పుల పాలు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు హైదరాబాద్ సిటీ సైబర్‌క్రైంలో నమోదైన ఎఫ్‌ఐఆర్‌ల సంఖ్య 1500.
- దీనిలో అమాయకులు పోగొట్టుకున్నది రూ.35 కోట్లకు పైమాటే.
- దీనిలో పోలీసులు రికవరీ చేసింది మాత్రం రూ.కోటి కూడా ఉండకపోవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులకు ఇబ్బందులు

సైబర్ నేరగాళ్ల బారిన పడ్డ నగర వాసులు డబ్బును కోల్పోయి సైబర్‌క్రైం పోలీసుల్ని ఆశ్రయిస్తున్నారు. రికవరీ విషయంలో పోలీసులు ఎంత కష్టపడ్డప్పటికీ టార్గెట్‌ను రీచ్ కాలేకపోతున్నారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న నేరస్తులంతా కూడా బ్యాంకు ఖాతాలు, ఫోన్ నెంబర్‌లు ఇతరులవి వినియోగిస్తున్నారు. ఇక్కడ ఎఫ్‌ఐఆర్ నమోదు అయ్యాక సంబంధిత బ్యాంకు కేవైసీ ఆధారంగా ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న పోలీసులకు పరాజయాలు ఎదురవుతున్నాయి. అసలైన నేరస్తులు ఆయా అడ్రస్‌లలో ఉండకపోవడంతో వీరు వెనుదిరిగి రావాల్సిన పరిస్థితి వస్తోంది. ఒకవేళ ఒకరిద్దరు పోలీసులకు పట్టుబడినప్పటికీ రికవరీ మాత్రం ఆశించిన స్థాయిలో జరగడం లేదు. అప్పటికే డబ్బును ఖర్చు చేయడం, ఇతర దేశాలకు పంపడం లాంటి పనులు చేస్తున్నారు. దీంతో సైబర్‌క్రైంలో నమోదైన కేసుల రికవరీ విషయంలో పోలీసులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

క్రిప్టో ద్వారా సొమ్మంతా విదేశాలకు



మనవారి వద్ద దోచుకున్న సొమ్మంతా కూడా క్రిప్టో ద్వారా విదేశాలకు వెళ్లిపోతుంది. బాధితులు మా వద్దకు వచ్చి మేం ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, ఇతర రాష్ట్రానికి వెళ్లే లోపు ఆ డబ్బును తరలించేస్తున్నారు. ఈ కారణంగా రికవరీ చేయడం పెద్ద టాస్క్‌గా మారింది. అయినప్పటికీ ప్రతి కేసు విషయంలో మేము పకడ్బందీగా వ్యవహరిస్తున్నాం. బాధితులకు అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నాం.

– కేవీఎం ప్రసాద్, సిటీ సైబర్‌క్రైం ఏసీపీ

నకిలీ ఐస్‌క్రీం తయారీ అడ్డాపై దాడి

చైతన్యపురి: నకిలీ ఐస్‌క్రీం తయారు చేస్తున్న ఓ ఇంటిపై ఎల్‌బీ నగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాంనగర్ కాలనీలోని ఓ ఇంట్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఐస్ క్యూబ్ పేరుతో ఐస్‌క్రీం తయారు చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో ఎస్ఓటీ పోలీసులు ఆదివారం రాత్రి ఆ ఇంటిపై దాడి చేశారు. నిర్వాహకుడు భిక్షపతిని అదుపులోకి తీసుకున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో, కాలపరిమితి తీరిన ఫ్లేవర్స్‌తో ఐస్‌క్రీం తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అలాగే యూనిట్‌కు ఎలాంటి అనుమతులు కూడా లేనట్లు విచారణలో తేలింది. భారీ ఎత్తున కాలం చెల్లిన ఫ్లేవర్స్, ఇతర ముడిసరుకుని స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం సరూర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న సామాగ్రి



అలరించిన నాట్యప్రదర్శనలు

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామంలో నాట్య ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా అలరించాయి. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 'శ్రీకృష్ణ కళలయ' బెంగళూరు గురువు సునీతా సుకుమార్ శిష్యబృందంచే నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన ఆద్యంతం కట్టిపడేసింది. పుష్పాంజలి, గణేశకీర్తన, నాతనం మనోహర, పాహిమాం, నటేశకౌతం, త్రిమాత, వర్ణం, ధిల్లాన తదితర అంశాలను నాట్య కళాకారులు చైత్ర కీర్తన, మోహిత, పంచమి, బృంద, తనూష, మేఘన, నవ్యశ్రీ, విద్య, దిశా, భూమిక, నిసర్గ, శ్రేయలు అద్భుతంగా ప్రదర్శించారు.

వినాశకర ఆర్డినెన్స్‌లతో దేశ సమైక్యతకు ముప్పు

ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

లిబర్టీ: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వినాశకరమైన ఆర్డినెన్స్‌లు తెచ్చి...దేశ సమైకతకు తూట్లుపొడుస్తోందని 'ఆప్' తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మండిపడ్డారు. కావాలనే కేంద్రం ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. దేశ రాజధానిలో సివిల్ సర్వెంట్లపై అధికారాన్ని ఢిల్లీ ప్రభుత్వానికి అప్పగిస్తూ మే 11న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తుంగలో తొక్కి, రాజ్యాంగ విరుద్ధ ఆర్డినెన్స్‌లు జారీ చేయడం దారుణమన్నారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెచ్చిన ఆర్డినెన్స్‌ను వెనక్కి తీసుకుని..సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ సొంత రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడితే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. ఢిల్లీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెచ్చిన రాజ్యాంగ విరుద్ధమైన ఆర్డినెన్స్‌ను మోదీ తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ ఎస్.కె.ఆర్.అన్వారీ, ఎండీ మజీద్, డాక్టర్ పుట్ట పాండురంగయ్య, ఎన్.తిరుమల రావు, సాల్మన్‌రాజు, ప్రొఫెషనల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ జి.హరిచరణ్, నేతలు టి.రాకేష్‌సింగ్, జావేద్ షరీఫ్, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాహితీ దినోత్సవం



సాహితీ దినోత్సవంలో పాల్గొన్న కవులు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సాహితీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు- ఉర్దూ-హిందీ సాహితీవేత్తల సమ్మేళనం ఆసక్తిగా సాగింది. ఉత్సవాలను మొదట జోనల్ ఎస్‌సీ మహదేవ్ రత్నాకర్ ప్రారంభించి మాట్లాడారు. దశాబ్ది తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా 'దేశ్ మే తెలంగాణ రోషన్ హై, హమారా సబ్ సే ప్యారా తెలంగాణ' అంటూ కవులు తెలంగాణను కొనియాడారు. ఈ కవి సమ్మేళనంలో కవులు అబ్దుల్ రషీద్ హర్షద్, సయ్యద్ నవీద్, జాఫ్రీ, అత్యాబ్ ఇజాజ్, జాయిం జుమ్రహ్ , షకీల్ హైదర్ నహీం ఘోరీ, జహార్ జహీర బాది, ఎం.లక్ష్మణాచార్యులు, సలీం, ఉమా దేవి, సవిత సోని, గోవింద్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

కిరాణ షాపులో రూ.లక్ష నగదు చోరీ



దొంగతనానికి పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తి (టోపీ పెట్టుకున్న వ్యక్తి)

హస్తినాపురం: పట్టపగలు.. గుట్టు చప్పుడు కాకుండా కిరాణ షాపులోని క్యాష్ కౌంటర్‌లో గుర్తు తెలియని వ్యక్తి లక్ష రూపాయలు నగదు దొంగిలించాడు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వనస్థలిపురం ఎన్‌జీవోస్ కాలనీ ప్రధాన రహదారిపై ఉన్న శ్రీనివాస కిరాణ షాపులో ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి టోపీ పెట్టుకుని వచ్చి..అందరు ఎవరిపనిలో వారు నిమగ్నమై ఉన్న సమయంలో క్యాష్ కౌంటర్‌లో ఉన్న లక్ష రూపాయల నగదును ఎత్తుకెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత కిరాణ షాపు యజమాని నర్సింహారెడ్డి క్యాష్ కౌంటర్‌లో నగదు లేకపోవడాన్ని గమనించాడు. వెంటనే వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించగా..టోపీ పెట్టుకున్న ఓ వ్యక్తి నగదు తీసుకున్నట్లు గుర్తించారు.

రూ.12 లక్షల విలువైన నిషేధిత సిగరెట్లు స్వాధీనం



పోలీసుల అదుపులో మోహన్‌దాస్ ఠాకూర్

అఫ్జల్‌గంజ్: తక్కువ వ్యవధిలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో నిషేధిత సిగరెట్లను నగరానికి తరలిస్తున్న ఓ వ్యక్తిని వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గౌలిగూడ ప్రాంతానికి చెందిన మోహన్‌దాస్ ఠాకూర్ ఓ ట్రాన్స్‌పోర్టులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి మంగళ్‌హాట్ ప్రాంతానికి చెందిన సయ్యద్ మోయినుద్దీన్, రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ రజాక్‌లతో పరిచయం ఏర్పడింది. వీరి సూచనల మేరకు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో నిషేధిత సిగరెట్లను ట్రాన్స్‌పోర్టు ద్వారా ఢిల్లీ నుండి నగరానికి తరలిస్తున్నాడు. ఈ మేరకు పక్కా సమాచారంతో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపి పి.రాధాకిషన్ నేతృత్వంలో బృందం ట్రాన్స్‌పోర్టుపై దాడి చేసి రూ.12 లక్షల విలువైన నిషేధిత సిగరెట్లను స్వాధీనం చేసుకొని మోహన్‌దాస్ ఠాకూర్‌ను అదుపులోకి తీసుకున్నారు. తప్పించుకున్న మరో ఇద్దరు నిందితులు సయ్యద్ మోయినుద్దీన్, మహమ్మద్ అబ్దుల్ రజాక్‌లపై ఇప్పటికే అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం అఫ్జల్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.

కేంద్ర పథకాలపై ఇంటింటా ప్రచారం చేయండి



తార్నాకలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళా మోర్చాల సమావేశం తార్నాకలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగింది. కార్యక్రమానికి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సుక్క, గణేష్ ముదిరాజ్ అధ్యక్షత వహించగా మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన సీఎం కేసీఆర్ కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు కాకుండా అడ్డుపడుతున్నారని పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతి నాయకుడు, కార్యకర్త ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర పథకాల లబ్దిదారులను గుర్తించి వారి అభివృద్ధిని తెలుసుకోవాలన్నారు. తొమ్మిదేళ్ల నరేంద్రమోదీ పాలనలో అనేక సంస్కరణలు చేపట్టారని ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, బండపల్లి సతీష్, వెంకటేష్ గౌడ్, రామువర్మ, వీరన్న, ఆదం విజయ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ బీఆర్ఎస్ ప్రభుత్వం

- మంత్రి సబితారెడ్డి



లక్ష్మీనగర్‌లో పార్కు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా తదితరులు

హుడాకాంప్లెక్స్: బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధి లక్ష్మీనగర కాలనీలో రూ.32 లక్షల నిధులతో చేపట్టిన పార్కు నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తాతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో మంత్రి కేటీఆర్ ఆలోచనలతో గ్రేటర్ హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా మారుతోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా మారిందో చూడాలన్నారు. తెలంగాణ పదేళ్ల పండుగలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు కొత్తపేట చౌరస్తా నుంచి లక్ష్మీనగర్ వరకు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అనిత, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్, సీనియర్ నాయకులు బేర బాలకిషన్, అరవింద్‌శర్మ, నగేష్, కొండల్‌రెడ్డి, ముద్దా పవన్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

తుక్కుగూడ: ప్రజా సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కేంద్రంలోని 13,14,15 వార్డుల్లో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తుక్కుగూడ ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతం ఫ్యాబ్‌సిటీ, ఈ-సిటీ, ఫార్మా సిటీ రాకతో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. ప్రభుత్వం ఎయిర్‌పోర్టు వరకు ఏర్పాటు చేసే మెట్రో రైలును ఇక్కడి వరకు పొడిగించాలని సీఎం కేసీఆర్‌ను కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రాం, డీఈఈ యాదయ్య, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు సప్పిడి లావణ్య, రవినాయక్, సుమన్, రాజు, తేజస్విని, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బీసీ కులాలకు న్యాయం చేయాలి

లిబర్టీ: తరతరాలుగా సంప్రదాయ వృత్తులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న అన్ని బీసీ కులాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష ఆర్థిక సాయం అందించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాజిక ప్రగతికి, ఆర్థిక అభివృద్ధికి నోచుకోని కులాలను గుర్తించి ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం 15 బీసీ కులాలకు మాత్రమే ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించి జీఓ జారీ చేసిందన్నారు. ఆ జీఓను సవరించి అన్ని బీసీ కులాలకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

నీటి వృథాను అరికట్టండి



జర్నలిస్టు కాలనీలో వృథాగా పోతున్న మంచినీరు

ఫిలింనగర్: మంచినీటి పైప్ లైన్ల లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదు. జూబ్లీహిల్స్ డివిజన్, జర్నలిస్టు కాలనీ చౌరస్తాలో మంచినీటి లైన్ లీకేజీ అయి వారం రోజులుగా నీరు వరదలా పారుతోంది. దీంతో ఈ దారి గుండా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

స్టిల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



బంజారాహిల్స్: స్టిల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలుగు టెలివిజన్ అండ్ డిజిటల్ మీడియా టెక్నీషియన్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పర్యవేక్షణలో లీగల్ అడ్వైజర్, ఎలక్షన్ ఆఫీసర్ కె.వి.ఎల్. నరసింహారావు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కే.వై.గిరిరాజ్, జనరల్ సెక్రటరీగా బి.కాంతారెడ్డి, కోశాధికారిగా ఇరిగి నర్సింగ్ రావు, ఉపాధ్యక్షులుగా నాగభూషణం, జగన్‌మోహన్, జాయింట్ సెక్రటరీగా ఉమేష్ గౌడ్ ఎన్నికయ్యారు.

కాలనీ సంక్షేమ సంఘం ఎన్నిక



విద్యావికాస్ నూతన కార్యవర్గం

శ్రీనగర్‌కాలనీ: విద్యావికాస్ రాజీవ్‌నగర్‌కాలనీ సంక్షేమ సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షుడిగా కృష్ణశర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పీఎస్ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా కె. వెంకటరమణ, కోశాధికారిగా మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శిగా ఎంవీ సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా బుజంగరావు, ఎం విజయానంద్, చంద్రశేఖర్‌రెడ్డి, బద్రుద్దీన్, గౌరవ సలహాదారుగా ఎం నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి, సమాజిక సేవా కార్యక్రమాలకు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

భర్త వేధింపులతో మహిళ ఆత్మహత్య

అమీర్‌పేట: భర్త వేధింపులు భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ఆంజనేయులు వివరాల ప్రకారం.. బల్కంపేట బీకేగూడలో రాధిక అలియాస్ ప్రవీణ (35) రామానంద్ నేతికర్ దంపతులు నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. రాధికకు తెలియకుండా వేరే మహిళతో అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్న రామానంద్ రెండేళ్లుగా భార్యను వేధిస్తూ వస్తున్నాడు. ఇటీవల సదరు మహిళను ఏకంగా ఇంటికి తీసుకురావడంతో రాధిక పుట్టింటికి వెళ్లిపోయింది. అయినా ఆగకుండా ఫోన్‌లు చేసి మరీ వేధించేవాడు. వేధింపులు ఎక్కువకావడంతో రాధిక ఈ నెల 9న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. తన కూతురు ఆత్మహత్యకు అల్లుడే కారణమని రాధిక తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సమస్యలతో స్వాగతం

నేటి నుంచి మోగనున్న బడిగంట

- కనీస వసతులు లేక విద్యార్థుల అవస్థలు
- ఇంకా పూర్తికాని మన బస్తీ-మనబడి పనులు
- ప్రమాదకరంగా ప్రాంగణాలు



ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న మన బస్తీ- మన బడి పథకం పనులు

బంజారాహిల్స్: నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. 2023-24 విద్యాసంవత్సరానికి గాను సోమవారం నుంచి బడిగంట మోగనుండగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు రాజ్య మేలుతున్నాయి. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సర్కారు బడుల్లో సమస్యలను పరిష్కరించాల్సిన అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఫలితంగా ఈ విద్యాసంవత్సరం కూడా విద్యార్థులు సహవాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో మన బస్తీ- మన బడి పథకం కింద పనులు కొనసాగుతున్నాయి. ఏడాది కాలంగా పనులు సాగుతుండగా రెండు వారాల క్రితం విధి నిర్వహణలో ఉన్న ఓ కార్మికుడు రెండో అంతస్తు నుంచి కిందపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పాఠశాలలు ప్రారంభమై ఉంటే విద్యార్థులు ప్రమాదం బారిన పడి ఉండేవారని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు కేవలం ఫిలింనగర్‌లోని ఎమ్మార్పీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మాత్రమే వంద శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా ఏ పాఠశాలలోనూ 60 శాతానికి మించి పనులు పూర్తి కాలేదు. ఖైరతాబాద్ విద్యాశాఖ జోన్ పరిధిలో 17 ప్రభుత్వ ఉన్నత, 47 ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఇందులో 99 శాతం పాఠశాలల్లో ఇప్పటకీ పనులు సాగుతూనే ఉన్నాయి. అసలే గత విద్యా సంవత్సరం సమస్యలతో సతమతమైన ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఈ ఏడాది కూడా తిప్పలు తిప్పేలా లేవు. సర్కారు బడుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిం



చాలరని పిల్లలను తమ బడుల్లో చేర్పించాలని ఇటీవల బడి బాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. తీరా క్షేత్ర స్థాయిలో మాత్రం ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి.

కేటాయించిన నిధులివీ..

షేక్‌పేట మండల పరిధిలో మన బస్తీ- మన బడి పథకం కింద తొమ్మిది పాఠశాలలు ఎంపిక చేశారు. ఇందులో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు, ప్రహరీ నిర్మాణం, టాయ్‌లెట్ల నిర్మాణం, గేట్ల ఏర్పాటు, గోడలకు రంగులు వేయడం తదితర పనులు చేపట్టాల్సి ఉంటుంది. బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ. 21.50 లక్షలు, ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ఉన్నత పాఠశాలకు రూ. 45.32 లక్షలు, బంజారాహిల్స్ రోడ్ నెం. 12 ఎన్బీటీ నగర్ హైస్కూల్‌కు రూ. 48.45 లక్షలు, షేక్‌పేట హైస్కూల్‌కు రూ.15.89 లక్షలు, గతి ప్రాథమిక పాఠశాలకు రూ. 20.04 లక్షలు, ఫిలింనగర్ దుర్గా భవానీనగర్ తెలుగు మీడియం స్కూల్‌కు రూ. 1.67 లక్షలు, ఎమ్మార్పీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు రూ. 23.92 లక్షలు, ఎన్బీటీ నగర్ ప్రైమరీ స్కూల్‌కు రూ. 19.47 లక్షలు, షేక్‌పేట ప్రైమరీ స్కూల్‌కు రూ. 23.47 లక్షలు కేటాయించారు.రూ. 30 లక్షల్లోపు నిధులు మంజూరైన పాఠశాలల్లో స్కూల్ మేనేజింగ్ కమిటీల ఆధ్వర్యంలో ఈ పథకం కింద పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఇలా రూ. 30 లక్షల్లోపు నిధులు మంజూరైన పాఠశాలలు మండల పరిధిలో ఏడు ఉన్నాయి. మిగతావన్నీ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించాల్సి ఉంటుంది. స్కూల్ మేనేజింగ్ కమిటీల చైర్మన్ల పర్యవేక్షణలో మన బస్తీ-మన బడి పథకం కింద ఈ అభివృద్ధి పనులు జరిగే విధంగా జీఓ జారీ చేశారు. ఆ మేరకు ఆయా పాఠశాలల్లో పనులు జరగాల్సి ఉండగా కొన్ని పాఠశాలలకు ఎస్ఎంఎస్ కమిటీలు లేనట్లుగా సమాచారం.

మధురానగర్ పీఎస్ పరిధిలోని సెక్టార్లు...ఎస్ఐల వివరాలివీ

వెంగళరావునగర్: నూతనంగా ఏర్పాటు చేసిన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధితో పాటుగా ఆయా సెక్టార్లలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐల వివరాలను స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఓ) బురుగు శ్రీనివాస్ విలేకరులకు తెలిపా. వివరాలు ఇలా ఉన్నాయి.....

సెక్టార్ : 1 ఎస్ఐ ఎల్.నరేందర్, సెల్ : 87126 61589

సెక్టార్ పరిధి: వెస్ట్ రహమత్‌నగర్, బంగారుమైసమ్మ దేవాలయం, బ్రహ్మశంకర్‌నగర్, ఓంనగర్, కార్మికనగర్ సౌత్, ముబారక్ కేఫ్, ఎస్‌డి పాయింట్.

సెక్టార్ : 2 ఎస్ఐ : బి.బాలరాజు, సెల్: 87126 61588

సెక్టార్ పరిధి: జవహర్‌నగర్, మసీదుగడ్డ, కళ్యాణ్‌నగర్ సౌత్, జీటీఎస్ కాలనీ, యాదగిరినగర్, వీడియోగల్లీ, జానకమ్మతోట, కృష్ణకాంత్‌పార్కు, యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు.

సెక్టార్ : 3 ఎస్ఐ పి.యుగంధర్, సెల్ : 87126 61590

సెక్టార్ పరిధి: వెంగళరావునగర్, వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీ, సిద్ధార్థనగర్, మధురానగర్, యూసుఫ్‌గూడ బస్తీ, మధురానగర్ మెట్రో స్టేషన్, మైత్రీవనం చౌరస్తా, ఎల్లారెడ్డిగూడ, ఆర్‌బీఐ క్వార్టర్స్, అంబేద్కర్‌నగర్, జయప్రకాశ్‌నగర్, అమీర్‌పేట మెట్రోస్టేషన్.

సిబ్బంది సంఖ్య :	ఇన్‌స్పెక్టర్ : 1
సబ్ ఇన్‌స్పెక్టర్లు	: 4
అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు	: 4
హెడ్ కానిస్టేబుల్స్	: 10
కానిస్టేబుల్స్	: 32
హోం గార్డులు	: 11
ఎస్పీఓలు	: 3
డీఎస్ఐ	: ఇంకా రిపోర్టు చేయలేదు



మధురానగర్ పోలీసుస్టేషన్

స్టేషన్ హౌస్ ఆఫీసర్: బి.శ్రీనివాస్, సెల్ : 87126 65188

అడ్మిన్ ఎస్ఐ : కె.ఉదయ్, సెల్ : 87126 61589

మధురానగర్ పీఎస్ ల్యాండ్‌లైన్ (పెట్రోకార్-1) : 91543 26450

పెట్రోకార్ – 2 : 91543 26451

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో నిరంతరం శాంతిభద్రతలు కాపాడటమే ప్రథమ కర్తవ్యమని ఇన్‌స్పెక్టర్ అన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ సత్వర న్యాయం జరిగే విధంగా శాయశక్తులు లేకుండా ప్రయత్నిస్తామన్నారు. ముఖ్యంగా పేదలకు తగిన న్యాయం చేస్తామన్నారు. ఎవరైనా చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలంతా కలిసిమెలిసి ఉంటూ పోలీసులకు సహకరించాలని, ప్రజా సహకారం లేనిదే చట్టాలు అమలు చేయడం కష్టమన్నారు. స్టేషన్‌లోని ప్రతి ఒక్కరూ ఫ్రెండ్లీ పోలీసుగా ఉంటారని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని సూచించారు.

– ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

అభివృద్ధిపై విస్తృతంగా ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను బూత్ స్థాయినుంచి ప్రచారం చేయాల్సిన బాధ్యత నాయకులపై ఉందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎస్పీఆర్‌హిల్స్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులపై క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లకు సూచించారు. రాబోయే ఎన్నికలే లక్ష్యంగా ప్రతి కార్యకర్త శ్రమించాలన్నారు. డివిజన్ కమిటీ నాయకులు బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లతో సమన్వయం చేసుకుంటు పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, నజీర్, మాజీ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ బషీర్, ధనూజ, జాఫర్ హుస్సేన్, జబ్బార్, రవిశంకర్, అబ్దుల్ గనీ, రాకేష్, వివియం , జగన్, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు

వెంగళరావునగర్: సినీ రంగంలో, రాజకీయ రంగాల్లో సైతం తండ్రికి తగ్గ తనయుడు నందమూరి బాలకృష్ణ అని బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షులు జంగా శ్రీధర్ అన్నారు. బాలకృష్ణ పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం మధురానగరకాలనీలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసి స్థానికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సినిమా రంగంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం నేతలు, నియోజకవర్గ టీడీపీ నేతలు మల్లిఖార్జున్, రత్నాకర్, కిలారి హరిబాబు, దొడ్డపనేని సత్తిబాబు, కోటిరెడ్డి, రాఘవ, సతీష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

ఖైరతాబాద్: జీహెచ్ఎంసీ, ఓక్నోవా స్కూల్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఓల్డ్‌సీఐబి క్వార్టర్స్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందజేశారు. స్థానిక బస్తీల నుంచి మొత్తం 70 మంది విద్యార్థులు కరాటే, కిక్‌బాక్సింగ్, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందారు. కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టీం కోచ్ లక్ష్మి, కరాటే సీనియర్ కోచ్ రవి, మహేందర్‌బాబు, మహేష్ యాదవ్, బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ అనిల్‌కుమార్, ప్రెసిడెంట్ జ్ఞానేశ్వర్ యాదవ్, సెక్రటరి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శివలాల్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కరాటే డ్రెస్‌లు అందజేశారు.

వరద, బురద సమస్యలను పరిష్కరించండి



రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు ప్రచారం చేస్తున్న ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి

బంజారాహిల్స్: హైదరాబాద్‌ను టోక్యోను చేస్తామని మంత్రి కేటీఆర్ ఇటీవల ఓ సమావేశంలో పేర్కొన్నారు.. వర్షాకాలం వచ్చినందున ముందు వరద నీటి కాల్వలు బాగు చేయాలని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలపై ఆదివారం ఖైరతాబాద్‌లోని బస్తీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలోనూ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌ను డల్లాస్ సిటీగా మారుస్తామని చెప్పారని ఏడేళ్లు గడుస్తున్నా నగరం ఇంకా సమస్యల వలయంలోనే విలవిల్లాడుతుందని ఆరోపించారు. వానాకాలం వస్తుందంటేనే హైదరాబాద్‌వాసులు వణికిపోతున్నారని ముందు వరద, బురద సమస్యల నుంచి తమను కాపాడాలని ఆ తర్వాత టోక్యో, డల్లాస్ సిటీలుగా మార్చాలని హితవు పలికారు. హైదరాబాద్‌లో సమస్యలు కుప్పలు తెప్పలుగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టి మరోసారి ఓట్లు పొందాలని చూస్తున్నారని ఈ సారి బుద్ధి చెప్పడానికి ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.

పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు

రహమత్‌నగర్(బోరబండ): రౌడీ షీటర్లు పద్ధతి మార్చుకుని బుద్ధిగా ఉండాలని లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బోరబండ ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ హెచ్చరించారు. శనివారం రాత్రి బోరబండ పీఎస్‌లో స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రాబోయే పండుగల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించరాదన్నారు. రౌడీ షీటర్లు తమ వైఖరి మార్చుకోవాలని సూచించారు. రౌడీ షీటర్ల వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తనకు ఫోన్ ద్వారా, నేరుగా గానీ తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సెక్టార్ ఎస్ఐలు స్వప్నారెడ్డి, మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

పోతరాజుల ఆభరణాలు, దుస్తులకు పూజలు

గోల్కొండ: పోతరాజుల వృత్తి వంశపార్యపరంగా కొనసాగిస్తున్నామని పోతరాజు తల్వార్ శివ అన్నారు. ఆదివారం గోల్కొండ రిసాలబజార్‌లోని శివాలయ ప్రాంగణంలో పోతరాజుల ఆభరణాలు, దుస్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం అమ్మవార్లపై ఉన్న భక్తి, పోతరాజు వృత్తిపై మమకారంతోనే తాము ఈ వృత్తిలో కొనసాగుతున్నామన్నారు. చాలీచాలని ఆదాయంతోనే జీవితం సాగిస్తున్నామని ఆయన అన్నారు. శ్రీ గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆలయ వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబా చారి మాట్లాడుతూ.. పోతరాజులకు ప్రభుత్వం ప్రతినెలా గౌరవ వేతనం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. ఈనెల 22న ఈసారి రిసాలబజార్ నుంచి మహంకాళి అమ్మవారి జులూస్ ప్రాంభమవుతుందని, శ్రీకాంత్ చారి ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ ఊరేగింపులో 57 మంది పోతరాజుల విన్యాసాలు ఈ ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పోతరాజులు భరత్, నగేష్, నరేష్, రాజు, శ్రీకాంత్ తదితరులున్నారు.

అటెన్షన్ ప్లీజ్

రాడ్లు ఉన్నాయి.. జాగ్రత్త

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2 కేబీఆర్ పార్కు చౌరస్తాలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ ముందు ఫ్రీ లెఫ్ట్‌లో వాహనాలు తేలికగా వెళ్లేందుకు సిగ్నల్ వద్ద వాహనాలను, ఫ్రీ లెఫ్ట్ వాహనాలు వేరే చేసే క్రమంలో బొల్లార్డ్స్ ఏర్పాటు చేశారు. ఈ బొల్లార్డ్స్‌ను కలిపే రాడ్లు ప్రమాదకరంగా బయటికి పొడుచుకు రావడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు స్పందించి వీటికి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేని పక్షంలో వేగంగా వచ్చే వాహనదారులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.



ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ ముందు ప్రమాదకరంగా బొల్లార్డ్స్ రాడ్‌లు

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు, స్కాలర్‌షిప్ అందజేస్తున్న జగన్ గురుజీ తదితరులు

ఖైరతాబాద్: వాసవి సేవా కేంద్రం విద్యా సహాయ నిధి ఆధ్వర్యంలో ఆదివారం ఖైరతాబాద్ వాసవీ సేవా కేంద్రంలో 400 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, స్కాలర్‌షిప్ అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యోగ విజ్ఞాన కేంద్రం జగన్ గురూజీ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థను కాపాడటంలో స్త్రీల పాత్ర కీలకమన్నారు. ఆహ్లాదంగా ఉండాలంటే వైదిక విధులు పాటించడంతో పాటు సాంప్రదాయాలకు, నిన్నటితరం విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చిన్నారులను సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడంలో తల్లి ప్రధాన భూమిక పోషించాలన్నారు. సేవా కేంద్రం అధ్యక్షుడు ఆలంపల్లి రవికుమార్ మాట్లాడుతూ వాసవీ సేవాకేంద్రం 50 ఏళ్ల పూర్తిచేసుకుందన్నారు. ఏటా దాదాపు రూ.4 కోట్ల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో అన్ని వర్గాల వారికి మన సాయం అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా తెలుగుంట్ల రమేష్ గుప్తా హాజరయ్యారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు స్కూల్ బ్యాగులతో పాటు రూ 3500 స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, విద్యా సహాయ నిధి చైర్మన్ గందె హనుమంత రావు, కొండ్లె మల్లికార్జున్, కాసనగొట్టు రాజశేఖర్ గుప్త, పంపాటి జ్ఞాన చందర్, కొల్పూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్ చేస్తే రూ. వెయ్యి జరిమానా

వెంకటేశ్వరకాలనీ: కేబీఆర్ పార్కుకు వచ్చే వాకర్లు, సందర్శకులు తమ కార్లను పార్కు చుట్టూ సింగిల్ లైన్‌లో పార్కింగ్ చేస్తుంటారు. అయితే రోడ్డు పక్కన అక్రమ పార్కింగ్‌లు చేస్తే రూ. 1000 జరిమానా విధిస్తామంటూ తాజాగా బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కేబీఆర్ పార్కుకు వచ్చే వాకర్లు, సందర్శకుల సంఖ్య పెరుగుతుండటంతో ఆ మేరకు వాహనాలు కూడా పెరుగుతోంది. పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలుపుకోవడానికి స్థలం సరిపోవడం లేదు. ఫలితంగా రోడ్లపక్కనే అక్రమ పార్కింగ్‌లు చేసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. రోడ్లపక్కన వాహనాలు నిలపడం వల్ల ట్రాఫిక్ స్తంభించిపోతుందని పెద్ద ఎత్తున ఫిర్యా దులు అందుతుండటంతో ట్రాఫిక్ ఉన్నతాధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాకర్లు కొందరు ఇష్టానుసారంగా తమ వాహనాలను ఫ్రీ లెఫ్ట్‌లలో పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఈ నేపథ్యంలో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు.



కేబీఆర్ పార్కు వద్ద ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు

డ్రైనేజీని తలపిస్తున్న భద్రుకా సెల్లార్



మురుగుతో నిండిన భద్రుకా అపార్ట్‌మెంట్ సెల్లార్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 కమాన్ ఎదురుగా ఉన్న భద్రుకా ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో గత కొంత కాలంగా డ్రైనేజీ పొంగి పొర్లుతూ సెల్లార్‌ను ముంచెత్తడమే కాకుండా దుర్వాసనతో అపార్ట్‌మెంట్ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ అపార్ట్‌మెంట్‌ను ఆనుకుని నిర్మించిన ఓ షట్టర్ కింది నుంచి డ్రైనేజీ మ్యాన్‌హోల్, పైపులైన్ లీకవుతూ ఈ సమస్యకు కారణమవుతున్నాయని అపార్ట్‌మెంట్ వాసులు ఆరోపిస్తున్నారు. సమస్యను పలుమార్లు జలమండలి అధికారుల దష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మూడేళ్లుగా తాము ఈ సమస్యతో సతమతమవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళాకారులు, కవుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కార్పొరేటర్ లక్ష్మిబాల్‌రెడ్డి

అమీర్‌పేట: తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా సాహిత్య దినోత్సవ కవి సమ్మేళనం నిర్వహించారు.ఎస్ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమం కోసం తీసుకువచ్చిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేసిన మంచి పనులను ప్రజలు మర్చిపోరని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం సాధించిన ప్రగతిని కవులు కవిత్వాల రూపంలో వివరించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి భానుప్రసాద్, సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షులు మానిక్‌రావు పాటిల్, ఆర్.సి.కుమార్ పాల్గొన్నారు.

'బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం'

లంగర్‌హౌస్: బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆరెళ్ల జగదీష్‌యాదవ్ అన్నారు. గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్‌గా లంగర్‌హౌస్‌కు చెందిన ఆరెళ్ల జగదీష్ యాదవ్‌ను దేవాదాయ శాఖ నియమించింది. జగదీష్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో తొలి బోనం సమర్పించి బోనాల ఉత్సవాలు ప్రారంభించేది గోల్కొండ జగదాంబిక ఆల యం నుంచే అన్నారు. ఈనెల 22వ తేదీ లంగర్‌హౌస్ నుంచి ప్రారంభమయ్యే బోనాల ఉత్సవాల్లో భక్తులు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా గతంలో పెద్దల అనుభవాలను, సలహాలను కూడా తెలుసుకుంటూ మరింత ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తామన్నారు.

క్లుప్తంగా...

అప్పన్న సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ సంజయ్ కిషన్‌కౌల్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు వీరికి ఘన స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ దంపతులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో న్యాయమూర్తి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు.

రామ్‌రాజ్ షోరూంను ప్రారంభించిన హీరో వెంకటేష్



కష్టమర్లకు వస్త్రాలు అందిస్తోన్న వెంకటేష్

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): రామ్‌రాజ్ కాటన్ సంస్థ సంప్రదాయ వస్త్రాలు తయారు చేస్తూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతోందని సినీ హీరో దగ్గుబాటి వెంకటేష్ అన్నారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ 250వ షోరూంను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాటన్ దుస్తులు ధరిస్తే శరీరానికి హాయిగా ఉండటమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షించినట్లు అవుతోందన్నారు. నెల్లూరులో 100వ షోరూంను కూడా తానే ప్రారంభించానన్నారు. రామ్‌రాజ్ కాటన్ సంస్థ చైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ.. ధోతీలు, షర్ట్‌లు, ఇన్నర్ వేర్‌లు, నైట్‌వేర్, ఫ్యాబ్రిక్స్, కిడ్స్ అండ్ ఉమెన్స్ వేర్‌లతో పాటుగా అన్ని రకాల శుభకార్యాలకు అవసరమైన వస్త్రాలు తమ షోరూంలో అందుబాటులో ఉంటాయన్నారు.

రాయలసీమను తాకిన రుతుపవనాలు

రెండు రోజుల్లో మిగిలిన ప్రాంతాలకు విస్తరించే అవకాశం

సాక్షి, అమరావతి/తిరుమల: నైరుతి రుతు పవనాలు ఏపీలోకి ప్రవేశించాయి. ఆదివారం రాయలసీమలోని పలు ప్రాంతాలను రుతుపవనాలు తాకాయి. రుతు పవనాలు కేరళను తాకిన తర్వాత ఏపీకి రావడానికి సాధారణంగా నాలుగు రోజుల సమయం పడుతుంది. ఈ నెల 8వ తేదీన అవి కేరళలో ప్రవేశించగా.. 12వ తేదీ నాటికి ఏపీకి వస్తాయని భావించారు. కానీ.. బిపర్‌జోయ్ తుపాను కారణంగా అవి చురుగ్గా కదలడంతో ఒకరోజు ముందుగానే ఏపీని తాకాయి. ఆదివారం తిరుపతి జిల్లా శ్రీహరికోట మీదుగా ఏపీలోకి ప్రవేశించాయి. వచ్చే 48 గంటల్లో అవి రాయలసీమలోని మిగిలిన ప్రాంతాలు, కోస్తాలోని పలు ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉంది. వారం రోజుల్లో మొత్తం రాష్ట్రమంతా విస్తరిస్తాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. రుతు పవనాల వల్ల ఈసారి సాధారణ వర్షపాతం నమోదవుతుందని ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించింది. కాగా, రుతు పవనాలు ఏపీ అంతా విస్తరించే వరకు ఉష్ణోగ్రతలు కొనసాగనున్నాయి. అంటే మరో వారం రోజులపాటు పలు ప్రాంతాల్లో ఎండల తీవ్రత, వడగాలులు ఉండనున్నాయి.



తిరుమలలో ఆదివారం వెండి మబ్బులు ఆవరించిన నీలాకాశం

మబ్బుల 'సన్'దడి

తిరుమలలో ఆదివారం ఉదయం నుంచే నీలాకాశం మబ్బులతో నిండిపోయింది. వెండి మబ్బులు దోబూచులాడుతూ భానుడితో ఆటలాడడం ప్రారంభించాయి. సాయంత్రానికి మరిన్ని మబ్బులు చేరి సందడి చేశాయి. దాదాపు రెండు నెలలపాటు ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు కాస్త ఉపశమనం కలిగినట్టింది.

బీజేపీయే మా ప్రథమ శత్రువు



కొత్తగూడెం సభలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, వేదికపై నారాయణ తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

అమ్ముడుపోయారని, పోరాటాలు మరిచిపోయారని విమర్శించడం బండి సంజయ్‌కు తగదన్నారు. తన పదవి ఉంటుందా, ఊడుతుందా అనే దానిపై సంజయ్ దృష్టి సారిస్తే మంచిదని అన్నారు. రోజుకో పార్టీ మారేవాళ్లు, అధికారం కోసం పశువుల్లా వ్యవహరించే వాళ్లు, ఏసీ రూముల్లో కూర్చునే వాళ్లు.. తమకు నీతులు చెబుతారా అంటూ నిప్పులు చెరిగారు. కమ్యూనిస్టుల ఊపిరిలోనే పోరాటం ఉందని ఆయన పేర్కొన్నారు.

ప్రజల గోడు కేసీఆర్ వినాలి

తెలంగాణ ఏర్పాటుకు మొదటగా మద్దతు పలికిన జాతీయ పార్టీ సీపీఐ అని కేసీఆర్ ఎన్నో సార్లు చెప్పారని, కానీ ఈ రోజు దశాబ్ది ఉత్సవాల్లో తమ ఊసే లేకుండా పోయిందని కూనంనేని అన్నారు. ఓ తండ్రిలా రాష్ట్ర ప్రజల కష్టసుఖాలను వినాల్సిన బాధ్యత సీఎం కేసీఆర్‌పై ఉందని, బాధలు చెప్పుకునే అవకాశం ప్రజలకు ఇవ్వాలని సూచించారు. అంతర్గత కుమ్ములాటను చక్కదిద్దుకుంటే తప్ప బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిలబడలేదని పేర్కొన్న ఆయన.. ప్రస్తుతం కేసీఆర్ రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా బలంగా నిలబడ్డారని చెప్పారు.

ఫ్రంట్‌లో చేరకపోతే సందేహాలొస్తాయి..

బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఏర్పడుతున్న ఫ్రంట్‌లోకి రావాలని ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కోరారు. లేదంటే బీజేపీకి వ్యతిరేకంగా కేసీఆర్ చేస్తున్న పోరాటంపై సందేహాలకు ఆస్కారం ఉంటుందని అన్నారు. ఇటీవల బీజేపీపై విమర్శల వాడిని కేసీఆర్ తగ్గించారని, కానీ ఒక్కసారి బీజేపీకి లొంగిపోతే మరింతగా బీఆర్ఎస్‌పై బీజేపీ దాడి చేస్తుందని చెప్పారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని బీజేపీకి వ్యతిరేకంగా మరింత గట్టిగా పోరాటం చేయాలని కేసీఆర్‌కు సూచించారు.

మేము ఏమైనా సన్యాసులమా..?

ప్రజాగర్జన సభను కొందరు ఎన్నికల బహిరంగ సభ అంటున్నారని, మేము ఎన్నికల బహిరంగ సభ పెడితే తప్పేమిటని నారాయణ ప్రశ్నించారు. 'మేము రాజకీయ పార్టీ నడిపిస్తున్నాం. అసెంబ్లీ, పార్లమెంట్‌లో మా సభ్యులు ఉండాలని కోరుకుంటున్నాం. అలాంటప్పుడు మేము ఎన్నికల బహిరంగ సభ పెడితే తప్పేంటి. మేము ఏమైనా సన్యాసులమా? రాజకీయ ఆకాంక్షలు లేకుండా ఉండటానికి..' అని ప్రశ్నించారు.

పొత్తుల చర్చ వస్తే చంద్రబాబు ల్యాప్‌టాప్ ఓపెన్ చేస్తారు..

'ఎన్నికల పొత్తులో భాగంగా సీట్ల కేటాయింపుల అంశం చర్చకు వస్తే చంద్రబాబు లాప్‌టాప్ ఓపెన్ చేస్తారు. ఏ సీటులో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయో అంటూ లెక్కలు వివరించడం మొదలెడతారు. గతంలో ఓసారి నాకు కూడా ఇలాగే ల్యాప్‌టాప్ పాఠాలు చెప్పేందుకు ప్రయత్నించాడు. నేను వెంటనే హే! ఆపవయ్యా బాబు.. నీకు పూర్తి బలం ఉంటే మాతో ఎందుకు పొత్తు పెట్టుకుంటున్నావ్? అని అడిగా..' అని నారాయణ చెప్పారు.

మోదీకి 30 మంది దత్తపుత్రులు

నాకు కుటుంబం లేదని, కుటుంబాలు ఉన్న కేసీఆర్ వంటి నేతలు అవినీతికి పాల్పడుతుంటారని మోదీ తరచుగా విమర్శలు చేస్తుంటారు కానీ, మోదీకి 30 మంది దత్త పుత్రులు ఉన్నారని, వీరంతా కార్పొరేట్ శక్తులుగా బ్యాంకులను దోచుకుంటున్నారని నారాయణ ఆరోపించారు. మోదీ గద్దెం పెరుగుతున్నట్టుగా దేశంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని విమర్శించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపైనా ఆరోపణలు చేశారు. కేంద్ర కేబినెట్‌లో 24 మంది క్రిమినల్స్ ఉన్నారని పేర్కొన్నారు.

ఏపీలో 20 ఎంపీ సీట్లు గెలవాలి

- విశాఖ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- ఏపీలో అవినీతి పాలన సాగుతోంది
- ఏపీకి కేంద్రం ఎంతగానో సహకారం
- భారీగా నిధులు, కేంద్ర సంస్థలను ఇచ్చాం
- కేంద్రంలో అవినీతికి తావులేని పాలన
- అందుకే ఆంధ్ర ప్రజల ఆశీర్వాదం కోరుతున్నాం
- వచ్చే ఎన్నికల్లో బీజేపీకి 300 లోక్‌సభ స్థానాలు ఖాయం



సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి అమిత్‌షా

సాక్షి, విశాఖపట్నం: వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో 20 ఎంపీ స్థానాలు గెలవాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. రాష్ట్రానికి కేంద్రం సహకరిస్తున్నందునే అభివృద్ధి సాధ్యమైందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి.. వారి ఆశీర్వాదం కోరాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నాలుగేళ్లుగా అవినీతి ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ ఆదివారం సాయంత్రం విశాఖలో మహాజన సంపర్క్ అభియాన్ సభ నిర్వహించింది. విశాఖ రైల్వే గ్రౌండ్స్‌లో జరిగిన ఈ సభకు అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై విమర్శలు, ఆరోపణలు గుప్పించారు. ఈ నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం అవినీతి ఆరోపణలను, కుంభకోణాలను ఎదుర్కొంటోందన్నారు. రైతుల ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందన్నారు. ప్రధాని మోదీ ఇచ్చే సొమ్ముతో సీఎం జగన్ రైతు భరోసా పేరిట రైతులను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. పేదలకు కేంద్రం ఇచ్చే బియ్యం పథకంపై జగన్ ఫొటో వేసుకుంటున్నారన్నారు. విశాఖ.. సమాజ విరోధ శక్తులకు అడ్డాగా మారిందని, భూ మాఫియా పెరిగిందని విమర్శించారు.

తొమ్మిదేళ్లలో రూ.10 లక్షల కోట్లు

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోందని కేంద్ర మంత్రి అమిత్‌షా అన్నారు. ఏపీకి భారీగా నిధులు కేటాయించడంతో పాటు ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ, ఎయిమ్స్, మెడికల్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీ, సెంట్రల్, ట్రైబల్ యూనివర్సిటీలు వంటి పలు కేంద్ర సంస్థలను మంజూరు చేసిందని చెప్పారు. 2009 – 2014 వరకు యూపీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు పన్నులు, గ్రాంట్ల రూపంలో రూ.78 వేల కోట్లు ఇస్తే మోదీ పాలన తొమ్మిదేళ్లలో సుమారు రూ.10 లక్షల కోట్లు ఇచ్చారని తెలిపారు. 2014 నాటికి రాష్ట్రంలో నాలుగు వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా, ఇప్పుడవి 9 వేల కిలోమీటర్లకు విస్తరించాయన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం కోసం రూ.3 లక్షల కోట్లు ఖర్చు చేశారని, దీనికి అదనంగా సాగరమాల పథకంలో జాతీయ రహదారులకు రూ.85 వేల కోట్లు వెచ్చించామని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో పాటు విశాఖ-సికింద్రాబాద్, తిరుపతి-సికింద్రాబాద్‌ల మధ్య వందేభారత్ రైళ్లు, కాకినాడలో బల్క్ డ్రగ్ పార్క్ వంటివి ప్రధాని మోదీ మంజూరు చేశారని చెప్పారు. విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, అమరావతిలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. విశాఖ, అనంతపురంలలో మల్టీపర్పస్ లాజిస్టిక్ పార్కులు ఏర్పాటవుతున్నాయన్నారు.

కుంభకోణాలకు తావులేని పాలన

దేశంలో 2004 నుంచి 2014 వరకు సోనియాగాంధీ నేతృత్వంలోని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్ల అవినీతికి, ఎన్నో కుంభకోణాలకు పాల్పడిందని, అందుకు బాధ్యులపై చర్యలూ తీసుకోలేదని అమిత్ షా ఆరోపించారు. నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క అవినీతి కుంభకోణం జరగలేదన్నారు. పైగా ప్రపంచ దేశాల్లో భారత్ గౌరవాన్ని మోదీ పెంచారన్నారు. మోదీ ప్రధాని అయ్యాక దేశంలో ప్రతి ఇంటికి విద్యుత్, మరుగుదొడ్డి సదుపాయం కల్పించారన్నారు. కోవిడ్ మహమ్మారి నిరోధానికి 230 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్లు ఉచితంగా వేయించారని తెలిపారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేస్తే అక్కడ రక్తం ఏరులై పారుతుందని రాహుల్‌గాంధీ అన్నారని, ఆ తర్వాత పరిణామాలతో ఆయన అంచనా తప్పని తేలిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ 300 లోక్‌సభ స్థానాలు దక్కించుకుంటుందని జోస్యం చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఆ పార్టీ నేతలు సత్యకుమార్, పురందేశ్వరి, విష్ణుకుమార్‌రాజు తదితరులు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ సభలో కేంద్ర మంత్రి మురళీధరన్, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేతలు సునీల్ ధియోదర్, జీవీఎల్ నరసింహారావు, టీజీ వెంకటేష్, సీఎం రమేష్, సుజనాచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తెగి నిలిచిన రైళ్లు

బెల్లంపల్లి: విద్యుత్ ఇంజన్‌కు ప్రమాదశాత్తూ ఓవర్ హెడ్ ఎలక్ట్రిక్ తీగ చుట్టుకుని తెగిపోవడంతో మంచిర్యాల జిల్లా బెల్లంపల్ల – మందమర్రి రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం మధ్యాహ్నం 3 గంటలపాటు రైళ్లు నిలిచిపోయాయి. ఈ ఘటనతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. రైల్వే అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. గోరఖ్‌పూర్ – మహబూబ్‌నగర్ (నెంబర్ 05303) సమ్మర్ స్పెషల్ ట్రైన్ బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌కు మధ్యాహ్నం 2:48 గంటలకు చేరుకుంది. మంచిర్యాల వైపు వెళ్తుండగా.. బెల్లంపల్లి – మందమర్రి రైల్వేస్టేషన్ల మధ్య 2:55 గంటలకు రైలు ఇంజిన్‌కు ఓహెచ్ఈ తీగ చుట్టుకుని తెగిపోయింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి రాళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే ఉన్నతాధికారులు రైల్వే ఇంజనీరింగ్, ఇతర విభాగాల సిబ్బందిని రంగంలోకి దింపారు. సాయంత్రం 5:50 గంటలకు మరమ్మతులు పూర్తి కావడంతో రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.

నిలిచిపోయిన రైళ్లు ...

కోర్బా – కొచ్చివెల్లి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హజ్రత్ నిజాముద్దీన్ – బెంగళూరు రాజధాని ఎక్స్‌ప్రెస్, సిర్పూర్(టీ) – భద్రాచలం రోడ్ సింగరేణి ప్యాసింజర్ రైళ్లతోపాటు గోరఖ్‌పూర్–మహబూబ్‌నగర్ సమ్మర్ స్పెషల్ నిలిచిపోయాయి.

నగర వార్తలు

అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలకు నగర స్విమ్మర్ ఎంపిక



కాచిగూడ: అంతర్జాతీయ అండర్ వాటర్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్‌కు తెలంగాణ నుంచి నగరంలోని బర్కత్‌పురాకు చెందిన స్విమ్మర్ గంధం క్వీని విక్టోరియా ఎంపికైంది. ఈ నెల 24 నుంచి 27 వరకు ఈజిప్ట్ రాజధాని కైరోలో జరిగే ఈ పోటీలకు భారత్ తరపున ఈమె పాల్గొననుంది. రాష్ట్రం నుంచి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొననున్న తొలి స్విమ్మర్‌గా క్వీని విక్టోరియా రికార్డు కెక్కింది. 2022 ఆగస్టు 7,8 తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపడంతో ఈమెను అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా క్వీనికి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, పలువురు ప్రముఖులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

నిబంధనలు పాటించని సెలూన్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

సంతోష్‌నగర్: సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం సాయంత్రం ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సెన్సేషనల్ సెలూన్‌పై దాడులు నిర్వహించారు. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా సేవలందిస్తున్నట్లు గుర్తించారు. ఇందులో భాగంగా నలుగురు మహిళలు, ముగ్గురు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3 వేల నగదు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రైల్వే సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



విజయపురి కాలనీ నుంచి లాలాగూడ పోలీస్‌స్టేషన్ వైపు వెళ్లే రోడ్డు మార్గాన్ని ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి

అడ్డగుట్ట: సికింద్రాబాద్ నియోజకవర్గంలోని రైల్వే సంబంధిత సమస్యల పరిష్కారం కోసం అధికారులకు దిశానిర్దేశం చేశామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. లాలాపేట, విజయపురి కాలనీల్లో రైల్వే సంబంధిత సమస్యలతో పాటు పనులు జరుగుతున్న ప్రాంతాలను అధికారులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విజయపురి కాలనీ నుంచి లాలాగూడ పోలీస్‌స్టేషన్ వైపు వెళ్లే రోడ్డు మార్గాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, రైల్వే ట్రాక్ ఉన్న ప్రాంతాల్లో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. విజయపురి కాలనీ నుంచి లాలాగూడ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనాల రాకపోకలకు మాత్రమే అనుమతి ఉండేదని, ప్రస్తుతం కార్లు, ఆటోలు కూడా వెళ్లే విధంగా గేటు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ గేటు తెరిచి ఉంటుందన్నారు. అదే విధంగా లాలాపేటలోని రైల్వేకు సంబంధించిన రోడ్డు సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ విశ్వనగరంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కొత్త లేఅవుట్‌లు చేసేటప్పుడు పిల్లలకు ఆటస్థలాలు తప్పనిసరిగా ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. అనంతరం ఆయన లాలాగూడ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పోలీస్ అధికారులతో కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, సతీష్‌గౌడ్, చంద్రారెడ్డి, పోచయ్య, వీరన్న, ప్రకాష్‌గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

'లంగ్ కేన్సర్'ను ప్రాథమిక దశలో గుర్తించేదే 'ఇబస్'

- కేన్సర్లపై అంతర్జాతీయ సదస్సులో వైద్యాధికారుల అభిప్రాయం



సదస్సులో పాల్గొన్న వైద్యాధికారులు

గచ్చిబౌలి: 'లంగ్ కేన్సర్'ను ప్రాథమిక దశలోనే గుర్తించి, నిర్ధారించేదే 'ఇబస్' (ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్) అని వైద్యాధికారులు అభిప్రాయపడ్డారు. యశోద ఆస్పత్రుల ఆధ్వర్యంలో హైటెక్‌సిటీలో అత్యాధునిక ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్ (ఇబస్), శ్వాసకోశ కేన్సర్లపై అంతర్జాతీయ సదస్సు, లైవ్ వర్క్‌షాప్‌ను ఆదివారం నిర్వహించారు. అత్యాధునిక లంగ్ కేన్సర్ నిర్ధారణ, చికిత్స ప్రక్రియలకు సంబంధించి దేశంలోని ప్రధాన పల్మనాలజిస్ట్‌కు ఉన్నత స్థాయి శిక్షణ ఇచ్చేందు కు 'ఇబస్–మాస్టర్ క్లాస్' పేరిట ఇంట్రవెన్షనల్ పల్మోనాలజీ విభాగం ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. యశోద గ్రూప్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ రావు మాట్లాడుతూ, ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్ (ఇబస్)కు సంబంధించి మనదేశంలో అగ్రగామిగా ఉన్న యశోద ఆస్పత్రులు దేశవ్యాప్తంగా ఉన్న పల్మోనాలజిస్టులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో ఈ అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేసిందన్నారు. యశోద ఆస్పత్రి హైటెక్‌సిటీ సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ వి నాగార్జున మాటూరు మాట్లాడుతూ, మన దేశంలో పురుషుల మరణాలకు కారణమవుతున్న కేన్సర్లలో ఊపిరితిత్తుల కేన్సర్ రెండో స్థానంలో ఉందన్నారు. లక్ష మందిలో సుమారు 30 మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారని అంచనా ఉందన్నారు. కార్యక్రమంలో దేశంలోని 500 మంది పల్మనాలజిస్టులు, అంతర్జాతీయ నిపుణులు జపాన్‌కు చెందిన డాక్టర్ యుజిమట్సుమోటో, నేషనల్ కేన్సర్ సెంటర్ టోక్యో అధిపతి, థాయ్‌లాండ్‌కు చెందిన డాక్టర్ తితివాట్‌శ్రీప్రసారత్ పాల్గొన్నారు.

మహావీర్ ఆస్పత్రి సేవలు ప్రశంసనీయం

మంత్రులు తలసాని, మహమూద్ అలీ



ఆస్పత్రికి స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన పత్రాన్ని ఆస్పత్రి కమిటీకి అందిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, తలసాని

గోల్కొండ: పేదలకు మహావీర్ ఆస్పత్రి సుమారు 40 సంవత్సరాలుగా సేవలందిస్తూ ప్రజల ఆదరణ పొందిందని రాష్ట్ర మంత్రులు మహ్మద్ మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం మాసబ్‌ట్యాంక్‌లోని మహావీర్ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. హాస్పిటల్ స్థలాన్ని మహావీర్ ఆసుపత్రికే కేటాయిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం జారీ చేసిన పత్రాన్ని వారు హాస్పిటల్ కమిటీ వారికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... ఈ ఆస్పత్రి పేదలకు వరంగా మారిందని, అతి తక్కువ చార్జీలతో వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేయడం హాస్పిటల్ వారి సేవా ధృక్పదానికి నిదర్శమన్నారు. మరే ఆస్పత్రిలో లేని విధంగా ఇక్కడ 62 డయాలసిస్ మిషన్‌లు ఉన్నాయని, కేవలం రూ.300కే డయాలసిస్ సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. మహావీర్ ఆస్పత్రి వారు 4 దశాబ్దాలకు పైగా చేస్తున్న సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్ ఈ స్థలాన్ని శాశ్వతంగా ఆస్పత్రి వారికే ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. అంతేకాకుండా జైన్‌సంఘ్ ఆత్మగౌరవ భవనం కోసం ఉప్పల్ బగాయత్‌లో 2 ఎకరాల స్థలాన్ని కేటాయించారన్నారు. ముఖ్యమంత్రి తన విజ్ఞప్తిని మన్నించి స్థలానికి చెందిన యాజమాన్య హక్కులను తమకు అందించడం పట్ల ఆస్పత్రి నిర్వహణ కమిటీ చైర్మన్ మహేందర్ రాక, ప్రతినిధి సునీల్ కపాడియా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ తలసాని సాయికిరణ్ యాదవ్, మహావీర్ ఆస్పత్రి ప్రతినిధులు సునీల్ పెర్వాడే, మోతీలాల్, ఆశ, ఇన్సిలాల్ జైన్ తదితరులున్నారు.

కేసీఆర్ వ్యాఖ్యలపై ఉద్యమకారుల అభ్యంతరం



అభివాదం చేస్తున్న తొలితరం తెలంగాణ ఉద్యమ నాయకులు

ముషీరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ తెచ్చింది తానేనని ప్రకటించుకోవడంపై పలువురు ఉద్యమకారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు తొలితరం తెలంగాణ ఉద్యమకారులు ప్రసంగించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే ఈ నెల 24న తెలంగాణ ఉద్యమకారులతో సమావేశమై కార్యచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. 1956, 1969, 1996లలో జరిగిన ఉద్యమాలలో కేసీఆర్ పాత్ర శూన్యమని, తెలంగాణ సాధనకు కాకుండా రాజకీయం కోసమే ఆయన పని చేశారని ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ఎల్‌పీ ప్రధాన నాయకుడు డాక్టర్ విజయరామరావు, మురళీధర్‌దేశ్‌పాండే, పోలా జనార్ధన్, విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ త్యాగాన్ని, సహకరించిన సుష్మస్వరాజ్, మీరాకుమార్ వంటివారిని కాదని తానే తెలంగాణ తెచ్చానని చరిత్రను వక్రీకరించే మాటలను కేసీఆర్ మానుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, రాంరెడ్డి, ఓయూ జేఏసీ నాయకులు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి పలు పథకాలు

- జవహర్‌నగర్‌లో సీఎంకు కృతజ్ఞత సభ
- దివ్యాంగులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన మంత్రి మల్లారెడ్డి



దివ్యాంగుడికి అన్నం తినిపిస్తున్న మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: దివ్యాంగుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని డీఎస్ఆర్ గార్డెన్‌లో మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో దివ్యాంగులకు పింఛన్ రూ.4016 పెంచినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. దివ్యాంగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఏకైక సీఎం కేసీఆర్ అన్నారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా తెలంగాణలో దివ్యాంగులకు అత్యధిక పింఛన్ పెంచి సీఎం కేసీఆర్ దేవుడు అయ్యాడన్నారు. అనంతరం సహపంక్తి భోజనం ఏర్పాటు చేసిన మంత్రి మల్లారెడ్డి దివ్యాంగులకు అన్నం వడ్డించడంతో పాటు ఆయనే స్వయంగా కొందరికి తినిపించారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, దివ్యాంగులతో కలిసి పాలాభిషేకం చేశారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ప్రణీత, నాగారం మున్సిపాలిటీ చైర్మన్ చంద్రారెడ్డి, జవహర్‌నగర్ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మేకల అయ్యప్ప, జవహర్‌నగర్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలంతా ఏకమై హక్కులు సాధించుకోవాలి

ఖైరతాబాద్: బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బీసీ డిక్లరేషన్ జాతీయ సదస్సును ఆదివారం విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం బీసీ జనగణన చేపట్టలేదని, కంటి తుడుపు చర్యగా మాత్రమే బీసీ కమిషన్లను వేశాయన్నారు. జాతీయ స్థాయిలో బీసీలంతా ఏకమై తమ హక్కులను తామే రాజ్యాధికారం ద్వారా సాధించుకోవాలన్నారు. అనంతరం జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, బీసీలను కేవలం కులవృత్తులకే పరిమితం చేశారని, అత్యున్నత స్థానాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను బహుజనులకు అందకుండా అడ్డుపడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా బీసీ జనగణన వెంటనే చేపట్టాలని, జనాభా దామాషా ప్రకారం బీసీలకు విద్య, ఉద్యోగం, రాజకీయం, సామాజిక తదితర రంగాల్లో బీసీలకు తగినంత ప్రాధాన్యత కల్పించాలని, చట్టసభలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఇలా.. మొత్తం 24 డిమాండ్లను సదస్సులో ఆమోదించారు. వీటిని ఏ రాజకీయ పార్టీ అయితే రాబోయే ఎన్నికల్లో మేనిఫెస్టోలో పొందుపరుస్తుందో ఆ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని సదస్సులో ప్రకటించారు. ప్రొఫెసర్ సూరజ్ మండల్, నేషనల్ ఓబీసీ మోర్చా ప్రెసిడెంట్ చౌదరి, వికాస్ పటేల్, ప్రొ. మురళీ మనోహర్, కన్వీనర్ దేవల్ల సమ్మయ్య, ప్రొ.తిరుమలి, బీసీ డిక్లరేషన్ ప్రోగ్రాం కమిటీ సభ్యులు సతీష్ కోట్టే, పంజాల శ్రీనివాస్, ఓరుగంటి వెంకటేశ్ యాదవ్, వేణు పాల్గొన్నారు.



బీసీ డిక్లరేషన్ జాతీయ సదస్సులో అభివాదం చేస్తున్న వక్తలు, నాయకులు

ఓం సన్నిధి

మంచి మాట

దాతృత్వం లేదా ఈవి అన్నది ఉద్గుణాలు అన్నిటిలోకెల్లా ఉద్గుణం; సద్గుణాలు అన్నిటిలో కెల్లా సద్గుణం. అవసరమైంది లేనివాళ్లకు తగిన విధంగా అందించడానికి తన శక్తిమేరకు ప్రయత్నించడం ప్రతి మనిషికీ తప్పకుండా ఉండాల్సిన లక్షణం. అది లక్షణంగా మాత్రమే కాకుండా అంతకుమించి ప్రతివ్యక్తికీ ఉండాల్సిన ప్రధాన లక్ష్యంగా కూడా ఉండాలి.



సద్గుణాల్లో ఉద్గుణం దాతృత్వం

వేదవాఙ్మయంలో భాగంగా మనకు అందుబాటులో ఉన్న భిక్షుసూక్తం కమ్యూనిజం కన్నా ఎంతో ముందే అన్నార్తులకు అన్నం పెట్టడం, దీనులకు దానం చెయ్యడం గురించి ప్రగాఢంగా ప్రపంచానికి తెలియజెప్పింది. 'దేవతలు ఆకలిని మరణానికి కారణంగా విధించలేదు. బాగా ఆహారం తిన్న వాళ్లకు కూడా మరణం వచ్చి తీరుతుంది. దానశీలికి సంపద తగ్గదు. ఇవ్వని లేదా పెట్టని వాడిని ఓదార్చే వారు కూడా ఉండరు' అంటూ భిక్షుసూక్తం తొలి శ్లోకం అర్థం చేసుకుని ఆచరించాల్సినదాన్ని ఆవిష్కృతం చేసింది.

ఆకలికి ఆహారం కూడా కరువై అలమటిస్తున్న వాళ్లు ప్రపంచంలో ఇంకా ఉన్నారు. వాళ్లు ఎక్కడో, అక్కడక్కడో మాత్రమే కాదు మన చుట్టుపక్కల కూడా ఉన్నారు. వాళ్లను మనం చూడకపోవడం, చూడలేకపోవడం కాదు చూసినా చూడనట్టు ఉన్నాం, ఉంటున్నాం. మనకు ఎందుకులే అనుకుంటూ,

> పూవుకే కాదు ఈవికి కూడా తావి ఉంటుంది! ఆ తావి పేరు కీర్తి!! ఈవివల్ల మనం కీర్తిమంతులం అవుదాం. బతికి ఉండగానే కాదు, మరలిపోయాక కూడా మనం పరిమళిద్దాం. ఈవితో మనకు మనం తావిని అద్దుకుందాం.

అంటూ మనం వాళ్ల పక్కనే నివసిస్తున్నాం. ఇది అమానవీయం. ఈ అమానవీయత మనలో కొత్తగా చోటు చేసుకున్న అవలక్షణం కాదు. అది మనలో ఎప్పటి నుంచో గూడుకట్టుకుని లేదా పేరుకుపోయి ఉంది. ఆ లక్షణం మనలో ఉండకూడదు అని తెలియజేస్తూ, మనకు తగిన స్ఫూర్తిని ఇస్తూ ఎప్పటి నుంచో ఎంతో చెప్పబడింది; ఎందరో మహనీయులు మనకు ఈ విషయంలో ఆదర్శంగా నిలిచారు. అయినా కూడా ఆ అవలక్షణం అవనిలో అంతరించిపోలేదు.

ప్రపంచం పరిణామాల్ని పొందుతూ ఇవాళ ఉన్న స్థితికి వచ్చాక కూడా ఆకలి అన్నది ప్రపంచంలో ఇంకా ఎందరినో బాధిస్తోంది. ఆకలి తన ఆకలిని తీర్చుకోలేకపోతోందేమో? అందువల్ల అది ఇంకా మనుషుల ప్రాణాల్ని తింటూనే ఉందేమో? ఎప్పటినుంచో ప్రపంచంలో ఆకలి అగ్నికి మనుషుల ప్రాణాలు ఆహుతి అవుతూనే ఉన్నాయి.

'అన్నం కలిగిన వాడై ఉండీ, అవసరమైన దీనులకి ఆహారం పెట్టకుండా మనసును చంపుకుని ఆ దీనుల ముందే ఎవడయితే తాను అనుభవిస్తూ తింటాడో వాడికి అనునయించే వాళ్లు దొరకరు' అన్న విషయాన్ని ఒక హెచ్చరికగా భిక్షుసూక్తం మనకు తెలియజెప్పింది. ఈ సూక్తంలో చెప్పబడినట్టుగా ఆకలి కారణంగా మన సమాజంలో దాడులు జరుగుతూనే ఉన్నాయి.

'ధనవంతుడు పేదలకు తప్పకుండా ఇవ్వాలి. దూరదృష్టితో మార్గాల్ని ఆలోచించి ధనాన్ని పెంచుకునే ప్రయత్నం చెయ్యాలి. ఎందుకంటే రథచక్రాలు తిరుగుతున్నట్టుగా సంపద ఒకరి నుంచి మఱొకరికి వెళుతూ ఉంటుంది' అనీ,'మూర్ఖుడు అహారాన్ని ఇతరులకి పెట్టకుండా ఆశగా సేకరించి నిల్వ ఉంచుకుంటాడు. నిజం చెబుతున్నాను అది వాడికి చావునే ఇస్తుంది. దేవుడికో, స్నేహితుడికో ఇవ్వకుండా తాను తినే వాడు ఒట్టి పాపి అవుతాడు' అనీ భిక్షుసూక్తం ఎప్పటి నుంచో చెబుతూనే ఉంది. కానీ మానవులు దాన్ని పెద్దగా పట్టించుకోకుండా పాపులుగా లేదా దోషులుగా మనుగడ చేస్తున్నారు.


'ఆహారాన్ని వెతుక్కుంటూ తిరిగే బలహీనులకు ఎవరు వెంటనే ఆహారాన్ని ఇస్తారో వారి కోసం విలువైనవి వేచి ఉన్నాయి. వారు విరోధులతో కూడా స్నేహాన్ని పొందుతారు' అని భిక్షుసూక్తం ఉపదేశించి దాన్ని మనం మనసుతోనూ, మెదడుతోనూ అందుకుని ఆచరణలోకి తీసుకురావాలి. ఆ పని చేస్తూ మనల్ని మనం మనుషులుగా మలుచుకోవాలి; తథాస్తు.

– రోచిష్మాన్

గురువాణి

ప్రకృతికి పేటెంట్ తీసుకోవచ్చా!!!

భగవంతుడు మనకు మాట ఇచ్చాడు, బుద్ధి ఇచ్చాడు, ఇంత గొప్ప శరీరాన్ని ఇచ్చాడు... అన్న విశ్వాసం మనకు ఉండాలి. నేను ఏదో సాధించాలన్న ఉద్దేశంతోనే నాకు ఇవి బహూకరించాడు... ఎన్ని ప్రతిబంధకాలు ఎదురయినా సరే... నేను అనుకున్నది సాధించితీరతాను... అన్న పట్టుదల ఉంటే ఎంతటి నిరాశానిస్పృహలు ఎదురయినా సరే... సునాయాసంగా వాటిని దాటి... లక్ష్యాలను సాధించవచ్చు... అనడానికి – ఆత్మహత్య ఆలోచనలను వెనక్కి తీసుకుని, కష్టాలతోనే కడుపు నింపుకుని, ఒకటి కాదు, రెండు నోబెల్ బహుమతులు గెలుచుకున్న ధీర వనిత మేరీ క్యూరీ గొప్ప ఉదాహరణ.


మేరీ క్యూరీ


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మేరీ అసలు పేరు మరియా. 1867 నవంబరు 7న జన్మించారు. పోలండ్ దేశస్థురాలు. తల్లిదండ్రులు టీచర్లు. 11వ ఏట తల్లి మరణించింది. పోలండ్ లోని రాజకీయ అనిశ్చితి వాతావరణంలో తండ్రి ఉద్యోగం పోయింది. అక్కడినుంచి కష్టాలను ఈదుకుంటూ పారిస్ చేరుకుంది. ఆ రోజుల్లో సైన్స్ చదవడానికి స్త్రీలు ముందుకు రాకుండా సంప్రదాయవాదులనుండి అనేక అవరోధాలుండేవి. ఆమెకు సైన్సంటే మక్కువ, పరిశోధనలంటే ప్రాణం. ఇంటిపట్టునే ఉన్నవనరులతోనే ప్రయోగశాల పెట్టుకుంది. ప్రొఫెసర్ హెన్నీ బెకెరెల్ సాయంతో పరిశోధనలు చేసేది.

ఇంచుమించు తనలాగే అనేక కష్టాలను ఓర్చుకుంటూ పరిశోధనలు సాగిస్తున్న పీరే క్యూరీతో పరిచయం, సాహచర్యం తరువాత పెళ్ళికి దారితీసాయి. అయినా కష్టాలు తీరకపోగా కలిసి అనుభవించడం అలవాటు చేసుకున్నారు.

భయంకరమైన కాన్సర్ వ్యాధి చికిత్సకు తోడ్పడగల కారకాల కోసం పరిశోధనలు ముమ్మరంగా సాగుతుండేవి. రేడియోయాక్టివిటీ సిద్ధాంత అభివృద్ధికి, దాని తాలూకు పరిశోధనలకు ఆమె గురువుకి, భర్తకి, ఆమెకు కలిపి నోబెల్ బహుమతి లభించింది. ఆ తరువాత ఒక చిన్న రోడ్డు ప్రమాదంలో ఆమె భర్త మరణించారు. తరువాత కాలంలో పొలోనియం, రేడియం మూల పదార్థాల అన్వేషణకు ఈసారి రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి ఆమెను వరించింది. ఒక స్త్రీకి రెండుసార్లు, అదీ రెండు వేర్వేరు సబ్జెక్ట్ లలో నోబెల్ రావడం విశేషం, అపూర్వం.

ఆమె సాధించిన ఫలితాలకు ఆమె కానీ, ఆమె భర్త కానీ పేటెంట్ తీసుకుని ఉంటే.... వారి వారసులు ఇప్పటి లెక్కల ప్రకారం ప్రపంచంలో అత్యంత సంపన్నులుగా ఉండేవారు. కానీ ఆమె నిజ జీవిత సిద్ధాంతం ఏమిటో తెలుసా... ''అవి (ఖనిజాలు) ప్రకృతి ఇచ్చిన వరం. అది ప్రజలది. వాటి మీద నాకేం హక్కు ఉందని పేటెంట్ తీసుకోవాలి. అందరి మేలుకోసం వాటిని నేను ఉపయోగించగలగడం నాకు జీవితంలో దక్కిన అదృష్టం... అందుకే వాటికోసం తాపత్రయపడలేదు. నిజానికి దంపతులిద్దరికీ అవార్డులు, రివార్డుల మీద ధ్యాస ఉండేది కాదు... నిరంతరం పరిశోధనలే... అవికూడా ఇంటిపట్టున ఏర్పాటు చేసుకున్న అరాకొరా సౌకర్యాలతో... సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో ... ధార్మిక ప్రభావానికి ఆమె శరీరం గురయింది... చివరకు ఆమెకు కూడా కాన్సర్ సోకి, మరణానికి దారితీసింది... ఆమె పారిస్ (ఫ్రాన్స్ దేశం)లో స్థిరపడినా, మాతృదేశం పట్ల ఆమెకు ఎంత గాఢమైన ప్రేమంటే... తాను కనుగొన్న పదార్థాలలో ఒకదానికి తన దేశం పేరు ధ్వనించేలా పొలోనియం అని పేరు పెట్టింది. చివరకు తన మరణానంతరం ఖననానికి ముందు.. శవపేటిక తెరచి.. జన్మభూమి పోలండ్ నుంచి తెచ్చిన మట్టి చల్లాలని కోరింది. మానవాళి శ్రేయస్సుకు తపించడం తప్ప ఆమె సర్వసుఖాలను, సంపదలను దూరంగా పెట్టింది.. చివరకు కీర్తికాంక్షను కూడా.

బౌద్ధవాణి

మేఘ సందేశం



కొండ దారి పక్క కొందరు పిల్లలు ఆడుకుంటూ ఉన్నారు. ఇద్దరు పెద్దవారు ఆ దారిగుండా పోతున్నారు. ఆ పిల్లలు ఆకాశంలో ఉన్న పెద్ద మేఘాన్ని చూస్తూ వాదులాడుకుంటున్నారు.

''అది తోడేలులా ఉంది'' అన్నాడు ఒక పిల్లాడు.

''కాదు... అది ఏనుగులా ఉంది'' అన్నాడు మరొకడు.''లేదు లేదు అది పడుకున్న తోడేలులా ఉంది'' అన్నాడు ఇంకొకడు. ''మంచుకొండలా ఉంది'' అన్నాడు వేరొకడు.

ఈ ఇద్దరు పెద్దలు అక్కడికి వెళ్లారు. పిల్లలు వారిని ఆపి ''ఎవరు సరిగా చెప్పారు?'' అని అడిగారు. వారిద్దరూ ఆ మేఘం కేసి చూశారు. వారిద్దరికీ మరో విధంగా వేరు వేరుగా కనిపించింది. వారు ఏమీ చెప్పలేక ముందుకు సాగారు. పిల్లలు ఆటల్లో పడిపోయారు.

వారు బుద్ధుని ప్రవచనం వినడానికి వెళ్తున్నారు. వారు బుద్ధుని దగ్గరకు వెళ్ళి, నమస్కరించి, దారిలో జరిగిన మేఘం గురించి చెప్పారు.

''మన మనస్సులో చెలరేగిన భావాల్ని బట్టే మనకి అలా కనిపిస్తాయి. నిశ్చలంగా, నిర్మలంగా ఉండే నీటిలో మన నీడని మనం అద్దంలో వలే చూడగలం. రంగులు కలిసిన నీటిలో, కదిలే నీటిలో, పాచి పట్టిన నీటిలో, బురద నీటిలో చూడలేం కదా. అలాగే కోరికలు, దోషాలు, అలసత్వం, వ్యాకులత, అనుమానాలు.. అనే ఐదు పొరలూ మనస్సును చుట్టి ఉంటే.. మనం చూసేదాన్ని సరిగా చూడలేం.. ఇవి మనస్సును పొరలా కప్పి ఉంచుతాయి'' అన్నాడు.

వారిద్దరికీ ఆ మేఘం ఒక్కొక్కరికీ ఒక్కొక్క రకంగా ఎందుకు కన్పించిందో అర్థమయ్యింది. బుద్ధుడు వారి వంక చూశాడు. వారి మనస్సు గ్రహించాడు.

''ఉపాసకులారా! మీకు ఐదు రకాల మనుషుల గురించి చెప్తాను. వినండి''.

''భగవాన్ సెలవియ్యండి'' అన్నారు వారు.

''ఒక వ్యక్తికి అప్పు ఉంటుంది. అతను ఏదో పని కోసం అలా అప్పు చేశాడు. ఆ పని పూర్తి చేశాడు. ఆ తరువాత అప్పు తీర్చాడు. అతనికి ఇంకా కొంత ధనం మిగిలి ఉంటుంది. ఆ సొమ్ముతో కుటుంబ పోషణ చేశాడు. అప్పుడతను ఎంతో సంతోషాన్ని పొందుతాడు. అతను రుణగ్రస్తునిలా ఉన్నప్పుడు ఆ సంతోషం పొందలేడు''

మరో వ్యక్తి ఉన్నాడు. అతనికి తీవ్రమైన వ్యాధి సోకింది. మంచాన పడ్డాడు. కొన్నాళ్ళకు ఆ వ్యాధి తగ్గింది. లేచాడు. సత్తువ వచ్చింది. ఆహారం చక్కగా తీసుకోసాగాడు. అలాగే... బానిసత్వం నుండి బయటపడి స్వేచ్ఛ పొందినవారు, చెరసాల నుండి విడుదలైన వారు కూడా సంతోషాన్ని పొందుతారు. అలాగే.. ఎక్కువ ధనాన్ని వెంట తీసుకుని అడవి మార్గంలో పోయేవారు, సురక్షితంగా అడవి దాటితే ... అలాంటి సంతోషాన్నే పొందుతారు.

ఈ ఐదుగురూ మొదట దశలో భయపడ్డారు. బాధపడ్డారు. కలవరపడ్డారు. కానీ, చివరికి అమిత సంతోషాన్ని పొందారు. మన మనస్సుకు ఐదు పొరలూ అడ్డు పడుతూ ఉంటాయి. అందుకే సరిగా చూడలేం. సరిగా వినలేం. సరిగా ఆలోచించలేం. అవి అడ్డు పడి ఉన్నంత కాలం అప్పు చేసిన వాడిలా, రోగిలా, ఖైదీలా, బానిసలా, అడవిలో ప్రయాణికునిలా భయానికి లోనవుతాం. బాధల్లో కూరుకుపోతాం. ఈ పొరలు తొలగితే ఉన్నది ఉన్నట్లు చూడగలం. సత్యాన్ని సత్యంగా గ్రహించగలం'' అన్నాడు.

ఒకే మేఘం పిల్లలకూ, తమకూ వేరువేరుగా ఎందుకు కనిపించిందో వారికి అర్థమయ్యింది. మనస్సు నుండి ఈ అవరోధాలు తొలగితే.. ఉన్నది ఉన్నట్లు చూడగలం'' అని గ్రహించారు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా


● ప్రభాస్, కృతీసనన్

రామాలయానికి 100 టిక్కెట్లు ఉచితం

హీరో ప్రభాస్ రామునిగా నటించిన 'ఆదిపురుష్' సినిమా కోసం పాన్ ఇండియా వ్యాప్తంగా ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఓమ్ రౌత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కృతీసనన్ సీతగా నటించారు. భూషణ్ కుమార్, క్రిష్ణకుమార్, ఓమ్ రౌత్, ప్రసాద్ సుతారియా, రెట్రోఫిల్స్ రాజేష్ నాయర్, యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 16న విడుదలవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ రిలీజ్ చేస్తోంది. 'రామాయణ పారాయణం జరిగే ప్రతి చోటుకి హనుమంతుడు విచ్చేస్తాడు అనేది మన నమ్మకం. ఈ నమ్మకాన్ని గౌరవిస్తూ 'ఆదిపురుష్' సినిమాని ప్రదర్శించే ప్రతి థియేటర్లో ఒక సీటు విక్రయించకుండా హనుమంతుడి కోసం ప్రత్యేకంగా కేటాయిస్తున్నాం' అంటూ యూనిట్ ఇటీవల ప్రకటించింది. ఈ మంచి కార్యాన్ని తమవంతుగా ప్రోత్సహిస్తూ శ్రేయాస్ మీడియా వారు మరో నిర్ణయం తీసుకున్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న ప్రతి రామాలయానికి 100+1 (1 టిక్కెట్ హనుమాన్‌కి) టిక్కెట్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు శ్రేయాస్ మీడియా అధినేత శ్రీనివాస్ తెలిపారు. టిక్కెట్లు కావాల్సిన వారు తమను సంప్రదించాలని పేర్కొన్నారు.

గుండెల్లో మోగిందే నీ కబురే!

నిఖిల్, ఐశ్వర్యా మీనన్ జంటగా ఆర్యన్ రాజేష్, సన్యా ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ ఫిల్మ్ 'స్పై'. ఎడిటర్ గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో కె.రాజశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించిన ఈ మూవీలోని ''మొదటిసారిగా చూపు తగిలే... గుండెల్లో మోగిందే నీ తొలి కబురే, జుమ్ జుమ్మనే గుండెల్లోన యుద్ధాలే.. సిద్ధంగా ఉంచా నీకే ఏడుజన్మలే..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను చిత్రయూనిట్ ఆదివారం విడుదల చేసింది. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి, రమ్యా బెహ్రా పాడారు. స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ డెత్ మిస్టరీ అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకి కెమెరా: వంశీ పచ్చిపులుసు, మార్క్ డేవిడ్, సంగీతం: శ్రీచరణ్ పాకాల, విశాల్ చంద్రశేఖర్.


● నిఖిల్, ఐశ్వర్యా మీనన్

వైల్డ్ యానిమల్

రణబీర్ కపూర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'యానిమల్'. 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలోని ఓ యాక్షన్ సీక్వెన్స్ నుంచి చిన్న సీన్‌ను ప్రీ టీజర్‌గా ఆదివారం విడుదల చేసింది చిత్రయూనిట్. 'వైల్డ్ యానిమల్', 'వైలెంట్ యానిమల్' అంటూ 'యానిమల్' ప్రీ టీజర్ గురించి పోస్టులు చేస్తున్నారు నెటిజన్లు. ఫుల్ టీజర్ ఈ నెల 16న విడుదల కానుందని సమాచారం. తండ్రీ కొడుకుల భావోద్వేగాల నేపథ్యంలో ఈ సినిమా కథ, కథనాలు ఉంటాయట. ఓ కాలేజ్ లెక్చరర్ అయిన యువకుడు తండ్రి కోసం మాఫియాతో ఏ విధంగా పోరాడాడు? అనే కథాంశంతో 'యానిమల్' తెరకెక్కుతోందని ప్రచారం సాగుతోంది. ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో ఆగస్టులో విడుదల కానుంది.


● రణ్‌బీర్ కపూర్

శ్రీకాకుళం యాసతో...


● అనన్య నాగళ్ల

రవి మహాదాస్యం, అనన్య నాగళ్ల జంటగా చల్లా రాజా రామ్మోహన్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. బేబీ లాస్య రెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్‌పై వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్న ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సందర్భంగా రాజా రామ్మోహన్ మాట్లాడుతూ– ''కామెడీ, ఎమోషన్, సెంటిమెంట్.. ఇలా అన్ని వాణిజ్య అంశాలతో ఈ చిత్ర కథ ఆసక్తిగా ఉంటుంది. శ్రీకాకుళం యాస ఇతివృత్తంతో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది'' అన్నారు. 'వెన్నెల' కిశోర్, శియా గౌతమ్, 'బాహుబలి' ప్రభాకర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సంగీతం: సునీల్ కశ్యప్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజేష్ రంబాల.

ద్రవిడభూమి గొప్పతనంతో...

ప్రముఖ రచయిత సొద అరుణ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కోడ్ రామాయణ'. ఈ చిత్రంలో సుమారు 50 మంది నూతన నటీనటులు యాక్ట్ చేశారు. సొద అరుణ్ స్టూడియోస్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం టైటిల్ అనౌన్స్‌మెంట్ హైదరాబాద్‌లో జరిగింది. ముఖ్య అతిథులుగా వచ్చిన బౌద్ధ భిక్షువు బంతె షీల్ రక్షిత్, ప్రముఖ రచయిత్రి లలిత. పి. చేతుల మీదుగా 'కోడ్ రామాయణ' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాత సొద అరుణ్ మాట్లాడుతూ–''ద్రవిడ భూమి గొప్పతనాన్ని ప్రపంచం మరింత అర్థం చేసుకోవాలనే ఈ సినిమా చేస్తున్నాం. ఈ చిత్రం మొత్తం మూడు భాగాలుగా(కోడ్ రామాయణ, రావణ చరిత్ర, ఉత్తర రామాయణం) ప్రేక్షకుల ముందుకు వస్తుంది'' అన్నారు. ఈ చిత్రంలో దుర్వాసుడు పాత్రలో నటించిన భరద్వాజ మాట్లాడుతూ–''కోడ్ రామాయణ' అంటే రామాయణ అంతరార్థం అని అర్థం. ఈ సినిమాని చిరంజీవిగారికి చూపించి, రెండో భాగంలో రావణాసుర పాత్ర చేయమని కోరతాం'' అన్నారు. నటులు శ్రీశైల్ రెడ్డి, పి.జగదీశ్ పాల్గొన్నారు.



● శ్రీశైల్ రెడ్డి, భరద్వాజ, సొద అరుణ్, పమ్మిడి జగదీశ్

హారర్.. థ్రిల్లర్


● రవిబాబు

రవిబాబు, సత్యప్రకాష్, 'చిత్రం' శ్రీను కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'టెర్రర్ ద వే ఆఫ్ డెవిల్'. ఈ చిత్రం ద్వారా సీవీఎస్ఎమ్ వెంకట్ రవీంద్రనాథ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీ కృష్ణార్జున మూవీ మేకర్స్‌పై పెదారికట్ల చెన్నైబోయిన నరసమ్మ, వెంకటేశ్వర్లు యాదవ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పెదారికట్ల చెన్నైబోయిన నరసమ్మ, వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ–''గతంలో గ్రామాల్లో మాతంగులు జీవించేవారు. వారి జీవితాల ఆధారంగా అల్లుకున్న కథకి హారర్, థ్రిల్లర్ అంశాలు జోడించి ఈ చిత్రం నిర్మిస్తున్నాం. ఈ మూవీ ద్వారా ముగ్గురు కొత్త అమ్మాయిలను హీరోయిన్స్‌గా పరిచయం చేస్తున్నాం. తెలుగు, కన్నడ భాషల్లో ఏకకాలంలో నిర్మిస్తున్న ఈ సినిమా రెండవ షెడ్యూల్ నేటి నుంచి ప్రారంభం అవుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: పీకే స్టిల్ రాజ్ కమల్.

చిన్న సినిమాలు సక్సెస్ కావాలి – ప్రసన్న కుమార్


● లక్ష్మీపతి, ప్రసన్న కుమార్, ఘటికాచలం

''చిన్న సినిమాలు సక్సెస్ అయితే ఇండస్ట్రీ బాగుంటుంది. లక్ష్మీపతిలాంటి నిర్మాతలు ఇండస్ట్రీకి వస్తారు. 'ఐక్యూ' సినిమా సక్సెస్‌తో ఆయన మరిన్ని సినిమాలు ప్లాన్ చేస్తున్నారు'' అని నిర్మాత ప్రసన్న కుమార్ అన్నారు. సాయి చరణ్, పల్లవి జంటగా జీఎల్‌బీ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఐక్యూ'. కేఎల్‌పీ మూవీస్ పతాకంపై కాయగూరల లక్ష్మీపతి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 2న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కాయగూరల లక్ష్మీపతి మాట్లాడుతూ–''ఐక్యూ' సినిమా కథ జనాలకు బాగా కనెక్ట్ అయింది.. అందుకే రెండో వారం కూడా సక్సెస్‌ఫుల్‌గా నడుస్తోంది'' అన్నారు. రచయిత ఘటికాచలం పాల్గొన్నారు.


మర్డర్ మిస్టరీ



● అరుణ్, సృజన

అరుణ్, సృజన జంటగా సురేష్ రెడ్డి దర్శకత్వంలో 'వేటాడతా' చిత్రం తెరకెక్కుతోంది. ఎమ్.అంకయ్య నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. వైజాగ్ మాజీ మేయర్ దాడి సత్యనారాయణ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత సాయివెంకట్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత నాగులపల్లి పద్మిని స్క్రిప్ట్ అందించగా, నిర్మాత రామ సత్యనారాయణ తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ–''సస్పెన్స్ అండ్ మర్డర్ మిస్టరీగా 'వేటాడతా' చిత్రం రూపొందుతోంది. ఈ నెలాఖరులో షూటింగ్‌ను స్టార్ట్ చేస్తాం. అరకు, హైదరాబాద్, నంద్యాల ప్రాంతాల్లో చిత్రీకరిస్తాం'' అన్నారు. ''మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు అంకయ్య. ''మా నాన్న(అంకయ్య) సిద్ధం చేసిన కథతో హీరోగా పరిచయమవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది'' అన్నారు అరుణ్. ఈ సినిమాకు సహ-నిర్మాత: డి.శివ ప్రసాద్, సంగీతం: శేఖర్ మోపూరి.

గ్లాడియేటర్-2 సెట్‌లో అగ్నిప్రమాదం


● రిడ్లీ స్కాట్

హాలీవుడ్ చిత్రం 'గ్లాడియేటర్-2' సెట్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో కొంతమంది యూనిట్ సభ్యులు గాయపడ్డారు. రిడ్లీ స్కాట్ దర్శకత్వంలో రెండు దశాబ్దాల క్రితం ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'గ్లాడియేటర్' ఫిల్మ్ సూపర్ హిట్‌గా నిలిచింది. 73వ ఆస్కార్ అవార్డ్స్‌లో ఈ చిత్రం ఐదు విభాగాల్లో అవార్డులు సాధించింది. తాజాగా 'గ్లాడియేటర్' సినిమాకు సీక్వెల్‌గా 'గ్లాడియేటర్-2' తెరకెక్కిస్తున్నారు రిడ్లీ స్కాట్. పాల్ మెస్కల్, డెంజెల్ వాషింగ్టన్, కొన్నీ నిల్సన్ ప్రధాన పాత్రధారులు. ఈ సినిమా తాజా షెడ్యూల్ ఇటీవల మొరాకోలో ప్రారంభమైంది. ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్న సమయంలో సెట్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకున్నట్లు హాలీవుడ్‌లో వార్తలొస్తున్నాయి. ''గ్లాడియేటర్ -2' సెట్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు సిబ్బంది గాయపడ్డారు. ప్రధాన నటీనటులు ఎవరూ గాయపడలేదు'' అని చిత్ర నిర్మాణ సంస్థ పారామౌంట్ పిక్చర్స్ ప్రతినిధి పేర్కొన్నట్లు హాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి.



ఓటమితో నిరాశగా ఉన్నా. మ్యాచ్ మొదటి సెషన్‌లో మేం బాగా బౌలింగ్ చేసినా తర్వాత ప్రత్యర్థి కోలుకునేందుకు అవకాశం ఇచ్చాం. హెడ్ చెలరేగిన తర్వాత మ్యాచ్‌లో కోలుకోవడం అంత సులువు కాదని మాకు తెలుసు. కొన్నిసార్లు గట్టి పోటీనివ్వగలిగినా ఆస్ట్రేలియా చాలా బాగా ఆడింది. మా వ్యూహాలేవి పని చేయలేదు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్నా మేం వాడుకోలేకపోయాం. నాలుగేళ్లలో ఎంతో కష్టపడి రెండు సార్లు ఫైనల్ చేరాం. మేం సాధించిన విజయాల విలువ ఈ ఓటమితో తగ్గదు. నా అభిప్రాయం ప్రకారం ఫైనల్‌ను మూడు మ్యాచ్‌ల సిరీస్‌గా నిర్వహిస్తే బాగుంటుంది. అదీ ఇంగ్లండ్‌లోనే, జూన్‌లోనే ఎందుకు జరగాలి. దీనినీ మార్చవచ్చు కదా. -రోహిత్ శర్మ, భారత కెప్టెన్

టాస్ ఓడిపోవడమే మంచిదైంది. లేకపోతే మేమూ బౌలింగ్ తీసుకునేవాళ్లం. కొన్నిసార్లు భారత్ ప్రతిఘటించినా, ఎక్కువ భాగం మేమే ఆధిపత్యం ప్రదర్శించాం. మాకు సంబంధించి ఇదో మధుర క్షణం. ఈ విజయాన్ని కొన్ని రోజులు ఆస్వాదించిన తర్వాతే యాషెస్ గురించి ఆలోచిస్తాం. ఫైనల్ ఒక్క మ్యాచ్ ఉండటమే మంచిది. అనుకుంటే 50 మ్యాచ్‌ల సిరీస్ కూడా ఆడవచ్చు. ఒలింపిక్స్‌లో ఒక్క రేస్ గెలిస్తేనే స్వర్ణం దక్కుతుంది కదా. -ప్యాట్ కమిన్స్, ఆస్ట్రేలియా కెప్టెన్





అప్పగించేశారు

డబ్ల్యూటీసీ ఫైనల్లో భారత్ చిత్తు
రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 234 ఆలౌట్
తొలిసారి టెస్టుల్లో ప్రపంచ చాంపియన్‌గా ఆసీస్
209 పరుగులతో ఆస్ట్రేలియా ఘన విజయం

ఐదో రోజు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. కోహ్లి, రహానే కలిసి కమాల్ చూపిస్తారనుకున్న భారత అభిమానులకు అసలు పరిస్థితి కొద్దిసేపటికే అర్థమైంది. ఒక వికెట్ పడగానే మిగతా వారంతా అనుసరించేశారు. కోలుకునే అవకాశమే లేకుండా మ్యాచ్‌ను అప్పగించేశారు. వరుసగా రెండోసారి టీమిండియా ఫైనల్ చేరిన ఆనందం అక్కడికే పరిమితం కాగా, ఆస్ట్రేలియా తొలిసారి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. గతంలో భారత్‌తో టెస్టుల్లో చేసిన పొరపాట్లను ఆస్ట్రేలియా ఈసారి చేయలేదు. మరో 'గాబా'కు అవకాశం ఇవ్వలేదు. చివరి రోజు తొలి బంతి నుంచే కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బ్యాటర్లను కదలనీయకుండా చేసిన కంగారూలు ఒత్తిడి పెంచి వరుస వికెట్లు తీశారు. వన్డే, టి20 ప్రపంచకప్‌ల తర్వాత సాంప్రదాయ క్రికెట్‌లో వరల్డ్ కప్‌లాంటి చాంపియన్‌షిప్‌ను అందుకొని కంగారూలు శిఖరాన నిలిచారు.

లండన్: రెండో వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) టైటిల్‌ను ఆస్ట్రేలియా సొంతం చేసుకుంది. ఆదివారం ముగిసిన ఫైనల్లో ఆసీస్ 209 పరుగుల భారీ తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. చివరి రోజు హోరాహోరీగా సాగుతుందనుకున్న ఆట భారత్ పేలవ బ్యాటింగ్‌తో ఏకపక్షంగా ముగిసింది. 444 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 164/3తో ఆట కొనసాగించిన భారత్ 234 పరుగులకే ఆలౌటైంది. విరాట్ కోహ్లి (78 బంతుల్లో 49; 7 ఫోర్లు), అజింక్య రహానే (108 బంతుల్లో 46; 7 ఫోర్లు) తమ జోరును చివరి రోజు కొనసాగించలేకపోయారు. లయన్‌కు 4 వికెట్లు దక్కాయి. ట్రవిస్ హెడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పురస్కారం లభించింది.

విజేత ఆస్ట్రేలియా జట్టుకు గదతోపాటు 16 లక్షల డాలర్లు (రూ. 13 కోట్ల 19 లక్షలు), రన్నరప్ భారత జట్టుకు 8 లక్షల డాలర్లు (రూ. 6 కోట్ల 59 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

23.3 ఓవర్లు... 70 పరుగులు... 7 వికెట్లు... చివరి రోజు భారత జట్టు ప్రదర్శన ఇది. శనివారం ఆఖరి గంటలో ప్రదర్శించిన పట్టుదల గానీ, దూకుడు కానీ ఎక్కడా కనిపించలేదు. ఒకరి వెనుక ఒకరు వరుస కట్టడంతో లంచ్‌లోపే ఓటమి ఖాయమైంది. తొలి 6 ఓవర్ల పాటు కోహ్లి, రహానే గట్టిగా నిలబడ్డారు. అయితే బోలండ్ వేసిన తర్వాతి ఓవర్ ఆటను మలుపు తిప్పింది. స్లిప్‌లో స్మిత్ చక్కటి క్యాచ్‌కు కోహ్లి వెనుదిరగ్గా, మరో రెండు బంతులకే జడేజా (0) కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచి చెత్త బౌలింగ్ వేసిన స్టార్క్ అసలు సమయంలో తన విలువను చూపించాడు. అతని బంతిని ఆడలేక రహానే కీపర్‌కు క్యాచ్ ఇవ్వడంతో భారత్ వేగంగా ఓటమి దిశగా పయనించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆదుకున్న శార్దుల్ (0) ఈసారి నిలవలేకపోగా, ఉమేశ్ యాదవ్ (1) అతడిని అనుసరించాడు. కొద్దిసేపు పోరాడిన శ్రీకర్ భరత్ (41 బంతుల్లో 23; 2 ఫోర్లు)ను వెనక్కి పంపిన లయన్, తన తర్వాతి ఓవర్లో సిరాజ్ (1)ను అవుట్ చేసి భారత్ ఆట ముగించాడు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 469; భారత్ తొలి ఇన్నింగ్స్: 296; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 270/8 డిక్లేర్డ్; భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీ) (బి) లయన్ 43; గిల్ (సి) గ్రీన్ (బి) బోలండ్ 18; పుజారా (సి) క్యారీ (బి) కమిన్స్ 27; కోహ్లి (సి) స్మిత్ (బి) బోలండ్ 49; రహానే (సి) క్యారీ (బి) స్టార్క్ 46; జడేజా (సి) క్యారీ (బి) బోలండ్ 0; భరత్ (సి అండ్ బి) లయన్ 23; శార్దుల్ (ఎల్బీ) (బి) లయన్ 0; ఉమేశ్ (సి) క్యారీ (బి) స్టార్క్ 1; షమీ (నాటౌట్) 13; సిరాజ్ (సి) బోలండ్ (బి) లయన్ 1; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (63.3 ఓవర్లలో ఆలౌట్) 234. వికెట్ల పతనం: 1-41, 2-92, 3-93, 4-179, 5-179, 6-212, 7-213, 8-220, 9-224, 10-234. బౌలింగ్: కమిన్స్ 13-1-55-1, బోలండ్ 16-2-46-3, స్టార్క్ 14-1-77-2, గ్రీన్ 5-0-13-0, లయన్ 15.3-2-41-4.

1 అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని టోర్నమెంట్‌లను గెలిచిన తొలి జట్టుగా ఆస్ట్రేలియా గుర్తింపు పొందింది. ఆస్ట్రేలియా జట్టు ఐదుసార్లు (1987, 1999, 2003, 2007, 2015) వన్డే వరల్డ్‌కప్‌ను... రెండుసార్లు (2006, 2009) చాంపియన్స్ ట్రోఫీని... ఒకసారి (2021) టి20 వరల్డ్‌కప్‌ను.. ఒకసారి (2023) ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌ను సాధించింది.

టాస్ నుంచి ఓటమి వరకు...

'వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ గెలవనంత మాత్రాన మా జట్టు గత రెండేళ్లలో సాధించిన విజయాల విలువ తగ్గదు. మా టీమ్ ఎన్నో గొప్ప విజయాలు అందుకుంది'... డబ్ల్యూటీసీ ఫైనల్ ప్రారంభానికి ముందు భారత హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ చేసిన వ్యాఖ్య ఇది. అంకెల్లో చూస్తే అది వాస్తవమే అయినా, ఒక మెగా ఈవెంట్‌కు ముందు ఈ తరహా నెగెటివ్ వ్యాఖ్యలు కోచ్ నుంచి రావడం ఎవరికీ నచ్చలేదు. ఓడిపోవడానికి ముందే దాని కోసం సాకులు వెతుకుతున్నట్లుగా ఉందని దీనిపై చాలా మంది క్రికెట్ అభిమానులు విమర్శించారు. చివరకు మ్యాచ్ ఫలితం అలాగే వచ్చింది.


హెడ్ కోచ్ ద్రవిడ్
కెప్టెన్ రోహిత్ శర్మ

- ఆటగాడిగా దిగ్గజ స్థాయి ఉన్న ద్రవిడ్ కోచ్‌గా అండర్-19, ఇండియా 'ఎ' టీమ్‌ల తరఫున మాత్రం గొప్ప ఫలితాలు రాబట్టాడు. అయితే సీనియర్ టీమ్ కోచ్‌గా ద్రవిడ్ ఆశించిన ఫలితాలు రాబట్టలేదనేది వాస్తవం. టీమ్ మేనేజ్‌మెంట్‌లో ప్రధాన భాగమైన ద్రవిడ్ తొలి రోజే పిచ్‌పై అంచనా తప్పడం భారత్‌ను దెబ్బ తీసిందనేది వాస్తవం. తీవ్ర ఒత్తిడి ఉండే ఫైనల్ మ్యాచ్‌లో నాలుగో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడం అంత సులువు కాదని తెలిసినా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోవడం పెద్ద తప్పు. ఇంగ్లండ్‌లో వాతావరణం గంటగంటకూ మారుతుందని ద్రవిడ్‌కు బాగా తెలుసు. మన పేసర్లపై నమ్మకం ఉండటమే కాదు... మబ్బులు కమ్మిన వేళ మనం బ్యాటింగ్ తీసుకొని ఆసీస్ బౌలర్లు చెలరేగిపోతే జట్టు కుప్పకూలిపోతుందనే భయం కూడా ద్రవిడ్ మనసులో ఉండవచ్చు. గంట తర్వాత అంతా మారిపోయింది. హెడ్, స్మిత్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. ఆ భాగస్వామ్యంతోనే భారత్ వెనకడుగు వేసింది. తొలిరోజు ఆసీస్ 327/3 వద్ద ముగించడంతోనే మన ఓటమికి పునాది పడింది. భారత్ సన్నాహాలు బాగా లేవనే వాస్తవాన్ని మాత్రం అతను టెస్టు ముగిసిన తర్వాత అంగీకరించాడు. 'ఒక కోచ్‌గా మాకు ప్రాక్టీస్‌కు లభించిన సమయంతో సంతృప్తిగా లేను. అయితే అది నా చేతుల్లో లేదు. షెడ్యూల్ చాలా బిజీగా ఉంది. నాకు అందుబాటులో ఉన్న వనరులతోనే ఆడాలి' అని ద్రవిడ్ చెప్పాడు.
- అగ్రశ్రేణి బౌలర్ అశ్విన్‌ను తప్పించడం కూడా చర్చనీయాంశం. అతను భారత్‌లో మాత్రమే బాగా ఆడగలడనేది కూడా అపోహ మాత్రమే. మ్యాచ్‌కు ముందు అశ్విన్ ప్రత్యేకతపై మాట్లాడిన సచిన్ టెండూల్కర్ మ్యాచ్ తర్వాత అదే అభిప్రాయం వ్యక్తం చేయడం అతని విలువను చూపిస్తుంది. 'గొప్ప బౌలర్లకు పిచ్‌తో పని లేదు. టర్నింగ్ లేని చోట కూడా ఫలితాలు సాధించే అశ్విన్‌ను ఎందుకు ఆడించలేదో నాకూ అర్థం కాలేదు' అని సచిన్ చెప్పాడు. ఆసీస్‌పై మెరుగైన రికార్డు, ఆ జట్టులో టాప్-6లో నలుగురు ఎడంచేతి వాటం కావడంతో కచ్చితంగా అతను ప్రభావం చూపించగలిగే వాడనేది వాస్తవం. ఆల్‌రౌండర్, గత ఓవల్ టెస్టులో ప్రదర్శన ఆధారంగా శార్దుల్‌కు చోటు ఖాయం కాగా... ఉమేశ్ యాదవ్‌కు బదులు అశ్విన్‌ను ఆడించి ఉండే బాగుండేది. ఉమేశ్ ఈ మ్యాచ్‌లో పూర్తిగా విఫలం కాగా... చివరి ఇన్నింగ్స్‌లో లయన్ చూపించిన ప్రభావం అశ్విన్‌ను గుర్తు చేసింది.
- మ్యాచ్‌లో మన ఆటగాళ్ల ప్రదర్శన చూస్తే కొంత విరామం తర్వాత పునరాగమనం చేసిన అజింక్య రహానేకే ఎక్కువ మార్కులు పడతాయి. రెండు ఇన్నింగ్స్‌లలోనూ అతను ప్రభావం చూపించగలిగాడు. ఇక శార్దుల్ ఠాకూర్, రవీంద్ర జడేజా తొలి ఇన్నింగ్స్‌లో జట్టును ఆదుకున్నా... రెండో ఇన్నింగ్స్‌లో ఇద్దరూ విఫలమయ్యారు. బౌలర్లుగా వీరిద్దరూ పెద్దగా ప్రభావం చూపలేదు. షమీ, సిరాజ్ మాత్రమే చాలావరకు తమ స్థాయిలో గట్టిగా ప్రయత్నించారు. అయితే ఎన్ని విశ్లేషణలు చేసినా... టాప్-4 బ్యాటింగ్ వైఫల్యమే జట్టును దెబ్బ తీసిందనేది వాస్తవం. తొలి ఇన్నింగ్స్‌లోనూ ఈ నలుగురు విఫలం కాగా, రెండో ఇన్నింగ్స్‌లో కీలక సమయాల్లో రోహిత్, పుజారా చెత్త షాట్లు ఆడి ఛేదనను కఠినంగా మార్చేశారు. లయన్ తొలి ఓవర్లోనే స్వీప్ షాట్‌కు ప్రయత్నించి రోహిత్ చేసిన సాహసం. చాలా రోజులుగా కౌంటీల్లో అద్భుత ప్రదర్శన చేసిన పుజారా అనుభవం ఇక్కడ పనికొస్తుందని భావించగా, అది అర్ధ సత్యమే. పుజారా చేసిన పరుగులన్నీ కౌంటీలో పేలవమైన బౌలర్లు ఉండే ద్వితీయ శ్రేణి మ్యాచుల్లోనే! ఐపీఎల్ ఆడని ఒకే ఒక ఆటగాడు పుజారా ఐపీఎల్ తరహా షాట్‌కు ప్రయత్నించి అవుట్ కావడం ఆశ్చర్యకరం. 'కోహ్లి చెత్త షాట్ ఆడాడు. అది ఎందుకు ఆడాడో అతడినే అడగాలి. గెలవాలంటే సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడాలని అతను చెబుతుంటాడు. ఇలాంటి షాట్‌తో అది సాధ్యమా' అని గావస్కర్ విమర్శించడం విశేషం.


రహానే

- బుమ్రా, పంత్ లేని లోటు కనిపించిందనేది వాస్తవమే అయినా... ఓటమికి అది మాత్రం కారణం కాదు. ఆంధ్ర ఆటగాడు కేఎస్ భరత్ బ్యాటింగ్‌పై చాలా మంది విమర్శలు చేస్తున్నా ఆ మాటలకు విలువ లేదు. తన అసలు బాధ్యత వికెట్ కీపింగ్‌లో అతను అద్భుత ప్రదర్శన కనబర్చాడు. టాప్-6 పరుగులు చేయకుండా 7వ నంబర్ ఆటగాడిని ప్రశ్నించడం అర్థరహితం. రెండేళ్ల క్రితం కూడా న్యూజిలాండ్‌తో ఫైనల్లో భారత్ ఇదే టాప్-5తో ఆడింది. నాడూ రెండు ఇన్నింగ్స్‌లోలనూ బ్యాటింగ్ వైఫల్యంతో భారత్ ఓడింది. ఇప్పుడూ అదే పునరావృతమైంది.


భరత్

- మరోవైపు సొంతగడ్డపై వరుసగా రెండు సిరీస్‌లు, ఇటీవల భారత గడ్డపై మరో సిరీస్ కలిపి వరుసగా 3 సిరీస్‌లలో టీమిండియా చేతిలో ఓడిన ఆస్ట్రేలియా ఈ మ్యాచ్‌కు మాత్రం బాగా సన్నద్ధమై వచ్చింది. ఐపీఎల్ ఆడిన వార్నర్, గ్రీన్ మినహా అంతా చాలా రోజులుగా కఠోర సాధన చేశారు. అది ఓవల్‌లో కనిపించింది. రెండేళ్ల క్రితం ఓవర్‌రేట్ జరిమానాగా పాయింట్ల కోతతో ఫైనల్ అవకాశాలు కోల్పోయిన కంగారూలు ఈ సారి తుది పోరుకు అర్హత సాధించడంతో పాటు తమ పూర్తి సత్తాను చాటి విజేతగా నిలిచారు.

-సాక్షి క్రీడా విభాగం

నేనే రాజు... నేనే రారాజు

జొకోవిచ్ ఖాతాలో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్

అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన టెన్నిస్ ప్లేయర్‌గా కొత్త రికార్డు


మూడోసారి ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గిన సెర్బియా స్టార్

మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ హస్తగతం

రూ. 20 కోట్ల 41 లక్షల ప్రైజ్‌మనీ సొంతం

పురుషుల టెన్నిస్‌లో ఆదివారం అద్భుతం ఆవిష్కృతమైంది. సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుడిగా అవతరించాడు. 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్‌తో సమఉజ్జీగా ఉన్న జొకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో విజేతగా నిలిచి 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. 14 సార్లు ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన రాఫెల్ నాదల్ గాయంతో బరిలోకి దిగకపోవడంతో జొకోవిచ్‌ను టైటిల్ ఫేవరెట్‌గా పరిగణించారు. తనపై అభిమానులు పెట్టుకున్న అంచనాలను అతను నిజం చేశాడు. ఆద్యంతం నిలకడగా ఆడుతూ జొకోవిచ్ మూడోసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ గత ఏడాది ఆటకు గుడ్‌బై చెప్పడం... స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్ గాయం కారణంగా ఈ ఏడాది మరే టోర్నీలోనూ ఆడే అవకాశం లేకపోవడం... వెరసి ఈ ఏడాది మిగిలిన రెండు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ (వింబుల్డన్, యూఎస్ ఓపెన్) జొకోవిచ్ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. ఈ రెండు టోర్నీల్లోనూ జొకోవిచ్ విజేతగా నిలిస్తే టెన్నిస్ చరిత్రలో చిరకాలం రారాజుగా నిలిచిపోతాడు.

పారిస్: ఎలాంటి సంచలన ఫలితం నమోదు కాలేదు. ఊహించిన విధంగానే సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ స్థాయికి తగ్గ ప్రదర్శనతో అదరగొట్టాడు. టెన్నిస్ సీజన్‌లోని రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫ్రెంచ్ ఓపెన్‌లో జొకోవిచ్ మూడోసారి విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో మూడో సీడ్ జొకోవిచ్ 3 గంటల 13 నిమిషాల్లో 7-6 (7/1), 6-3, 7-5తో నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే)పై గెలుపొందాడు. విన్నర్ జొకోవిచ్‌కు 23 లక్షల యూరోలు (రూ. 20 కోట్ల 41 లక్షలు), రన్నరప్ కాస్పర్ రూడ్‌కు 11 లక్షల 50 వేల యూరోలు (రూ. 10 కోట్ల 20 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ విజయంతో జొకోవిచ్ 23వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్‌తో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా కొత్త చరిత్ర సృష్టించాడు. అంతేకాకుండా నేడు విడుదల చేసే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్ వన్ ర్యాంక్‌ను అందుకోనున్నాడు. మరోవైపు కాస్పర్ రూడ్‌కు మూడోసారీ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో నిరాశ ఎదురైంది. గత ఏడాది రూడ్ ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్‌లలో ఫైనల్ చేరి రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు.



గట్టి పోటీ లభించినా...

కెరీర్‌లో 34వ గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడుతున్న జొకోవిచ్ ఒకవైపు... కేవలం మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడుతున్న కాస్పర్ రూడ్ మరోవైపు... ఈ ఇద్దరిలో ఎవరికి విజయావకాశాలు ఉంటాయని అడిగితే జొకోవిచ్‌వైపే మొగ్గు చూపుతారు. ఆదివారం అలాగే జరిగింది. ఆరంభంలో జొకోవిచ్‌కు రూడ్ గట్టిపోటీ ఇచ్చినా మ్యాచ్ కొనసాగుతున్నకొద్దీ జొకోవిచ్ జోరు పెంచాడు. తొలి సెట్ తొలి గేమ్‌లో సర్వీస్ నిలబెట్టుకున్న రూడ్... 11 నిమిషాలపాటు సుదీర్ఘంగా సాగిన రెండో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేశాడు. ఆ తర్వాత తన సర్వీస్‌ను కాపాడుకొని 3-0తో ఆధిక్యంలోకి వచ్చాడు. దాంతో జొకోవిచ్‌కు విజయం అంత సులువుగా దక్కదనిపించింది. అయితే జొకోవిచ్ నెమ్మదిగా పుంజుకున్నాడు. రూడ్ ఆటతీరును అంచనా వేసి తన వ్యూహాలను మార్చుకున్నాడు. ఏడో గేమ్‌లో రూడ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి, ఎనిమిదో గేమ్‌లో తన సర్వీస్‌ను కాపాడుకున్న జొకోవిచ్ స్కోరును 4-4తో సమం చేశాడు. ఆ తర్వాత ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో జొకోవిచ్ పైచేయి సాధించి తొలి సెట్‌ను 90 నిమిషాల్లో దక్కించుకున్నాడు. రెండో సెట్‌లోని రెండో గేమ్‌లోనే రూడ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ అదే జోరులో 3-0తో ముందంజ వేశాడు. ఆ తర్వాత ఈ ఆధిక్యం కాపాడుకొని రెండో సెట్‌ను 48 నిమిషాల్లో సొంతం చేసుకున్నాడు. మూడో సెట్‌లో ఇద్దరూ నువ్వా నేనా అన్నట్లు పోరాడారు. చివరకు 11వ గేమ్‌లో రూడ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ 6-5తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత 12వ గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొని మూడో సెట్‌ను 55 నిమిషాల్లో నెగ్గి విజేతగా అవతరించాడు.

'క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్'పై మరోసారి గురి...

ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ కూడా సాధించిన జొకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ నెగ్గడంతో అతనికి మరోసారి 'క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్' (ఒకే ఏడాది నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గడం) ఘనత సాధించే అవకాశం వచ్చింది. గాయం కారణంగా నాదల్ ఈ ఏడాది మరే టోర్నీలో ఆడే అవకాశం లేకపోవడంతో జొకోవిచ్ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే 'క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్' ఘనత అందుకునే అవకాశముంది. పురుషుల టెన్నిస్‌లో రాడ్ లేవర్ (1969లో), మహిళల టెన్నిస్‌లో స్టెఫీ గ్రాఫ్ (1988లో) మాత్రమే 'క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్' ఘనతను సాధించారు. 2021లో జొకోవిచ్ వరుసగా ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టైటిల్స్ గెలిచినా...యూఎస్ ఓపెన్ ఫైనల్లో మెద్వెదెవ్ (రష్యా) చేతిలో ఓడిపోవడంతో జొకోవిచ్‌కు సువర్ణావకాశం చేజారింది.

> ఇదో అద్భుతం. 23 గ్రాండ్‌స్లామ్‌లు గెలవగలిగిన నేను అదృష్టవంతుడిని మాత్రమే కాదు. అంతకన్నా చాలా ఎక్కువ. ఏడేళ్ల వయసులో ఉన్నప్పుడు ఏదో రోజు వింబుల్డన్ గెలవాలని, ప్రపంచ నంబర్‌వన్ కావాలని కలగన్నా. కానీ ఈ స్థాయిలో నిలబడే అవకాశం దక్కడం ఎంతో గొప్పగా అనిపిస్తోంది. నా రాతను నేను రాసుకోగలనని నమ్మాను. ప్రతీ కుర్రాడిని నేను ఒకే విషయం చెబుతాను. మంచి భవిష్యత్తు కావాలంటే దానిని నువ్వే స్వయంగా సృష్టించుకోవాలి. -నొవాక్ జొకోవిచ్

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు

జొకోవిచ్		కాస్పర్ రూడ్
11	ఏస్‌లు	4
1	డబుల్ ఫాల్ట్‌లు	1
3/10	బ్రేక్ పాయింట్లు	1/4
52	విన్నర్స్	31
32	అనవసర తప్పిదాలు	31
20/27	నెట్ పాయింట్లు	14/20
12	డ్రాప్ షాట్‌లు	18
118	మొత్తం పాయింట్లు	89

1 టెన్నిస్‌లో నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీలను కనీసం మూడుసార్లు చొప్పున గెలిచిన తొలి ప్లేయర్‌గా జొకోవిచ్ నిలిచాడు.

జొకోవిచ్ 23 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్

టోర్నీ	సంవత్సరాలు	మొత్తం
ఆస్ట్రేలియన్ ఓపెన్	2008, 2011, 2012, 2013, 2015, 2016, 2019, 2020, 2021, 2023	10
ఫ్రెంచ్ ఓపెన్	2016, 2021, 2023	3
వింబుల్డన్	2011, 2014, 2015, 2018, 2019, 2021, 2022	7
యూఎస్ ఓపెన్	2011, 2015, 2018	3

అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ వీరులు (కనీసం 10)

జొకోవిచ్	(సెర్బియా)	23
రాఫెల్ నాదల్	(స్పెయిన్)	22
ఫెదరర్	(స్విట్జర్లాండ్)	20
పీట్ సంప్రాస్	(అమెరికా)	14
రాయ్ ఎమర్సన్	(ఆస్ట్రేలియా)	12
జాన్ బోర్గ్	(స్వీడన్)	11
రాడ్ లేవర్	(ఆస్ట్రేలియా)	11
బిల్ టిల్డెన్	(అమెరికా)	10

తొలిసారి ఆసియా కప్ సొంతం

- భారత జూనియర్ మహిళల హాకీ జట్టు ఘనత
- ఫైనల్లో నాలుగుసార్లు చాంపియన్ దక్షిణ కొరియాపై విజయం

కాకామిగహారా (జపాన్): నిరీక్షణ ముగిసింది. ఎట్టకేలకు ఏడో ప్రయత్నంలో భారత జూనియర్ మహిళల హాకీ జట్టు తొలిసారి ఆసియా కప్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 2-1 గోల్స్ తేడాతో నాలుగుసార్లు చాంపియన్ దక్షిణ కొరియాను బోల్తా కొట్టించింది. భారత్ తరఫున అన్ను (22వ ని.లో), నీలమ్ (41వ ని.లో) ఒక్కో గోల్ సాధించగా... కొరియా జట్టుకు పార్క్ సియో యోన్ (25వ ని.లో) ఏకైక గోల్‌ను అందించింది. 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' ప్రీతి కెప్టెన్సీలోని భారత జట్టు ఈ టోర్నీలో అజేయంగా నిలిచింది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌ల్లో గెలిచి, ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న టీమిండియా సెమీఫైనల్లో, ఫైనల్లో పటిష్టమైన జపాన్, కొరియా జట్లను ఓడించింది.



హాకీ ఇండియా నజరానా...

తొలిసారి ఆసియా కప్ టైటిల్ నెగ్గిన భారత జట్టుకు హాకీ ఇండియా (హెచ్ఐ) నజరానా ప్రకటించింది. జట్టులోని ప్రతి సభ్యురాలికి రూ. 2 లక్షలు చొప్పున... సహాయక సిబ్బందికి రూ. 1 లక్ష చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేస్తామని తెలిపింది.

సిక్కి రెడ్డి జోడీకి టైటిల్



సాక్షి, హైదరాబాద్: డెన్మార్క్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలంగాణ క్రీడాకారిణి సిక్కి రెడ్డి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచింది. డెన్మార్క్‌లోని హిలెరాడ్ పట్టణంలో ఆదివారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ (భారత్) జోడీ 21-16, 21-17తో మాడ్స్ వెస్టర్‌గార్డ్-క్రిస్టిన్ బుష్ (డెన్మార్క్) ద్వయంపై విజయం సాధించింది. 42 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కీలకదశలో సిక్కి-రోహన్ పాయింట్లు నెగ్గి పైచేయి సాధించారు. ఈ ఏడాది సిక్కి-రోహన్ జోడీకిదే తొలి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్. విజేతగా నిలిచిన సిక్కి-రోహన్ జోడీకి 2,250 డాలర్ల ప్రైజ్‌మనీతోపాటు 4000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	223	62,626
నిఫ్టీ ▽	71	18,563

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,259	△	21
డోజోన్స్	33,877	△	43
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,562	▽	38
డాక్స్	15,950	▽	40
షాంఘై	3,231	△	18
నికాయ్	32,265	▽	624

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

వృద్ధాప్యంలో ఆదాయానికి ప్రణాళిక..

రిటైర్మెంట్ తర్వాతా సంపద సృష్టి అవసరమే • ఈక్విటీలపైనా దృష్టి అవసరాలకు మించి రాబడులు ఉండాలి • ఇందుకు మెరుగైన ప్రణాళికే మార్గం ముందుగా మొదలు పెడితే సులభతరం

ప్రభుత్వరంగ ఉద్యోగులను మినహాయిస్తే మిగిలిన వారికి పదవీ విరమణ ప్రణాళిక తప్పనిసరి. ఉద్యోగం లేదా వృత్తి జీవితం ప్రారంభించినప్పుడే, దాన్ని విరమించే రోజు కోసం ప్రణాళిక రూపొందించుకోవాలి. విశ్రాంత జీవనాన్ని హాయిగా గడిపేందుకు తగినంత నిధిని సమకూర్చుకోవడమే కాదు, ఆ నిధిపై రాబడికీ అనుకూలమైన వ్యూహం ఉండాలి. మనలో చాలా మంది రిటైర్మెంట్ లక్ష్యానికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వరు. కానీ, ఆలస్యంగా దీని అవసరం తెలిసి వస్తుంది. అప్పుడు మేల్కొన్నా, సంపాదనకు ఎక్కువ కాలం మిగిలి ఉండకపోవచ్చు. కనుక ఆరంభంలోనే దృష్టి పెట్టాల్సిన దీన్ని.. అవగాహన లేమి, నిర్లక్ష్యంతో వాయిదా వేసుకోవద్దు. తగిన ప్రణాళికతోనే రిటైర్మెంట్ లక్ష్యాన్ని అధిగమించగలమని ఆర్థిక నిపుణులు తెలియజేస్తున్నారు.



ఎంత నిధి కావాలి?

రిటైర్మెంట్‌కు కావాల్సినంత నిధి నా దగ్గర ఉందా..? ఎవరికివారు ఈ ప్రశ్న వేసుకోవాలి. ఎందుకంటే అందరికీ ఒక్కటే నిధి ఇక్కడ పనిచేయకపోవచ్చు. మీ అవసరాలు, వ్యయాలపైనే ఇది ఆధారపడి ఉంటుంది. రిటైర్మెంట్ ఫండ్ కోసం మెరుగైన పెట్టుబడుల ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. ఇందుకు వాస్తవిక అంచనాలు వేసుకోవాలి. మీ నెలవారీ వ్యయాలు ఎంత? 12 నెలలకు ఎంత మొత్తం కావాలో లెక్కించాలి. అంత మేర ఏటా ఆదాయం తెచ్చి పెట్టేంత నిధి మీకు రిటైర్మెంట్ తర్వాత అవసరం అవుతుంది. ఇతరత్రా వేరే ఆదాయ వనరులు ఉంటే వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. రిటైర్మెంట్ కోసం సన్నద్ధం అయ్యేందుకు ఏఏ అంశాలపై దృష్టి పెట్టాలో తెలుసుకోవడం కీలకం అవుతుంది. తాము ఎంత కాలం పాటు జీవిస్తామనే విషయం ఎవరికీ తెలియదు. కనుక చిరాయువుగా జీవించేందుకు సన్నద్ధం కావాలి. ముఖ్యంగా రాబడులకు మించి జీవించ కూడదు. అందుకే ప్రణాళిక అవసరం. మీ అవసరాలకు మించి పెట్టుబడి నిధి కరిగిపోకుండా ఇది మార్గం చూపుతుంది. ప్రస్తుత విలువల ప్రకారం వార్షిక ఖర్చులకు 20 నుంచి 25 రెట్లు సరిపడా నిధిని సమకూర్చుకుంటే అది మీ అవసరాలను తీరుస్తుంది. ఇది అంత సౌకర్యవంతమైన నిధి కాకపోయినా, మీ అవసరాలను తీరుస్తుంది. మీ అవసరాలకు సరిపడా ఆదాయాన్ని ఇవ్వడంతోపాటు, భవిష్యత్తులో పెరిగే ఖర్చులకు తగ్గట్టు ఆదాయాన్ని వృద్ధి చేసే ప్రణాళిక వేరు. మీ ఆదాయం, వెసులుబాటు ఆధారంగా చాలా శ్రద్ధగా ప్రణాళిక వేసుకోవాలి. మధ్యలో అత్యవసరం ఏర్పడినా గట్టెక్కే నిధి వేరుగా ఉండాలి.

రిటైర్మెంట్ తర్వాత కూడా ఈక్విటీల్లో పెట్టుబడులు కలిగి ఉండాలి. ఎందుకంటే నేటి కంటే, రేపటి రోజు మరింత మొత్తం జీవనానికి ఖర్చు అవుతుంది. కనుక మన నిధి మరింత ఆదాయన్నిచ్చే విధంగా వృద్ధి చెందుతూ ఉండాలి. మీ వద్దనున్న నిధి నుంచి ఏటా 5% చొప్పున వెనక్కి తీసుకుంటున్నారనుకోండి. వచ్చే ఏడాది కూడా అదే 5% సరిపోవచ్చు. కానీ ఐదు, పదేళ్ల తర్వాత అంతే మొత్తం సరిపోకపోవచ్చు. ఎందుకంటే పదేళ్ల కాలంలో పెట్టుబడి దాని విలువను కోల్పోతుంది.

ఈక్విటీ పెట్టుబడులూ అవసరమే

కనుక ఇక్కడ నుంచి మరో ఐదు పదేళ్ల తర్వాత అవసరాలకు మరింత మొత్తం కావాలి. మీరు మీ ఫండ్ మొత్తాన్ని స్థిరాదాయ సాధనంలో ఇన్వెస్ట్ చేశారనుకోండి.. అది పెరిగే అవసరాలకు, కరిగిపోయే కరెన్సీ విలువకు తగినంత మద్దతుగా నిలవదు. ఎక్కువ మంది రిటైర్మెంట్ తర్వాత రిస్క్ వద్దని అనుకుంటుంటారు. కానీ, భవిష్యత్తులో వచ్చే భారీ ఖర్చులను భరించేంత ఆదాయానికి తగ్గ ప్రణాళిక ఉండాలి. కనుక మెరుగైన రాబడుల కోసం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడం మినహా మరో మార్గం లేదు. రిటైర్మెంట్ తర్వాత ఈక్విటీ రిస్క్ తీసుకోవడం ఎందుకని కొందరు అనుకోవచ్చు. అస్థిరతలు/ఆటుపోట్లు అన్నవి రిస్క్ కాదు. ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసినప్పుడు అది రిస్క్ అనుకుంటే.. మరి ఎలక్ట్రిసిటీ గురించి ఏమని అనుకోవాలి. ప్రమాదకరమైన విద్యుత్‌ను వాడుకుంటూ మనం జీవించడం లేదా..? అలాగే, ఈక్విటీలను మనకు అనుకూలంగా వినియోగించుకోవాలి. ఈక్విటీ పోర్ట్‌ఫోలియో ఏర్పాటులో జాగ్రత్తగా వ్యవహరిస్తే చాలు. ఒకేసారి ఇన్వెస్ట్ చేయకుండా, నిర్ణీతకాలం లోపు ఆ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టాలి. పెట్టుబడులను వైవిధ్యం చేసుకోవాలి. నిర్ణీత కాలానికి ఒకసారి చొప్పున రీబ్యాలన్స్ (మార్పులు చేర్పులు) చేసుకుంటూ వెళ్లాలి.

అస్సెట్ అలోకేషన్

అస్సెట్ అలోకేషన్ అనేది మీ సౌకర్యం కోసం అనుసరించే విధానం. మార్కెట్లు పడిపోయినప్పుడు దీనివల్ల సౌకర్యంగా ఉండొచ్చు. స్వభావ రీత్యా ఈక్విటీల పట్ల రక్షణాత్మకంగా లేదా దూకుడుగా ఉన్నా కానీ.. ఆరంభంలో రక్షణాత్మకంగానే కేటాయింపులు చేసుకోవాలి. ఎంత ధైర్యవంతులైనా సరే మార్కెట్లు పడిపోయినప్పుడు ఆందోళన చెందడం సహజం. కనుక మొదటిసారి ఇన్వెస్టర్ అయినా, రక్షణ ధోరణితో కూడిన ఇన్వెస్టర్ అయినా ఈక్విటీలకు కేటాయింపులు 25 శాతం లేదా 33 శాతంగానే ఉండాలి. దీన్ని పేపర్‌పై రాసుకోవాలి. మొదటి కొన్నేళ్లపాటు ఇదే విధానాన్ని అనుసరించాలి. ఏడాదికోసారి ఈ కేటాయింపులను సమీక్షించుకోవాలి. దీన్నే అస్సెట్ అలోకేషన్ అంటారు. ఉదాహరణకు ఈక్విటీలకు 33 శాతం కేటాయింపులు చేయాలన్నది మీ ప్రణాళిక. ఏడాది కాలంలో మార్కెట్ ర్యాలీతో మొత్తం పెట్టుబడుల్లో ఈక్విటీల వాటా 50 శాతానికి చేరిందని అనుకుందాం. అప్పుడు 33 శాతానికి దిగొచ్చే విధంగా ఈక్విటీ పెట్టుబడులను విక్రయించాలి. మిగిలిన మొత్తాన్ని డెట్‌కు మళ్లించుకోవాలి. ఇలా కొంత కాలం చేసిన తర్వాత ఈక్విటీల పట్ల అవగాహన, నమ్మకం పెరుగుతుంది. అప్పుడు అవసరానికి అనుగుణంగా అస్సెట్ అలోకేషన్‌ను సవరించుకోవచ్చు. రిటైర్మెంట్ ఫండ్‌పై 3.5–4 శాతం రాబడి వచ్చినా సరిపోతుందని అనుకుంటే అప్పుడు మీ దగ్గర మెరుగైన ఫండ్ ఉన్నట్టుగా భావించాలి. ఇలాంటి వెసులుబాటు ఉన్న వారు రిటైర్మెంట్ ఫండ్‌ను ఈక్విటీ, డెట్‌కు సమానంగా కేటాయించుకోవచ్చు. లేదా ఈక్విటీకి 40 శాతం, డెట్‌కు 60 శాతం కేటాయించుకోవచ్చు. 5–20 శాతాన్ని షార్ట్ టర్మ్ డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. పీపీఎఫ్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్‌నకు కేటాయింపులు చేసుకోవాలి. ఇక తమపై ఆధారపడిన వారు లేకపోతే.. అప్పుడు 25 లేదా 33 శాతాన్ని డెట్‌కు కేటాయించి, మిగిలిన మొత్తాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. దీన్ని రీబ్యాలన్స్ చేసుకుంటూ ఉండాలి.





రిటైర్మెంట్ నాటికి రుణ భారం నుంచి పూర్తిగా బయటకు రావాలి. అన్ని పెట్టుబడులకూ ఒక్కటే బ్యాంక్ ఖాతా వినియోగించాలి. పెట్టుబడుల కేటాయింపులు (అస్సెట్ అలోకేషన్) ఏ విభాగానికి ఎంత మేర ఉండాలో నిర్ణయించుకోవాలి. ఈక్విటీలకు 50 శాతమా లేక 40 లేదా 25 శాతమా.. అలాగే డెట్‌కు ఎంతన్నది తేల్చుకోవాలి. వీటి నుంచి అవసరాలకు సరిపడా ప్రతి నెలా రాబడి వచ్చేలా చూసుకోవాలి. ఇతర వనరుల ద్వారా ఆదాయం వస్తుందేమో చూసుకోవాలి. పింఛను సదుపాయం ఉందా? ఉంటే వచ్చే మొత్తం సరిపోతుందా? అద్దె రూపంలో ఆదాయం వచ్చే మార్గం ఉందా? డివి

కార్యాచరణ ప్రణాళిక..

డెండ్ల రూపంలో ఆదాయం వస్తుందా? విదేశాల్లో స్థిరపడిన పిల్లల నుంచి రెమిటెన్స్ వస్తుందా? ఇలా అన్ని రూపాల్లోని ఆదాయ వనరులను లెక్కించుకోవాలి. అప్పుడు మీ నెలవారీ ఖర్చులకు సరిపడా ఆదాయం వస్తే నిశ్చింతగా ఉండొచ్చు. తరుగు ఉంటే ఆ మేరకు పెట్టుబడుల నుంచి ఆదాయం వచ్చే ఏర్పాటు చేసుకోవాలి. మీ ఖర్చులకు మించి ఆదాయం వస్తుంటే సంతోషంగా విశ్రాంతి జీవనాన్ని గడిపేయొచ్చు. మిగులు ఉంటే ఆ మొత్తాన్ని తిరిగి ఇన్వెస్ట్ చేసుకోవడమే సరైనది. మీ పెట్టుబడి నుంచి తీసుకునే మొత్తం రాబడి కంటే ఎక్కువ ఉండకూడదు. అలాగే, మీ పెట్టుబడి నుంచి తీసుకునే మొత్తం రాబడికి సమాన స్థాయిలోనూ ఉండకూడదు. ఎందుకంటే ఏటా ద్రవ్యోల్బణ ప్రభావంతో 5–6 శాతం మేర పెట్టుబడి విలువ క్షీణిస్తుంది. కనుక పెట్టుబడి నుంచి తీసుకునే మొత్తం రాబడి కంటే తక్కువే ఉండాలి. అప్పుడే మీ పెట్టుబడి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వృద్ధి చెందుతుంది. ఒకవేళ మీ పెట్టుబడిపై వచ్చే ఆదాయానికి సమాన స్థాయిలో ప్రతి నెలా ఉపసంహరించుకుంటున్నారని అనుకుందాం. అలాంటి సందర్భాల్లో భవిష్యత్తులో పెరిగే ఖర్చులకు సరిపడా ఆదాయం పెంచుకునేందుకు కొంత మొత్తాన్ని ప్రతి నెలా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాలి. సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, పీపీఎఫ్‌లో పెట్టుబడులు కొనసాగించండి. ఎందుకంటే ఇవి సురక్షితమైన, మెరుగైన రాబడులు కలిగిన డెట్ సాధనాలు. ఏటా ఏప్రిల్‌లో సమీక్ష నిర్వహించుకోవాలి. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీలపై రాబడులు ఏ మేరకు ఉన్నాయి? డెట్‌లో ఏ మేరకు రాబడి వచ్చింది? అన్ని పరిశీలించుకోవాలి. ఉదాహరణకు 2013లో రూ.50 లక్షలను ఈక్విటీ, డెట్‌లో సమానంగా ఇన్వెస్ట్ చేశారని అనుకుందాం. ఏటా మీ అవసరాలకు 6 శాతం ఉపసంహరించుకోవాలన్నది ప్రణాళిక. అప్పుడు ఒక ఏడాదికి రూ.3 లక్షలు అవసరం అవుతుంది. అదే 2014లో రూ.3,18,000 అవసరం అవుతుంది. ఇలా ఏటా ఉపసంహరించుకోవాల్సిన మొత్తం పెరుగుతూ వెళుతుంది. ఈ ప్రకారం 2023లో రూ.4,32,000 అవసరం అవుతుంది. 6 శాతం ఉపసంహరించుకోవాలన్నది ప్రణాళిక. కనుక ఇప్పుడు మీ వద్ద రూ.72,00,000 పెట్టుబడి ఉండాలి. అప్పుడే 6 శాతం చొప్పున రూ.4,32,000 తీసుకోగలరు. అందుకే మీ పెట్టుబడి నిధి కూడా వృద్ధి చెందాలి.

జూన్ త్రైమాసికంలో వృద్ధి 6.3 శాతంలోపే..: మూడీస్

ఆర్‌బీఐ అంచనాలకన్నా తక్కువ



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) 6 నుంచి 6.3 శాతం మధ్య ఉండే అవకాశం ఉందని అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజ సంస్థ– మూడీస్ అంచనావేసింది. ప్రభుత్వానికి అంచనాలకన్నా తక్కువ ఆదాయాలు నమోదయ్యే అవకాశాలు దీనికి కారణంగా పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గత వారం ద్రవ్య పరపతి విధాన సమీక్షలో వేసిన 8 శాతం అంచనాలకన్నా తాజా మూడీస్ అంచనా ఎంతో దిగువన ఉండడం గమనార్హం. 2022–23 చివరి త్రైమాసికం (జనవరి–మార్చి)లో నమోదయిన 6.1 శాతానికి దాదాపు సరిసమానంగా ఉండడం మరో విశేషం. వ్యవస్థలో అధిక వడ్డీరేట్లు పెట్టుబడులపై ప్రభావం చూపుతాయని కూడా మూడీస్ అభిప్రాయపడింది. 2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరాల్లో వృద్ధి రేట్లు వరుసగా 6.1 శాతం, 6.3 శాతాలుగా నమదవుతాయని మూడీస్ అంచనా. మూడీస్ భారత్‌కు ప్రస్తుతం 'బీఏఏ3' రేటింగ్ ఇస్తోంది. ఇది అత్యంత దిగువ ఇన్వెస్ట్‌మెంట్ స్థాయి. చెత్త రేటింగ్‌కన్నా ఒక అంచె ఎక్కువ. మరో రెండు అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజాలు ఫిచ్, ఎస్‌అండ్‌పీ కూడా భారత్‌కు ఇదే తరహా రేటింగ్ ఇస్తున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

12-6-2023	
విశాఖ	515–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470–00
విజయవాడ	470–00
రిటైల్ ధర (డజను)	72.00
11-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

హ్యాపీయెస్ట్ మైండ్స్ | చాయిస్ ఇంటర్నేషనల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 915
టార్గెట్: రూ. 1,096



ఎందుకంటే: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ కంపెనీ హ్యాపీయెస్ట్ మైండ్స్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో పటిష్ట పనితీరు ప్రదర్శించింది. జనవరి–మార్చి(క్యూ4)లో మొత్తం ఆదాయం వార్షికంగా 26 శాతం జంప్‌చేసింది. రూ. 378 కోట్లను తాకింది. కరెన్సీ నిలకడ(సీసీ) ప్రాతిపదికన 15 శాతం వృద్ధితో 4.6 కోట్ల డాలర్లకు చేరింది. మొత్తం ఆదాయంలో తదుపరి తరం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ విభాగం నుంచే 96 శాతాన్ని సమకూర్చుకుంది. దీనిలో 94 శాతం ఎగైల్ బిజినెస్ సొల్యూషన్ల నుంచే సాధించింది. క్యూ4 ఫలితాలలో 2023 జనవరిలో సొంతం చేసుకున్న ఎస్‌ఎంఐ బిజినెస్(రూ. 18 కోట్లు) పనితీరు కలసి ఉంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో మరింత పటిష్ట ఫలితాలు సాధించనున్నట్లు యాజమాన్యం పేర్కొంది. ఇందుకు ఇప్పటికే గెలుపొందిన డీల్స్‌తోపాటు.. మరిన్ని కాంట్రాక్టులపై అంచనాలు దోహదపడినట్లు తెలియజేసింది. గతేడాది క్యూ4లో వడ్డీ, పన్ను చెల్లింపునకు ముందు(ఇబిట్) మార్జిన్లు వార్షిక ప్రాతిపదికన నిలకడ చూపుతూ 21 శాతం వద్దే నిలిచాయి. క్యూ3లో సాధించిన 80.1 శాతం వినిమయ(యుటిలైజేషన్) రేటుతో పోలిస్తే 74.6 శాతానికి తగ్గడం మార్జిన్లపై ప్రభావం చూపింది. అయితే పూర్తి ఏడాదికి 26 శాతానికిపైగా నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు సాధించింది. ఇది తొలి అంచనాల(గైడెన్స్) 22–24 శాతానికంటే అధికం. క్లౌడ్ మైగ్రేషన్, లెగసీ అప్లికేషన్లుసహా, ప్లాట్‌ఫామ్స్ ఆధునీకరణ, డేటా ప్లాట్‌ఫామ్స్ ఏర్పాటు, అనలిటిక్స్ వినియోగం తదితర సర్వీసులు కంపెనీకి భవిష్యత్‌లో లబ్దిని చేకూర్చే వీలుంది.

సఫారీ ఇండస్ట్రీస్ | ఐడీబీఐ క్యాపిటల్ ఈక్విటీ రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,871
టార్గెట్: రూ. 3,223



ఎందుకంటే: బ్రాండెడ్ లగేజీ, ఫ్యాషన్ ప్రొడక్టుల తయారీ కంపెనీ సఫారీ ఇండస్ట్రీస్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో అంచనాలను మించిన పనితీరు ప్రదర్శించింది. జనవరి–మార్చి(క్యూ4)లో మొత్తం ఆదాయం వార్షికంగా 57 శాతం జంప్‌చేసింది. రూ. 302 కోట్లను తాకింది. ప్రత్యర్థి కంపెనీ వీఐపీ 27 శాతం వృద్ధిని సాధించగా.. ఇందుకు దేశవ్యాప్తంగా టూరిజం కార్యకలాపాలు ఊపందుకోవడం దోహదపడింది. వార్షిక ప్రాతిపదికన స్థూల మార్జిన్లు 4.47 శాతం మెరుగుపడి 43 శాతాన్ని అధిగమించాయి. ఇందుకు ప్రొడక్టుల ధరల పెంపు, ముడివ్యయాలలో నిలకడ సహకరించాయి. దీంతో నిర్వహణ లాభం(ఇబిటా) 213 శాతం దూసుకెళ్లి రూ. 52 కోట్లకు చేరింది. ఇదే కాలంలో వీఐపీ 97 శాతం పురోభివృద్ధిని అందుకుంది. ఇక ఇబిటా మార్జిన్లు 17.1 శాతంగా నమోదయ్యాయి. అర్బన్ జంగిల్ బ్రాండుతో కంపెనీ ప్రీమియం ప్రొడక్టుల విభాగంలోకి ప్రవేశించింది. తద్వారా వీఐపీ ఇండస్ట్రీస్, శామ్‌సొనైట్‌కు చెందిన ఖరీదైన బ్రాండ్లతో పోటీకి దిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం సఫారీ ప్రీమియం ప్రొడక్టులకు పటిష్ట స్పందన లభిస్తోంది. ఇందుకు కోవిడ్–19 తదుపరి లగేజీ పరిశ్రమ జోరందుకోవడం సైతం దోహదం చేస్తోంది. వెరసి రానున్న రెండు, మూడేళ్లలో కంపెనీ మార్జిన్లకు అదనపు బూస్ట్ లభించనుంది. దీనికితోడు గతేడాది క్యూ4లో సాధించిన ఫలితాలు 2024–25 కాలంలో మార్జిన్ల అంచనాలను పెంచుతున్నాయి. దీంతో ఇబిటా వార్షికంగా 11 శాతం చొప్పున బలపడవచ్చని భావిస్తున్నాం. పటిష్ట యాజమాన్య నిర్వహణ నేపథ్యంలో అమ్మకాలలో పరిశ్రమను మించిన వృద్ధి, అత్యధిక నిర్వహణ లాభ మార్జిన్లను సాధించే వీలుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

శ్రీరామ్ లైఫ్ నుంచి గోల్డెన్ జూబ్లీ ప్లాన్



శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తాజాగా గోల్డెన్ జూబ్లీ పేరిట ప్రత్యేక ప్లాన్‌ను ఆవిష్కరించింది. పాలసీదారుకు ఇటు లైఫ్ కవరేజీ అందిస్తూనే అటు ఆర్థిక లక్ష్యాలకు కూడా తోడ్పాటు అందించేలా ఈ యూనిట్ లింక్డ్ పథకాన్ని తీర్చిదిద్దింది. ఈ పాలసీ లైఫ్ గోల్ (నిర్దిష్ట కాలం వరకు కవరేజీ), లెగసీ (100 ఏళ్ల వరకు కవరేజీ) అని రెండు ఆప్షన్లలో లభిస్తుంది. పాలసీ వ్యవధిలో నిర్దిష్ట ఆర్థిక లక్ష్యాలను సాధించదల్చుకునే వారికి లైఫ్ గోల్ ఆప్షన్ ప్రయోజనకరంగా ఉంటుంది. పాలసీదారులు చివరి వరకు పెట్టుబడులను కొనసాగిస్తూ తమ కుటుంబ సభ్యులకు గణనీయంగా సంపదను అందించేందుకు లెగసీ ఆప్షన్ ఉపయోగపడుతుంది. లైఫ్ గోల్ ఆప్షన్‌లో 35 ఏళ్ల వయస్సు గల వ్యక్తి 30 ఏళ్ల వ్యవధికి పాలసీ తీసుకుని ఏటా రూ. 3 లక్షలు చెల్లిస్తే మార్కెట్ పరిస్థితులు, రాబడి రేటును బట్టి ఆఖర్లో రూ. 1.45 కోట్ల నుంచి రూ. 2.93 కోట్ల వరకు ఫండ్‌ను సమకూర్చుకోవచ్చు. అదే లెగసీ ఆప్షన్‌లో 65 ఏళ్ల కాల వ్యవధిలో రూ. 6.64 కోట్ల నుంచి రూ. 39.72 కోట్ల వరకు లభించవచ్చని సంస్థ తెలిపింది.

వ్యాల్యూ స్టాక్‌ను గుర్తించడం ఎలా?

అంతర్గతంగా ఎంతో విలువ దాగి ఉన్న స్టాక్స్‌ను గుర్తించడం ఎలా? – కపిల్

వాస్తవ విలువ కంటే తక్కువలో ట్రేడ్ అవుతున్న (అండర్ వ్యాల్యూడ్) స్టాక్‌ను గుర్తించం కూడా ఒక కళనని చెప్పుకోవచ్చు. డిస్కౌంటింగ్ సూత్రాన్ని ఇక్కడ అమలు చేసి చూడాల్సి ఉంటుంది. అంటే వచ్చే ఐదు, పదేళ్ల కాలంలో కంపెనీ ఆదాయాలు ఏ మేరకు వృద్ధి చెందుతాయో చూడాలి. అలాగే, యాజమాన్యం ఎంత ఉత్తమమైనది? అన్నది కూడా చూడాలి. కంపెనీ నిధులను నిజాయితీగా నిర్వహిస్తారా? విశ్వసనీయత కలిగిన వారేనా? అలాగే, ఆ కంపెనీ పనిచేస్తున్న రంగంలో మంచి వృద్ధికి అవకాశం ఉందా? భవిష్యత్తు ఉన్నదేనా? అవకాశాలను అనుకూలంగా మార్చుకోగలదా? వీటిని విశ్లేషించుకోవాలి. అలాగే, మీకు మంచిగా కనిపించిన కంపెనీల గురించి ఎన్నో ప్రతికూల వ్యాఖ్యానాలు వినిపిస్తుంటాయి. వాటన్నింటినీ తట్టుకుని పెట్టుబడులను కొనసాగించే బలం కూడా కావాలి.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను మూడు, నాలుగేళ్ల కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ప్రస్తుతం వడ్డీ రేట్లు గరిష్ట స్థాయిలో ఉన్నందున, ఇక్కడి నుంచి వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు ఉన్నందున లాంగ్‌టర్మ్ బాండ్లలో ఇన్వెస్ట్ చేయడం మంచిదేనా? దీనికంటే మరేదైనా మెరుగైన ఆప్షన్ ఉందా? – అంకిత్ ముద్రా

వడ్డీ రేట్లు, వీటికి సంబంధించిన సైకిల్ (కాల వ్యవధి) అనేవి ఊహించనివి. పరిస్థితులు, సూక్ష్మ ఆర్థిక అంశాల ఆధారంగా ఇవి మార్పులకు లోనవుతుంటాయి. కరోనా మహమ్మారి రాకతో ఫైనాన్షియల్ మార్కెట్లలో పరిస్థితులను చక్కదిద్దేందుకు 2020 మార్చి–మేలో వడ్డీ రేట్ల కోతను గుర్తుకు తెచ్చుకోండి. ద్రవ్యోల్బణం నియంత్రణకు ఇటీవల వరుసగా చేపట్టిన రేట్ల పెంపులు కూడా ఒక నిదర్శనమే. కచ్చితంగా వడ్డీ రేట్ల సైకిల్‌ను అంచనా వేయడం ఎవరి వల్లా కాదు. ఆ విధమైన అంచనాలతో పోర్ట్‌ఫోలియో ఏర్పాటు చేసుకోవడం రిస్క్ తీసుకోవడమే అవుతుంది. కనుక స్థూల ఆర్థిక అంశాల కంటే మీ పెట్టుబడుల కాలవ్యవధికి అనుగుణమైన సాధనాలపై దృష్టి సారించడమే మంచిది. మూడు నాలుగేళ్ల కోసం ఇన్వెస్ట్ చేసుకునేట్టు అయితే అప్పుడు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే మెరుగైన సాధనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సమయంలో పెట్టుబడికి రక్షణ ఉండాలి. అటువంటప్పుడు షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ అనుకూలం. ఈ పథకం కాల వ్యవధి, మీ పెట్టుబడుల కాల వ్యవధికి ఒకే రకంగా ఉంటుంది. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సెక్యూరిటీల్లో (డెట్ సాధనాలు) పెట్టుబడులు పెట్టడం వెనుక ఉద్దేశ్యం స్థిరమైన రాబడులు ఆశించడమే. ఈక్విటీల్లో మాదిరి అస్థిరతలు లేకుండా, పెట్టుబడికి రక్షణ కల్పించుకోవడం. లాంగ్ టర్మ్ బాండ్ ఫండ్స్ చూడ్డానికి ఆకర్షణీయంగా అనిపించొచ్చు. కానీ అవి ఎంతో అస్థిరతలతో ఉంటాయి. దీర్ఘకాలంలో షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో మాదిరే రాబడులను ఇస్తాయి. డెట్ ఫండ్స్ ఎంపిక చేసుకునేప్పుడు అనుసరించాల్సిన సూత్రం మీ పెట్టుబడుల కాల వ్యవధి, ఎంపిక చేసుకునే సాధనం పెట్టుబడుల కాలవ్యవధి ఒకే విధంగా ఉండాలి. ఇక మీ పెట్టుబడుల కాలవ్యవధి మూడు నాలుగేళ్లు కనుక ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌ను కూడా చూడొచ్చు. ఈక్విటీలతో వచ్చే రిస్క్ కొంత ఇందులో ఉంటుంది. ఇవి ఈక్విటీలు, డెట్, ఆర్బిట్రేజ్ సాధనాల్లో ఇన్వెస్ట్ చే స్తాయి. లాంగ్ డ్యురేషన్ ఫండ్స్ కంటే ఎక్కువ రాబడులు ఇస్తాయి. అచ్చమైన ఈక్విటీలతో పోలిస్తే తక్కువ అస్థిరతలతో మెరుగైన రాబడులు ఇస్తాయి.

శామ్కో యాక్టివ్ మూమెంటమ్ ఫండ్



న్యూఢిల్లీ: దేశంలో మొదటి యాక్టివ్ మూమెంటమ్ ఫండ్‌ను శామ్కో అస్సెట్ మేనేజ్‌మెంట్ ప్రారంభించింది. రిస్క్ సర్దుబాటుతో కూడిన రాబడులు అందించడం ఈ పథకం విధానంలో భాగంగా ఉంటుందని తెలిపింది. భారీ వృద్ధితో కూడిన మూమెంటమ్ పెట్టుబడి అవకాశాలపై పథకం దృష్టి పెడుతుందని పేర్కొంది. స్టాక్ ధరల్లో బ్రేకవుట్, ధరల్లో ఆధిపత్యం తదితర మూమెంటమ్ అవకాశాలను గుర్తించి ఈ పథకం పెట్టుబడి పెడుతుంది. ఇందుకు ఆల్గోరిథమ్ సేవలను కూడా ఉపయోగించుకుంటుంది. పరాస్ మటాలియా ఫండ్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఈ నూతన పథకం ఈ నెల 15 నుంచి 29 వరకు చందాలను స్వీకరించనుంది.

సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తు.. 'పింక్ వాట్సాప్'!

వాట్సాప్ అప్‌డేట్ ఫీచర్ పేరిట లింక్‌లు పంపుతున్న వైనం

- వాటిని తెరిస్తే బ్యాంకు పాస్‌వర్డ్‌లు సహా ఫోన్లోని డేటా అంతా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి..
- మన వాట్సాప్ ద్వారా ఇతర వాట్సాప్ గ్రూపుల్లోకి ఆటోమేటిక్‌గా లింక్‌ల ఫార్వార్డ్
- వెంటనే ఆయా లింక్‌లను అన్‌ఇన్‌స్టాల్ చేసుకోకుంటే ప్రమాదమంటున్న పోలీసులు



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ ద్వారా ప్రజల నుంచి భారీగా డబ్బు కాజేసేందుకు సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త మార్గాలను తెరపైకి తెస్తున్నారు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ల వినియోగదారుల్లో అత్యధికం మంది ఉపయోగించే వాట్సాప్ ద్వారా మాల్‌వేర్‌లను చొప్పించే ప్రణాళికను ఇటీవల కాలంలో అమలు చేస్తున్నారు. ఆకుపచ్చ రంగులో కనిపించే వాట్సాప్... సరికొత్త ఫీచర్లతో గులాబీ రంగులో (పింక్) వచ్చిందంటూ బురిడీ కొట్టిస్తున్నారు. ఇందుకోసం వాట్సాప్‌ను అప్‌డేట్ చేసుకోవాలంటూ సైబర్ నేరగాళ్లు లింక్‌లు పంపుతున్నట్లు పోలీసులు హెచ్చరిస్తున్నారు. సాధారణ ఎస్‌ఎంఎస్‌లతోపాటు వాట్సాప్ మెసేజ్‌ల రూపంలో ఈ లింక్‌లు పంపుతున్నట్లు తెలిపారు. ఎవరైనా ఈ లింక్‌లను క్లిక్ చేసి అది అడిగే అప్‌డేట్ కోసం ఫోన్ నంబర్, ఓటీపీ ఎంటర్ చేస్తే ఫోన్లోని ఫొటోలు, కాంటాక్ట్ నంబర్లు, బ్యాంకుల పాస్‌వర్డ్‌ల వంటి వివరాలన్నీ సైబర్ నేరస్తుల చేతుల్లోకి వెళ్లిపోతాయని పోలీసులు చెబుతున్నారు. అలాగే ఆయా వ్యక్తులు సభ్యులుగా ఉండే వాట్సాప్ గ్రూప్‌లలోకి ఆటోమేటిక్‌గా పింక్ వాట్సాప్ పేరిట లింక్‌లు షేర్ అవుతాయని పేర్కొన్నారు. కీబోర్డ్ ఆధారిత మాల్‌వేర్‌లను పింక్ వాట్సాప్‌లోకి చొప్పించడం ద్వారా బ్యాంకు పాస్‌వర్డ్‌లను తస్కరించి సైబర్ నేరగాళ్లు డబ్బు కొట్టేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పింక్ వాట్సాప్ పేరిట వచ్చిన లింక్‌లను ఓపెన్ చేసి ఎవరైనా ఇన్‌స్టాల్ చేసుకొని ఉంటే వాటిని వెంటనే అన్‌ఇన్‌స్టాల్ చేయాలని సూచిస్తున్నారు. అన్‌ఇన్‌స్టాల్ చేస్తేనే ఆ నకిలీ లింక్‌లను షేర్ కాకుండా ఆపగలుగుతామని చెబుతున్నారు. ఒకవేళ మనకు తెలిసిన వారి నుంచి ఇలా పింక్ వాట్సాప్ పేరిట ఏవైనా మెసేజ్‌లు వస్తే వారిని వెంటనే అప్రమత్తం చేయాలని సూచిస్తున్నారు.



చేపలతో గిరిజన యువకుడు, ముళ్లు కలిగిన వింత చేప

వలకు చిక్కిన వింత చేపలు

వర్ధన్నపేట: వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ శివారు తాళ్లకుంటతండాలోని ఎస్సారెస్పీ కాలువలో చేపల వేటకు వెళ్లిన యువకులు వాంకుడోతు అభి, రవికి రెండు వింత చేపలు చిక్కాయి. వీరు విసిరిన వలలో సాధారణ చేపలతోపాటు 50 సెంటీమీటర్ల పొడవుతో ఒళ్లంతా ముళ్లు, కింది భాగంలో నోరుతో ఉన్న రెండు చేపలు చిక్కాయి. అరుదైన ఈ చేపల్ని 'సక్కర్ మౌత్ క్యాట్ ఫిష్'గా పిలుస్తారని స్థానిక జాలర్లు చెప్తున్నారు.



అట్లాంటాలో ఆప్టా కన్వెన్షన్

సెప్టెంబర్ 1 నుంచి మూడు రోజులపాటు సదస్సు

బంజారాహిల్స్ (హైదరాబాద్): అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్టా) 15 ఏళ్ల జాతీయ కన్వెన్షన్‌ను జార్జియా రాష్ట్రంలోని అట్లాంటాలో.. సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొట్టే ఉదయ భాస్కర్, ఎ.బాబీ ప్రకటించారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆప్టా కన్వెన్షన్‌కు సుమారు 7000 మంది సభ్యులు హాజరవుతారని భావిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కమ్యూనిటీ లీడర్లు, పాఠశాలలు, దాతలు, వ్యాపారవేత్తలు, ఇతర వివిధ రంగాల ప్రముఖులకు ఆహ్వానాలు అందజేసినట్టు వివరించారు. అమెరికాకు వచ్చే వేలాది మంది విద్యార్థులకు ఇమిగ్రేషన్ సేవలు, విద్య, ఉపాధి సౌకర్యాలను కూడా కల్పించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. తమిళనాడు, పాండిచ్చేరి, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అడ్డదారులు తొక్కితే నిషేధమే!

ఎంబీబీఎస్ ప్రవేశాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.2 కోట్లు జరిమానా

- మెడికల్ కాలేజీలకు జాతీయ మెడికల్ కమిషన్ హెచ్చరిక
- తప్పుడు పద్ధతుల్లో కోర్సులో చేరితే విద్యార్థులపై వేటు
- దేశవ్యాప్తంగా ఒకేసారి ఉమ్మడి కౌన్సెలింగ్
- కనీస అర్హత మార్కుల ద్వారానే అడ్మిషన్లు
- కాలేజీలకు రేటింగ్, అనుమతుల కోసం 'మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు'
- దీని ముందస్తు అనుమతితోనే కొత్త కాలేజీలు, కోర్సుల ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య (ఎంబీబీఎస్) ప్రవేశాల్లో అడ్డదారులు తొక్కే మెడికల్ కాలేజీలపై నిషేధం విధిస్తామని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) హెచ్చరించింది. తప్పుడు పద్ధతుల్లో ఇచ్చే మొదటి సీటుకు రూ.కోటి, రెండో సీటుకు రూ.2 కోట్లు జరిమానా విధిస్తామని.. మరోసారి తప్పు చేస్తే తదుపరి ఏడాది సంబంధిత మెడికల్ కాలేజీని నిషేధిస్తామని స్పష్టం చేసింది. మెడికల్ అడ్మిషన్లు తదితర అంశాలపై గెజిట్ నోటిఫికేషన్లను జారీచేసింది.

బ్లాక్ చేసి అమ్ముకుంటూ..

దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలు ఎంబీబీఎస్ సీట్లను బ్లాక్ చేసి కోట్ల రూపాయలకు అమ్ముకుంటున్న ఉదంతాలు ఎన్నో బయటపడుతున్నాయి. ముఖ్యంగా బీ కేటగిరీ సీట్లను ఎన్నారై సీట్లుగా మార్చుకోవడం, తప్పుడు అర్హతలున్నా సీట్లు ఇవ్వడం, అడ్మిషన్ల కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా సీట్లు కేటాయించడం వంటి అక్రమాలు జరుగుతున్నాయి. దీనితో అర్హులైన విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది.

ఇక నుంచి మెడికల్ కాలేజీలకు రేటింగ్

వైద్య కాలేజీల ఏర్పాటు, కొత్త కోర్సుల అనుమతి కోసం ఎన్‌ఎంసీ నిబంధనలను విడుదల చేసింది. వీటి అమలుకు 'మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు (మార్బ్)'ను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించింది. మార్బ్ నుంచి లిఖితపూర్వక అనుమతులు లేకుండా కొత్తగా వైద్య కాలేజీలు ఏర్పాటు చేయడానికిగానీ, కొత్త కోర్సులు ప్రారంభించడానికిగానీ వీల్లేదు. ఎంబీబీఎస్, పీజీ కోర్సుల కోసం కొత్త కాలేజీల ఏర్పాటుకు ఈ సంస్థ దరఖాస్తులు ఆహ్వానించినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో ఏర్పాటైన స్వయం ప్రతిపత్తి సంస్థలు, సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద ఏర్పాటైన కంపెనీలు దరఖాస్తు చేసుకోవచ్చు. మార్బ్ అన్ని కోణాల్లో పరిశీలించి అనుమతి ఇస్తుంది. మార్బ్ అనుమతి లేకుండా ఇప్పటికే తరగతులు నిర్వహిస్తున్న ఏ మెడికల్ కాలేజీలో కూడా సీట్లు పెంచడానికి వీల్లేదు. మార్బ్ థర్డ్ పార్టీ సంస్థల సాయంతో మెడికల్ కాలేజీల పనితీరును పరిశీలించి రేటింగ్ ఇస్తుంది. ఇక ప్రతీ మెడికల్ కాలేజీ వార్షిక నివేదికను సంబంధిత బోర్డులకు అందజేయాలి.

గుర్తింపు పొందిన వైద్య అర్హత ఉంటేనే..

గుర్తింపు పొందిన వైద్య అర్హతలు లేకుండా ఏ వ్యక్తి కూడా మెడికల్ ప్రాక్టీస్ చేయకూడదని ఎన్‌ఎంసీ స్పష్టం చేసింది. ఇందుకోసం 'మెడికల్ ప్రాక్టీషనర్ల నమోదు, మెడిసిన్ నిబంధనల ప్రాక్టీస్ లైసెన్స్- 2023'ను విడుదల చేసింది. మెడికల్ ప్రాక్టీస్ చేయడానికి లైసెన్సు కోసం నేషనల్ మెడికల్ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలి. విదేశాల్లో వైద్యవిద్య చదివినవారు జాతీయ స్థాయిలో సంబంధిత పరీక్ష పాస్ కావాలి. రాష్ట్ర వైద్య మండలిలో దరఖాస్తు ఆమోదం పొందిన తర్వాత, అది జాతీయ వైద్య రిజిస్టర్‌లోనూ, రాష్ట్ర వైద్య రిజిస్టర్‌లో కూడా కనిపిస్తుంది. రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్‌కు జారీచేసిన మెడిసిన్ ప్రాక్టీస్ లైసెన్స్ ఐదేళ్ల వరకు చెల్లుబాటు అవుతుంది. తర్వాత స్టేట్ మెడికల్ కౌన్సిల్‌కు దరఖాస్తు చేసుకుని లైసెన్స్‌ను పునరుద్ధరించుకోవాలి.

అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్యం

అత్యున్నత, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా వైద్య విద్య ఉండాలని ఎన్‌ఎంసీ స్పష్టం చేసింది. అందుకోసం 'గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్-2023'ను విడుదల చేసింది. విద్యార్థికి ఉన్నతమైన, నాణ్యమైన ఎంబీబీఎస్ లేదా ఇతర అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యను అందించడానికి తగిన ప్రణాళికను అమలు చేయాలని సూచించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.